ఆంధ్రప్రదేశ్ గురించి

* 1971 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 7.93 శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికి సమానం.

* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 2,75,109 చ. కి. మీటర్లు.

* 1971 లో సేకరించిన లెక్కల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ జనాభా 4,33,94,951 మంది. దేశజనాభా 54,69,55,945.

* 1971 లెక్కల ప్రకారం, రాష్ట్ర జనాభాలో అక్షరాస్యులు 24.56 శాతం మంది వున్నారు. 1961 లో 21.19 శాతం. భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం 1971 లో 29.35. 1961లో 24.03 శాతం.

* మన రాష్ట్రంలో జనాభా సాంద్రత చ. కి. మీ. 1కి 157 మంది హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ. కి. మీ. 1కి, 362. అన్ని జిల్లాల కంటే యిది ఎక్కువ. అదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత 79 మంది. అన్నింటి కంటే యిది తక్కువ.

* రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ. 306లు, మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333 ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటు ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.

* రాష్ట్రంలో 1,000 అడుగుల లోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2,000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

* భారతదేశంలో, బారైట్స్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. దేశంలో ఉత్పత్తి అయ్యే బారైట్స్‌లో 90 శాతం మొదలు 95 శాతం వరకు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నది.

* అభ్రకం ఉత్పత్తిలో బీహారు, రాజస్థాన్ రాష్ట్రాల తరువాత స్థానం ఆంధ్రప్రదేశ్‌ది.

ఆంధ్రప్రదేశ్ గురించి

* 1971 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 7.93 శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికి సమానం.

* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 2.75,109 చ. కి. మీటర్లు.

* 1971 లో సేకరించిన లెక్కల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ జనాభా 4,33,94,951 మంది. దేశజనాభా 54,69,55,945.

* 1971 లెక్కల ప్రకారం, రాష్ట్ర జనాభాలో అక్షరాస్యులు 24.56 శాతం మంది వున్నారు. 1961 లో 21.19 శాతం. భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం 1971 లో 29.35. 1961లో 24.03 శాతం.

* మన రాష్ట్రంలో జనాభా సాంద్రత చ. కి. మీ. 1కి 157 మంది హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ. కి. మీ. 1కి, 362. అన్ని జిల్లాల కంటే యిది ఎక్కువ. అదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత 79 మంది. అన్నింటి కంటే యిది తక్కువ.

* రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ. 306లు, మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333 ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటు ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.

* రాష్ట్రంలో 1,000 అడుగుల లోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2,000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

* భారతదేశంలో, బారైట్స్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. దేశంలో ఉత్పత్తి అయ్యే బారైట్స్‌లో 90 శాతం మొదలు 95 శాతం వరకు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నది.

* అభ్రకం ఉత్పత్తిలో బీహారు, రాజస్థాన్ రాష్ట్రాల తరువాత స్థానం ఆంధ్రప్రదేశ్‌ది.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి : 17

మే, 1973

వైశాఖ - జ్యేష్ఠ 1894 శా. శ.

సంచిక : 7

దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

మూడవ అట్ట : పంటచేలో పల్లె పడతి

చివరి అట్ట : హైదరాబాదులోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి

సాలు చందా : ఆరు రూపాయలు

వెల : 50 పైసలు

రిజిస్టరు నెం : 133

సంచికలో

పేజీ

హరిజన హాస్టళ్ల స్వాధీనంపట్ల హర్షం

షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, ఇతర వెనుకబడిన వర్గాల విద్యార్థులకోసం ప్రభుత్వ సబ్సిడీతో నడుపబడుతున్న ప్రైవేటు హాస్టళ్ల నిర్వహణ బాధ్యతలను స్వీకరిస్తూ నిర్ణయం చేయడంలో, రాష్ట్రపతిపాలనా నిర్వహణాధికారులు చూపిన ధైర్య సాహసాలు, వివిధరకాల అభిప్రాయాలుగల ప్రజానాయకులేకాక, విద్యార్థులు, మొత్తంమీద ఆయా వర్గాల ప్రజలచేత కూడా ప్రశంసాపాత్రములైనవి. నలభై మూడువేల మంది విద్యార్థులకు సంబంధించిన యిటువంటి వెయ్యి హాస్టళ్లు ఏ విధంగా పనిచేస్తున్నాయో పరిశీలింపజేయడానికి విధానమండలి అధ్యక్షులు నియమించిన సంఘంవారు చేసిన సిఫార్సులను అమలుచేయడానికే ప్రభుత్వం యీ చర్య గైకొన్నదనే విషయం గమనించాలి.

ఈ హాస్టళ్లు పనిచేస్తున్నతీరును చూస్తే, అది అస్తవ్యస్తంగానూ, అధ్వాన్నంగానూవుంది. ఒక సందర్భంలో ఈ హాస్టళ్ల నిర్వహణ బాధ్యతను స్వాధీనం చేసుకోవలసిందని కోరుతూ షెడ్యూలు కులాల విద్యార్థులు ప్రదర్శనలు జరిపి, సత్యాగ్రహం చేయడం కూడా జరిగింది. ఇటీవల జరిగిన ఏ ప్రభుత్వ నిర్ణయానికి కూడా దీనికి వచ్చినంత ఎక్కువగా ప్రజలనుండిగానీ, పత్రికలనుండిగానీ హర్షామోదాలు లభించలేదంటే అతిశయోక్తికాదు.

ఈ ప్రైవేటు హాస్టళ్లు ఏవిధంగా పనిచేస్తున్నాయో ప్రత్యక్షంగా చూసే అవకాశం గవర్నరు సలహాదారు శ్రీ హెచ్.సి. శరీన్‌గారికి కలిగింది. అందువల్ల ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోమనీ, లేదా కనీసం దీనిని అమలుపరచకుండా వాయిదా వేయమనీ ఆయన మీద వత్తిడులు వస్తూనేవున్నాయి. రాష్ట్ర ప్రయోజనాలను, ముఖ్యంగా హాస్టళ్ల మేనేజిమెంటులోని అవకతవకలు, అవినీతి కారణంగా అనేక బాధలకు గురిఅయిన విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని ఆయన తీసుకున్న నిర్ణయం యిది. అక్కడక్కడ అవకతవకలు లేని మేనేజిమెంటులు వుంటే వుండవచ్చు. కాని మొత్త మీద చూస్తే యీ హాస్టళ్ల నిర్వహణ పూర్తిగా లోపభూయిష్టంగా వుందనీ, అమాయకులైన విద్యార్థుల నోళ్లుకొట్టి లాభాలు పొందడానికి యిదొక మార్గంగా తయారైందనే ఫిర్యాదుమాత్రం సర్వత్రా వినిపిస్తున్నది. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొనే అవకాశం ఏమైనా వున్నదా అని పత్రికా విలేఖరులు అడిగినపుడు ఏమాత్రం లేదని శ్రీ శరీన్ గట్టిగా జవాబు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసిస్తూ తనకు అనేక అభినందన లేఖలు అందినట్లుకూడా ఆయన వెల్లడించారు.

షెడ్యూలు కులాలు, జాతులు, యితర వెనుకబడిన వర్గాల విద్యార్థులకోసం ప్రభుత్వ సబ్సిడీతో నడుపబడుతున్న ప్రైవేటు హాస్టళ్ల పథకం ఆశించిన ఫలితాలు సాధించడంలో విఫలమైందనే అభిప్రాయం కొంతకాలంగా ప్రజల్లో వ్యాపించివుంది. హాస్టళ్ల నిర్వహణలో అనేక అవకతవకలు, దుశ్చర్యలు, అవినీతి మొదలైనవి జరుగుతూవున్నాయి. 1971 లో విధానమండలి నియమించిన సంఘం వారు చేసిన పరిశీలనలో యిది యథార్థమేనని తేలింది. శాసన సభలోనూ, వెలుపలా, ఈ సబ్సిడీ హాస్టళ్ల విధానం గురించి ఎప్పుడూ విమర్శలు చెలరేగుతూవచ్చాయి. ఆ సంఘంవారు అన్ని వివరాలు పరిశీలించి యీ హాస్టళ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిఫార్సు చేశారు.

ఈ కమిటీవారి పరిశీలనలో వెల్లడి అయిన కొన్ని తీవ్రమైన అవకతవకలు, లోపాలు ఏవంటే : చాలా తక్కువరకం ఆహారం యివ్వడం, అదనంగా గ్రాంట్లు సంపాదించడానికై విద్యార్థుల హాజరీ సంఖ్య ఎక్కువగా చూపించే దురలవాటు, హాజరు పట్టీలలో మార్పులు చేయడం, వసతి సౌకర్యలోపం, దీపాలు లేకపోవడం, స్నానాదులకు సౌకర్యాలు కల్పించకపోవడం. విద్యార్థులను హీనంగా చూడడం, విద్యార్థినులకు చాటుమాటు సౌకర్యాలు లేకపోవడం, హాస్టళ్లలోవుండేవారిచేత హీనమైన పనులు సైతం చేయించడం మొదలైనవి. అంతేకాక నియమనిబంధనలకు విరుద్ధంగా, కొన్ని కుటుంబాలవారికి వీటి నిర్వహణలో గుత్తాధిపత్యం కలగడం, కొన్ని సందర్భాలలో తమతమ బంధువులను చేర్చుకుని సంఘాలు పెట్టి, వారికే హాస్టల్ల నడుపుతూ, యీదంతా ఒక కుటుంబ వ్యవహారంగా మార్చివేయడం జరిగినట్లు సంఘంవారి నివేదికలో వెల్లడి అయింది.

ఈ లోటుపాట్లు సరిదిద్దడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటూనేవుంది. కాని ఫలితం మాత్రం కనిపించలేదు. ఈ పరిస్థితిని పూర్తిగా సరిదిద్దడం అవసరం అయింది. సంఘంలో పీడింపబడే వర్గాలకు చెందిన ప్రజల సంక్షేమంకోసం పనిచేసే బాధ్యత ప్రధానంగా ప్రభుత్వానిదే. ఇందులో కొంత బాధ్యతనైనా ప్రైవేటు వ్యక్తుల పరంచేయడం న్యాయంకాదు. ఇప్పటి కొత్త పథకం ప్రకారం, వచ్చే విద్యాసంవత్సరంనుండి ప్రభుత్వమే యీ బాధ్యతను పూర్తిగా నిర్వహిస్తుంది.

ప్రస్తుతం హాస్టళ్లలోవుండే విద్యార్థులకు తగు సౌకర్యాలు కల్పించే విధంగా అవసరమైనన్ని హాస్టళ్లను ప్రారంభించాలని ప్రభుత్వ ఉద్దేశం. అక్కడక్కడ మరికొన్ని హాస్టళ్లు అభివృద్ధి చెందడానికి కూడా అవకాశం వుండేట్లు చేస్తారు. దాన ధర్మపరులైన వారికి సొంతంగా హాస్టళ్లను ప్రారంభించి నడపడానికి పూర్తి స్వేచ్ఛ వుంటుందనీ, వారు ప్రభుత్వంనుండి గ్రాంట్లు ఆశించగూడదనీ శ్రీ శరీన్ వివరించారు.

—పి. వి. ఆర్.

బియ్యం, గోధుమల టోకు వ్యాపారం ప్రభుత్వ స్వాధీనం:

కమిటీ నివేదిక ముఖ్యాంశాలు

బియ్యం, గోధుమ టోకు వ్యాపారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొనే విషయంలో, సాధకబాధకాల్ని పరిశీలించి సూచనలుచేసే నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1973 జనవరి ప్రారంభంలో ఒక సంఘాన్ని నియమించింది. లోగడ భారత ఆహారసంస్థ మేనేజింగ్ డైరెక్టరుగా పనిచేసిన శ్రీ సి. నరసింహం యీ సంఘానికి అధ్యక్షులు. హైదరాబాదులోని పరిపాలనా సిబ్బంది కళాశాలకుచెందిన డా. బల్వంతరెడ్డి, అనంతపురం జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీ వెంకటనారాయణ ఈ సంఘంలో సభ్యులు.

ఈ సంఘం తన నివేదికను ఏప్రిల్ 2వ తేదీన గవర్నరు సలహాదారు శ్రీ వి. కె. రావుకు అందజేసింది. రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొని వున్నప్పటికీ మూడునెలల వ్యవధిలోనే యీ సంఘం తన నివేదికను సమర్పించింది.

లక్షలాది వ్యవసాయదార్లకూ, అంతకు ఎన్నోరెట్ల వినియోగదార్లకూ సంబంధించినది కావడంవలన ఈ బియ్యం, గోధుమ టోకు వ్యాపారాన్ని ప్రభుత్వం చాలా జాగ్రత్తగా స్వాధీనం చేసుకోవాలనీ, సత్వరదశ, మధ్యంతరదశ, అంతిమదశ—అని మూడు దశలలో పూర్తిగా దీన్ని స్వాధీనంచేసుకోవాలనీ ఈ సంఘం సిఫారసు చేసింది.

సత్వరదశలో-(i) ప్రయివేటు టోకు వ్యాపారస్తులు బియ్యం అమ్మడాన్ని పూర్తిగా నిషేధించడం జరుగుతుంది. ధాన్యంమిల్లులు తమ ఆర్థికావసరాలకు కావసినంత వరకు మాత్రమే బియ్యం ఆడడానికి అనుమతించ బడుతాయి.

(ii) ఉత్పత్తిదారులెవీ వసూలు చేయబడుతుంది.

(iii) గ్రామ ప్రాంతాలలోనూ, లక్ష జనాభాకు తక్కువగల పట్టణాలలోనూ వినియోగదారులు ఉత్పత్తిదారులనుంచి ప్రకటించబడిన మొత్తాంకు లోబడి నేరుగా కొనుగోలు చేసుకోవచ్చు.

(iv) లక్ష, అంతకు పైబడ్డ జనాభాగల పట్టణాలలో చట్టబద్ధమైన రేషనింగు ప్రవేశ పెట్టబడుతుంది.

మధ్యంతర దశలో-ఉత్పత్తిదారులనుంచి నేరుగా చిల్లర వ్యాపారస్తులు వడ్లు కొనుగోలు చేయడాన్ని నిషేధిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ఏజన్సీద్వారా వారికి బియ్యం సరఫరా చేస్తారు. ప్రతి రెవిన్యూ గ్రామంలోనూ వడ్లు ఉత్పత్తికి సంబంధించి రైతువారీగా ఒక రిజిష్టరు వుంటుంది. ఇందులో యితర వివరాలతోపాటు మార్కెటుకు పంపడానికి రైతుదగ్గర ఎంత మొత్తం ధాన్యం లభించగలదో ఆ వివరం వుంటుంది.

అంతిమదశలో—మొదటి రెండు దశలలోనూ ప్రభుత్వం సంపాదించిన అనుభవందృష్ట్యా ఉత్పత్తిదార్లనుంచి నేరుగా వినియోగదార్లు వడ్లు కొనుక్కోడానికి అనుమతించవచ్చునో, లేక అలా చేయడాన్ని నిషేధించాలో ప్రభుత్వం నిర్ణయిస్తుంది. మార్కెటు చేయవలసిన వడ్లు స్వేచ్ఛగా కొనుగోలు కేంద్రాలకు అందుతుంటే ఆ సమయానికి ప్రభుత్వంవద్ద తగినంత బఫర్‌స్టాకులు వున్నట్టయితే, ఉత్పత్తిదార్లు నేరుగా వినియోగదార్లకు కొద్దిమొత్తాల్లో ధాన్యం అమ్మడాన్ని నిషేధించడంలోగాని, నిరుత్సాహపరచడంలోగాని అర్థంలేదు. ఒకవేళ యిలా జరుగనిపక్షంలో మాత్రం వినియోగదార్లకు ఉత్పత్తిదార్లు నేరుగా అమ్మడాన్ని నిషేధించడం జరుగుతుంది.

బియ్యం, గోధుమ వ్యాపారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొనే యీ పథకం విజయవంతం కావాలంటే ప్రభుత్వంవద్ద తగినంత బఫర్‌స్టాక్ ఏర్పాటు చేసుకోవాలని యీ సంఘం నొక్కి చెప్పింది. ఐదేళ్ళలో సుమారు 11 లక్షల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం నిల్వచేసుకోవాలని యీ సంఘం సిఫారసు చేసింది. ఈ నిల్వలను వుంచడానికి అయ్యేఖర్చులలో కొంతభాగం వినియోగదారు ధరలో చేర్చాలనికూడా యీ సంఘం సూచించింది. మిగతా భాగాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది.

భారత ఆహార సంస్థ యీ టోకు వ్యాపారాన్ని స్వాధీనం చేసుకొనే ఏజన్సీగా వుండాలని సిఫారసుచేస్తూ, అయితే భారత ఆహార సంస్థక్రింద ఒక రాష్ట్ర ఆహారసంస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. దీని అధ్యక్షుడిని, మేనేజ్‌మెంట్ బోర్డులో 50 శాతం మందిని రాష్ట్రప్రభుత్వమే నామినేట్ చెయ్యాలని సూచించింది, కొనుగోలు విషయాలలో సహకార మార్కెటింగ్ సమాఖ్య, కేంద్ర గిడ్డంగి సంస్థ, రాష్ట్రగిడ్డంగి సంస్థలు రాష్ట్ర ఆహార సంస్థకు తోడ్పడతాయి.

రాష్ట్ర ఆహార సంస్థ రాష్ట్రమంతటా కొనుగోలు కేంద్రాలను నెలకొల్పుతుంది. ఏ రైతుకూడా తన ఉత్పత్తులను యీ కేంద్రాలకు తేవడానికి తన గ్రామం నించి 5 మైళ్ళ దూరానికిమించి వెళ్ళక్కరలేదు. ఆ విధంగా ఎక్కడికక్కడ యీ కేంద్రాలు నెలకొల్పబడతాయి. రైతులు తెచ్చే ధాన్యాన్ని ఆ కేంద్రాలలో అక్కడికక్కడే వాటి రకాల్ని చూసి నిర్ణయించి డబ్బు ఇచ్చేస్తారు. నాసి

రకాలకు తదనుగుణంగా తగ్గించి లెక్కగడతారు. వ్యవసాయోత్పత్తుల ధరల నిర్ణాయక సంఘం సిఫారసు చేసిన కనిష్ఠ ధరను దృష్టిలో వుంచుకుని రైతులకు లాభదాయకంగానూ, ప్రోత్సాహకారిగానూ వుండేటట్లు ధాన్యం కొనుగోలుధర నిర్ణయిస్తారు. రైతులకు లాభదాయకంగా వుంటే వారు ఎక్కువ వరి పండించడమేగాక ప్రభుత్వానికి తమంతతాముగా ధాన్యం అమ్మడానికి ముందుకొస్తారు. వినియోగదారు చెల్లించే ధర తగ్గించడంలో యీ పథకం విజయవంతమైతే, వినియోగదారు చెల్లించిన అప్పటి ధరకూ, ప్రస్తుతం మార్కెటు ధరకూగల తేడాలో కొంతభాగాన్ని రైతులకు యివ్వడానికి వీలవుతుంది. అప్పుడు రైతుల్లో ఒకవిధమైన మానసిక పరివర్తనవచ్చి, యీ పథకం విజయవంతంకావడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుందని యీ కమిటీ తెలియజేసింది.

ఐదేళ్ళలో 11 లక్షల టన్నుల బఫర్‌స్టాక్‌ను నిలవచేసి, మార్కెటులో మిగులుబియ్యం యావత్తూ కొనుగోలుచేసి పంపిణీ చేయడానికి ప్రభుత్వంవద్ద స్టోరేజి సౌకర్యాలు తగినంతగా లేవని యీ కమిటీ పేర్కొంటూ, భారత ఆహార సంస్థ, సహకారసంఘాలు, కేంద్ర గిడ్డంగిసంస్థ, రాష్ట్రగిడ్డంగిసంస్థవంటివి యీ సౌకర్యాలను కల్పించాలని సూచించింది.

రాష్ట్రంలో గోధుమ ఉత్పత్తి చాలా తక్కువ. అందువల్ల గోధుమ అమ్మకాలపై విడిగా ఏ నిబంధనలూ ఏర్పాటు చేయవలసిన అవసరంలేదని యీ కమిటీ అభిప్రాయపడింది కొనుగోలు కేంద్రాలకు స్వచ్ఛందంగా అమ్మకాలకై తెచ్చిన గోధుమను ప్రభుత్వం ప్రకటించిన ధరలకు రాష్ట్ర ఆహారసంస్థ కొనుగోలు చేయాలనిమాత్రం యీ కమిటీ సిఫారసు చేసింది.

రాష్ట్రం మొత్తానికీ, విడివిడిగా ప్రతిజిల్లాకీ వివరంగా ఆహార పదార్థాల బడ్జెటు అంచనాలు తయారు చేయాలని కమిటీ సూచించింది. దీనివల్ల ఆహారపదార్థాలు ఒకచోటినుంచి మరోచోటికి రవాణా చేయడానికీ, ఆయాచోట్ల నిలవ చేయడానికీ వలసిన వివరాలు లభిస్తాయి.

బియ్యం మిల్లులను క్రమబద్ధంచేయడానికి కమిటీ కొన్ని ముఖ్యమైన సూచనలు చేసింది మిల్లులను 'ఎ' 'బి' రకాలుగా వర్గీకరణ చేయాలని, 'ఎ' రకం మిల్లుల్లో ప్రభుత్వ ఏజన్సీలద్వారా వచ్చేధాన్యం మరవెయ్యాలనీ, 'బి' రకం మిల్లుల్లో రైతులు, చిల్లర వ్యాపారస్థులు, వినియోగదార్లుతెచ్చే ధాన్యం మరవేయాలనిసూచించింది.

ఆహారధాన్యాల టోకువ్యాపారాన్ని స్వాధీనం చేసుకునే విషయంలో ప్రజలలో తగిన విజ్ఞానము, చైతన్యము కలిగించేటందుకు వీలుగా రేడియో సమాచార, పౌరసంబంధశాఖ, యితర అభివృద్ధిశాఖలు, పంచాయతీరాజ్, సహకారసంస్థలు, యీ విధానంలో నమ్మకంగల రాజకీయ పార్టీల సహకారం తీసుకోవాలని కమిటీ సూచించింది.



శ్రీబోయి భీమన్నకు పద్మశ్రీ ప్రదానం

సుప్రసిద్ధ కవి శ్రీ బోయి భీమన్నకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ బిరుదు ప్రదానం చేసింది. శ్రీ భీమన్నగారు బహుగ్రంథ కర్త, సాహిత్య సిద్ధాంత వేత్త. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు లోగడ 'కళాప్రపూర్ణ' యిచ్చింది ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి విశిష్ట సభ్యత్వం యిచ్చి గౌరవించింది.

సీలింగు చట్టం క్రింద ప్రకటన

కామరాజుగడ్డ రామచంద్రరావు

సీలింగు బిల్లు పాసయింది. రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది.

ఈ శాసనం యొక్క 1 (3) వ సెక్షను క్రింద ప్రభుత్వం యెప్పుడో ఒక తేదీ నిర్ణయించి ప్రచురిస్తారు. ఆ తేదీనే నోటిఫయిడు తేదీ అంటాము. ఆ తేదీ నుంచే ఈ శాసనం అమలు లోకి వస్తుంది. అప్పటి నుంచి రాష్ట్రంలో భూమి అనేది కలిగి వున్న ప్రతి ఒక్కడికీ ఆ భూమినిగురించిన ప్రకటనము చేయాల్సిన బాధ్యత ఏర్పడుతుంది. అలా ప్రకటనం చేయాల్సివుండికూడ ప్రకటనం చెయ్యకపోతే రెండు సంవత్సరాలు జైలు శిక్ష రెండు వేల రూపాయల వరకూ జుల్మానాకు పాల్పడాల్సి వస్తుంది.

ప్రకటన విషయం గురించి చెప్పేది ఈ శాసనంలో 8వ సెక్షను. ఈ సెక్షను క్రింద చేయబడే ప్రకటనంలోనే ఈ చట్టం క్రింది వ్యవహారాలు మొదలు. దానికి సంబంధించిన కొన్ని విషయాలు తెలిసికోవటం చాలా అవసరం.

(i) భూమి అంటే యే భూమి?

వ్యవసాయ ప్రయోజనాలకు గాను ఉపయోగించదగిన భూమి అని యర్థం. అంటే, కూరగాయలు పండించేభూమి కావచ్చు, యింకా అడివిగా బీడుగా తోపుగావున్న భూమి కావచ్చు, తోట కావచ్చు. ఇవేగాక కొన్ని భూములు వ్యవసాయ భూములు గానే భావించబడాలని శాసించారు. ఏమంటే, ఒకప్పుడు వ్యవసాయ భూమిగా వుండి నోటిఫయిడు తేదీకి ఐదేండ్ల లోపు పూర్వాన వ్యవసాయేతర భూమిగా మార్చబడినప్పటికీ ఆ భూమి వ్యవసాయ భూమిగానే పరిగణించాలి. (చూడు 7 (3) సెక్షను). అలాంటి భూమి ఆంధ్రప్రదేశ్‌లోనే గాదు ఇండియాలో ఎక్కడున్నాసరే ప్రకటనలో చేర్చాలి. రయితువారీ సెటిలుమెంటు క్రిందకు వచ్చిన భూమి అంతా దీని క్రిందికి వస్తుందనవచ్చు. అయితే ఒక యింటికి అనుషంగికంగా వున్న దొడిలాటి భూమి యిందులో చేరదు. ఇంకా టీ, కాఫీ, కోకో యాలకులు, రబ్బరు తోటలు పెంచే భూమి దీని క్రిందికి రాదు

(ii) ఏ మాత్రం భూమివున్నా యీ ప్రకటనం చేయాలా?

అక్కరలేదు. ఒకానొక ఉజ్జాయింపు పరిమితి చెప్పారు, మాగాణి భూమి అయితే 10 ఎకరాలు, మెట్టఅయితే 25 ఎకరాలూ. ఇంతకుమించి భూమి వున్నట్లయితేనే తనకున్న భూముల విషయం అంతాచేర్చి ప్రకటనం చెయ్యాలి. ఉదాహరణకు 15 ఎకరాలు మెట్ట మాత్రమే వున్నా 10 ఎకరాల మాగాణి మాత్రమేవున్నా ఈ వివరణం యివ్వనక్కరలేదు, కాని 12 ఎకరాలమెట్టా 6 ఎకరాల మాగాణి కూడావుంటే ఈ ప్రకటనం చేయ్యాలా అక్కరలేదా? అదెలా తెలుస్తుందంటే ఒక మాగాణి ఎకరం రెండున్నరఎకరాలకు సమానమని గణుతించి మొత్తం అంతా ఎంత మెట్టభూమికి సమానమో లెక్క వేయాలి. ($6 \times 12 = 2\frac{1}{2} + 27$)ఇరవయి యేడు ఎకరాలూ 25 పరిమితికి మించి వుంటుందికనుక ప్రకటన చేయ్యాలి.

(iii) ఆ భూమి ఎప్పుడుంటే ఈ ప్రకటనం చెయ్యాలి?

24-1-1971 తరువాతనూ నోటిఫయిడు తేదీకి లోపలా ఎప్పుడు ఆ భూమిని కలిగివున్నా ఈ ప్రకటనం ఇవ్వాలి, ఎప్పుడో అంతకు ముందు వుండి ఆ తరువాత లేకపోతే దాని సంగతి ఇవ్వనక్కరలేదు. ఆ తేదీల మధ్య వున్నట్టిభూమి ఎప్పుడన్నా బదిలీ ఎలా జరిగిందో కూడా వ్రాసి మరీ ప్రకటనం చెయ్యాల్సి వుంటుంది.

(iv) కలిగి వున్న భూమి అంటే?

వున్న భూమి అంటేయేమిటి:- కలిగి వున్న భూమిఅంటే, ఈ క్రింది వన్నీ వస్తవి:-

(1) స్వంతభూమి:- దానిని ఎవరికో కౌలుకిచ్చినా తాకట్టు పెట్టినా మనది కనుక మన ప్రకటనంలో చేర్చవలసినదే.

(2) జీవిత పర్యంత మాత్రమైన హక్కునే మనం కలిగి వున్న భూమి-దానాదమన వినిమయాది హక్కులుండవుగాక, అది కూడ ప్రకటనలో చేర్చాలిసిందే-మనం కలిగినట్టి భూమిగామరి;

(3) ఎవరిభూమో మనం తాకట్టుపెట్టుకుని స్వాధీనంలో వున్నా-

(4) ఎవరిభూమో మనం కౌలుకు తీసుకొని స్వాధీనంలో వున్నా

(5) ఎవరిభూమో క్రయషరతు తాకట్టు వ్రాయించుకొని మనపేరనే వుంచుకొన్నా-ఎప్పుడో దానిని తిరిగి వారికి వ్రాయవలసి వుంటుందిగాక-అయినా, ఇవన్నీ మనక్రిందనే లెక్క చెప్పాల్సి వుంటుంది.

(6) అంతేకాదు. పొలం కొనటానికి కంట్రాక్టు వ్రాసికొంటాం, డబ్బిస్తాం, భూమి స్వాధీనంకూడ చేసికొంటాము. మనపేర దస్తావేజు వ్రాయటం జరిగివుండదు. అయినా అది మనదిగానే భావించవలె.

(7) 24-1-71 కి తరువాతనూ నోటిఫయిడు తేదీకి పూర్వమునమా భార్యాభర్తలు విడాకులకుగాను కోర్టులో దావాలునడిపి విడిపోతారు. వాళ్లకున్న భూమిని రెండుభాగాలు చేసికొని-మేము ప్రత్యేక వ్యక్తులమని అంటూ, ఒకొక్కరికి ఒకొక్క ప్రమాణ కమతం పరిమితిగా నిర్ణయించవలెనని కోరుతారు. కాని ట్రిబ్యునలు అలా ఒప్పుకొనదు. అలా ఒప్పుకొంటే చట్టప్రయోజనమే తప్పి నట్లవుతుంది. వారిద్దరూ ఒకేకుటుంబ యూనిటుగా భావించి ఒక్క ప్రమాణ కమతాన్నే పరిమితిగాచేసి మిగతా భూమిని వదులుకోమంటారు. కనక ప్రకటనలు వేసేటప్పుడు విడిపోయినవారి భాగాలు కూడ కుటుంబంలోవే ననే సంగతి జ్ఞాపకం పెట్టుకోవాలి.

(8) ఒక కుటుంబంలో పుట్టిన మనిషి ఆస్తి పంచుకొని ఆ తరువాత పెంపుడు వెడతాడు ఒక బీద కుటుంబములోకి. అప్పుడు జనక కుటుంబం ఆస్తి ఈ బీద కుటుంబం లోకి వస్తుంది. రెండు కుటుంబాలకీ రెండు పరిమితులు అన్వయించి నప్పుడు ప్రభుత్వానికి వదలుకో వలసిన భూమి లేకుండాచేసిన వాండ్లవు తారు. అందుచేత 24-1-71 తరువాత దత్తు వెళ్లిన వాడి ఆస్తి కూడ జనక కుటుంబం వారు తమ ఆస్థిగానే భావించిప్రకటనం చెయ్యాలెనని శాసనం చేయబడింది.

(v) శాసనం రాకముందే చేసిన బదిలీలు చెల్లవా?

24-1-71 తరువాతనూ, నోటిఫయిడు తేదీకి పూర్వమూ జేయబడిన యే క్రయంగానిదఖలుగాని స్వాధీన తాకట్టుగాని వినిమయంగాని సెటిలుమెంటుగాని వదులుకోవటంగాని చేసి వున్నట్లైతే- అది యథాతథంగా చెల్లదు. (సెక్షను 7 (1) చూడుము) కాని ఒక విషయం రుజువు చేస్తే ట్రిబ్యునలు అలాటి వ్యవహారం న్యాయమైనదేనని ఒప్పుకొనే అవకాశం వుంది. ఏమనంటే-ఆ బదిలీలు సీలింగు చట్టము యొక్క ఉద్దేశ్యాన్ని సఫలం కాకుండా చేయాలనే ఉద్దేశ్యంతో చేయబడలేదని-వాస్తవంగా అవసరంకొద్దీ తప్పనిసరివల్ల అవిచేయబడినవనీ ఋజువుచేస్తే అవిచెల్లవచ్చును. అలా రుజువుచేసే బాధ్యత ఆ వ్యవహారం నిజమైనదే నని యెవరువాదిస్తారో వారిది.

ఇలాటి బదిలీ వ్యక్తి బుద్ధి పూర్వకంగా చేస్తే యెలాగో-అలాగే కోర్టుద్వారా అమ్మకంగాని, ఆ రేండ్లకు మించిన కౌలుగాని, దఖలుగాని, విభాగంగాని వినిమయంగాని స్వాధీనతాకట్టుగాని ట్రస్టును సృష్టించటంగాని ఇతర వ్యవహారంగాని జరిగినప్పటికీ అదికూడ చెల్లదు (సెక్షను 7 (2) చూడుము)

(vi) ఈ ప్రకటనం ఎవరిదగ్గర దాఖలు చెయ్యాలి?

6వ సెక్షను క్రింద ప్రభుత్వంవారు ఎన్ని ట్రిబ్యునలులను యేర్పాటు చేయాలనుకొంటే అన్నిటిని సంఘటిత పరచవచ్చును. అలాటి ట్రిబ్యునలుకు ఒక పరిధిలో, అధికారాలు యిస్తారు. ఆ ట్రిబ్యునలు పరిధిలోనున్న రైతులంతా- వ్యక్తులంతా- ఆ ప్రకటనములను ట్రిబ్యునలు వద్ద పడవేయ వలయును.

ఈ ట్రిబ్యునలు, అనేక విషయాలు గురించి విచారించి తీర్పు చేయవచ్చును-ట్రస్టు, బదిలీ ఇవి చెల్లుతవా? ఏ భూమి అయినా ఐదేండ్ల ఈ మధ్య వ్యవసాయేతర భూమిగా మార్చబడినట్టిదా? విడాకులియ్యటం, తలాక్, దత్తతలాటివి 24-1-1971 తేదీ తరువాత జరిగినయ్యా - వంటి విషయాలు, అలా విచారించి యివ్వబడిన తీర్పు ఫైనలు.

ఇంతేకాక, ఏదయినా బదిలీ రద్దు అని నిర్ణయించినప్పుడు ఆ బదిలీ చేసినవాడిదే ఆ భూమి-అని కూడ లెక్కవేసి వదులుకోవలసిన భూమి నిర్ణయించటం జరుగుతుంది. అలా వదులుకోవలసిన భూమికంటే అతడు అమ్మగా మిగిల్చుకొన్న భూమి తక్కువ వుంటే ఆ మిగుల్చుకున్న అంత భూమినీకూడ ముందు వదులుకోవలసిందని ట్రిబ్యునలు ఆదేశించవచ్చు. అప్పటి పరిస్థితి చూడండి - బదిలీ అయిన భూమి బదిలీకాగా మిగిలిన భూమి ప్రభుత్వం పుచ్చుకొంటారు. ఉభయ భ్రష్టత్వం ఉపరి సన్యాసం అన్నట్లు.

(vii) ఈ ప్రకటనం ఎప్పుడు చెయ్యాలి?

(1) ఈ శాసనం అమలులోనికి వచ్చిన 30 రోజులలోపల ఈ ప్రకటనం చెయ్యాలి. (సెక్షను 8 (1) చూడుము).

(2) ఒకొక్కప్పుడు ట్రిబ్యునలు తన అధికార పరిధిలో వున్న వానికెవనికైనా నోటీసు యివ్వవచ్చును. ఈ శాసనం క్రింద చేయవలసిన ప్రకటనం దాఖలు చేయమని అనవచ్చు. అతడికి ఇండియాలో యెక్కడయితేనేమి సీలింగు పరిమితిని మించి భూమి వుందని ట్రిబ్యునలుకు తోస్తే అలాంటి నోటీసు యివ్వవచ్చు. అలా యిచ్చిన నోటీసులో ఒకానొక గడువు వుంటుంది. ఆ గడువు లోగా ప్రకటనం చెయ్యటం ప్రధానం. (సెక్షను 8 (2) చూడుము).

(3) నోటిఫయిడు తేదీకి ముందు సంగతి అలావుంచి ఉత్తరోత్తరా ఎప్పుడో భూమి బదిలీ జరగటం తటస్థించవచ్చు. భూమి కొనవచ్చు. తాకట్టు పెట్టుకోవచ్చు. కౌలుకు తీసికోవచ్చు. ఏదో పెళ్ళి కారణంగా దత్తత కారణంగా భూమిని కొత్తగా పొందియుండవచ్చు. అందువల్ల సీలింగు పరిమితిని దాటిన భూమి వుండటమనేది కద్దు. భూమి తరగతి మార్చగా ప్రమాణకము తప్ప పరిమితి తగ్గియుండవచ్చు. అలాటప్పుడు ఈ శాసనం యొక్క నిబంధనములను తిరిగి వర్తింపు చెయ్యాల్సిన అవసరం వుంటుంది. అందుకని అలా భూమిని పొందినాయన ఒక ప్రకటనం చెయ్యాల్సి వుంటుంది. అది ఎప్పుడు చెయ్యాలంటే, ఆ కొనుబడి తేదీనుంచి తాకట్టు, కౌలు, పెండ్లి, దత్తతు తేదీనుంచి లేదా చివరకు భూమి తరగతిని పై తరగతిగా మార్చినా ఆ మార్చిన తేదీనుంచీ అరవయి (60) రోజులలోపున చెయ్యాల్సివుంటుంది. (చూడుము 18వ సెక్షను). అలా దాఖలుచేసిన ప్రకటనం కూడ 8వ సెక్షను క్రింద దాఖలు చేయబడ్డ ప్రకటనం మాదిరిగానే విచారించబడుతుంది.

ఇక్కడొక చిన్న విశేషముంది. అమ్మాయి పెండ్లి చేస్తాము. ఆమెపేర అదివరకే ఒక యెకరం వుంది. అది తీసికొని వెళ్ళిపోతుంది. అందుకని తండ్రి అధీనంలోవున్న కమతం తగ్గుతుంది. వాళ్ళ కుటుంబంలో 6 గురు సభ్యులు దేవాళ్లు. పెళ్లయిం

తరువాత ఐదుగురే అవుతారు 6 గురుగల యూనిటు కుటుంబానికి పరిమితి 12 ఎకరాలేగాని 5 గురు గల వారికి 10 ఎకరాలే. పెళ్ళి అయినాక మిగ్గింది 1 ఎకరమే అనక పరిమితి 10 ఎకరాల కంటె మిగిలి ఒక ఎకరం యెక్కువగావుంది అది వదులుకోవలెనా అక్కరలేదా—అక్కరలేదు. సీలింగు నిబంధనములను అది వరకే అన్వయించివేశాక—తరువాత ఎప్పుడూ కొత్త భూమిని పొందటం జరగలేదు పెళ్ళిపిల్లగాని పెంపుడుపిల్లగాని భూమి రాలేదు కుటుంబంలో సభ్యుల సంఖ్య తగ్గినంత మాత్రాన పరిమితిని మించిన భూమి వున్నట్లు అనుకొని ప్రకటనం వెయ్యనక్కరలేదు (చూడుము 18వ సెక్షను క్రింది వివరణము III) కాగా—మైనరు కొడుక్కి పెళ్ళి చేశామనుకొందాము కోడలు 5 ఎకరాల ఆస్తితో వస్తుంది అప్పుడు మొత్తం ఈ కుటుంబానికి గల భూమి 11 + 5 = 16 అవుతుంది వాళ్ళ సీలింగు పరిమితి (6 గురు సభ్యులు కనుక) 12 ఎకరాలు కనుక—ప్రకటన వెయ్యాలి—4 ఎకరాలు వదులుకోనూ వదులుకోవాలి ఈ ప్రకటనం ఆ పెళ్ళి అయిన 60 రోజులలోపల వెయ్యాలి.

ఒక కీలకమైనటువంటి విషయం IVవ వివరణంలో దిగమనించాలి. ఒక యూనిటు కుటుంబ భూమికి అదివరకే సీలింగు నిబంధనములు అన్వయించబడి కొంత భూమిని వారు వదులుకోవలసివచ్చి, వదులుకోగా ఆ భూమి జాయింటు కుటుంబంవారివద్ద వున్నపుడు—తరువాత యెప్పుడో ఆ జాయింటు కుటుంబంవారు మొత్తం భూమి పంచుకొన్నట్లయితే, దానివల్ల ఆ యూనిటు కుటుంబంవారి భూమి పెరిగివచ్చు. అలా పెరిగినా 18వ సెక్షను క్రింద ప్రకటనం వెయ్యవలసిన పని లేదు అని వున్నది, ఆ వివరణంలో. ఇది ఎందువల్ల అలా చేశారంటే ఈ మొత్తం జాయింటు కుటుంబ భూమి అంతా ఈ యూనిటు కుటుంబంవారు 8వ సెక్షను క్రింద ప్రకటనం చేసే వుంటారుకదా ఇది కొత్త భూమిని పొందటమే నేదిగా భావించనక్కరలేదు గదా అనే భావం అయియుండవచ్చు. ఈ భూమి ఎక్కడ నుంచో వచ్చింది కాదు.

VIII ఎవరు ప్రకటనం చెయ్యాలి?

మానవ వ్యక్తిగాని, కుటుంబ యూనిటుగాని, సమష్టి కుటుంబంలోని మెంబరుగాని, ట్రస్టీగాని, కంపెనీగాని, ఫరం, సొసయిటీ, యేదైనా సంఘం ఇవన్నీకూడ వ్యక్తి అనే మాట క్రిందికి చేరుతవి. మైనర్లు, పిచ్చివారు తరఫున గార్డియన్ ప్రకటనను వేయవచ్చు. ప్రాపర్టీ గార్డియన్ అయియుండాలి. యూనిటు కుటుంబం తరఫున ఒకళ్ళు పడవేస్తే ఆ ప్రకటనం ఆ యూనిటు కుటుంబంలోని సభ్యులందరి మీద బైండింగే. వాళ్ళు మిగిలి యింకే ప్రకటనా చేయనక్కరలేదు, కుటుంబాస్తిగాక ప్రత్యేకంగా యేమయినా వుంటే తప్ప.

పైగా ఒక సమష్టి కుటుంబంలో చాలా యూనిటు కుటుంబాలు వుండవచ్చు. ఆస్తి అంతా ఒకే ఒకడు మేనేజిమెంటు చేస్తూవుంటాడు. అతనిని కుటుంబం మేనేజరంటారు. అతడు అన్ని యూనిటు కుటుంబాల తరఫున, ప్రత్యేక వ్యక్తులుంటే వారి తరఫునకూడ పడవేస్తేచాలు. (సెక్షను 8 (1) క్రింది వివరణం II). కంపెనీ, ఫరంల తరఫున ఆ కంపెనీయొక్క ఫరం యొక్క నియమావళి ననుసరించి ఆ భూములగూర్చిన బాధ్యత యెవరిదో వారు ప్రకటనం చేయడానికి సమర్థులు.


XI ప్రకటనం యేవిధంగా చెయ్యాలి?

ఒక్క జాయింటు హిందూ కుటుంబ విషయంలో తప్ప యీ ఉమ్మడి కుటుంబాస్తి అనేది ఎక్కడా వుండదు. కాని సీలింగు చట్టం ప్రకారం యూనిటు కుటుంబం ఒక వ్యక్తి. అందులో సభ్యులకు ఎంత ఎంత భూమివుందో అంత భూమినీ ప్రకటనంలో పొందుపరచి ప్రకటనం దాఖలు చెయ్యాలి. మితాక్షర హిందూ కుటుంబాలకు చెందని వాళ్ళకు ఇది ఒక్కటే సూత్రం. దానిని అనుసరిస్తేచాలు.

హిందూ కుటుంబాల్లో మొత్తం జాయింటు కుటుంబాస్తి అందరిదీ అనే భావంవుంది. కొందరికి పంచుకుపోయేహక్కు వుండవచ్చు. కొందరికి పడి తినే హక్కేవుండవచ్చు. ఒక్కడు మేనేజి చేస్తూవుంటే యూనిటు కుటుంబాలు అన్నీ అనుభవిస్తూ వుంటాయి. నిజానికి కొందరు సభ్యులకు ఏమ కే యే భూము ఉన్నాయోకూడ తెలీదు. కుటుంబ మేనేజరు వారి తరఫున ప్రకటనం వేయటమే అందరికీ మేలు. ఆ సౌకర్యం సీలింగు శాసనంలో వున్నది.

కుటుంబ మేనేజరు అలా ఒక్కొక్క యూనిటు కుటుంబానికి పడెయ్యాలన్నప్పుడు అప్పుడొక్కొక్కప్పుడు నాలుగయిదు ప్రకటనలు కూడ వెయ్యాల్సి వస్తుంది. ఉదాహరణను చూద్దాం.

(x) ఉదాహరణము :



ఈ పై కుటుంబానికి 20 ఎకరాల 'ఏ' తరగతికి చెందిన భూమి వుంది—పూర్వీకుల ఆస్థిలోంచి. అది హిందూ మితాక్షర కుటుంబం. ఎవళ్ళ బంధువు ఒకప్పుడెప్పుడో చాలా కాలం క్రిందట ఒక ట్రస్టును సృష్టించాడు. దానివల్ల 5 ఎకరాలు 'ఏ' ఆధ్వర్యంలో వుంచి అందులోని ఫలం ఆ 'ఏ' యొక్క కూతుళ్ళకు మాత్రం, వారిన్నీ, మనుమలూ మనుమరాండ్రకు మాత్రం (కొడుకు బిడ్డలు) ఇవ్వాలి. ఆ 20 ఎకరాలు ఈ 5 ఎకరాలూ అంటే మేనేజిమెంటులో వుంది. 'బి' కి స్త్రీ ధనం ఆస్థి ఒక ఎకరం వుంది. దాని మేనేజిమెంటు కూడ 'ఏ' దే.

ప్రకటనలు యిప్పుడెలా చెయ్యాలి? అంతకుముందు సమిష్టి కుటుంబం విడగొట్టుకోవాలని ఎక్కడా శాసనం లేదు. అలాంటి అవసరమూ లేదు. ప్రకటన ద్వారా వున్న విషయం ట్రిబ్యునలుకు చెప్పటమే ఈ చట్టంక్రింద, ప్రధానం. ఆ తరవాత పని ట్రిబ్యునలుది—ప్రమాణ కమత మేమిటనిగాని పరిమితి యెంతని గాని ఈ ప్రకటనంలో చెప్పవలసిన అవసరం అంతగా అవుపడదు. ప్రభుత్వంవారు ఈ శాసనం క్రింద నియమాలు చేస్తేగాని యిదమిత్థమని ఈ మాట చెప్పలేము కనుక ప్రకటనలను ఏవేవి మూ 'ఏ' అనే అతడు వెయ్యాలో చూద్దాము

(1) ట్రస్టు 5 ఎకరాలకూ 'ఏ' ట్రస్టీ కనక, ఆ భూమి వివరాలతోనూ అందులో హితమును పొందాల్సిన యల్, యం, హెచ్, ఐ, జెల పేర్లతోనూ ఒక ప్రకటనం.

(2) ఎ, బి, సి, యల్, యం లు ఒక యూనిటు కుటుంబం. వాళ్ళకు 20 ఎకరాల్లోను, 1 (బి) ఎకరంలోనూ, ట్రస్టు 5 ఎకరాల్లోనూ హితం వుంది కనుక మొత్తం 26 ఎకరాలూ చూపుతూ—జాయింటు కుటుంబంలో అందరిపేర్లు చెప్పి వారివారి హోదాలను తెలియ జెయ్యాలి.

(3) డి, ఇ, కలిసి ఒక యూనిటు కుటుంబం.—20 ఎకరాలు చూపి కుటుంబ లోని అందరి పేర్లు వారివారి హోదాలు చెప్పాలి.

(4) జి, హెచ్, ఐ లు ఒక కుటుంబం—20 ఎకరాలూ ట్రస్టు 5 ఎకరాలూ మొత్తం 25 ఎకరాలూ చూపించి యల్, యం, జి ల సంగతికూడ అందులో వ్రాయాలి, మిగతా జాయింటు కుటుంబ సభ్యులతో పాటు.

(5) 'కె' ఒక ప్రత్యేక వ్యక్తి—అంటే తరపున 20 ఎకరాలూ చూపి కుటుంబంలో ఇతర్ల సంగతి కూడ అందులో చెప్పాలి.

(6) 'జె' తరపున—ప్రత్యేకవ్యక్తి గనుక—ఒక ప్రకటనం—20 ఎకరాలూ, 5 ఇ ట్రస్టుకు సంబంధించిన ఎకరాలూ చూపి, అందరి సంగతి చెప్పాలి. యల్, యం, హెచ్ ఐ లకు గల ట్రస్టు ఆస్థిలోని హితము సంగతి కూడ చెప్పాలి.

ఈ ప్రకటనలన్నీ, వున్న విషయాలను విడమర్చి చెప్పటమే అవి అందరిమీద బైండింగే. ఎవరికయినా అభ్యంతరము లేక ట్రిబ్యునలువద్ద తమ అభ్యంతరాలు చెప్పుకోవచ్చు. రుజువు చేసుకోవచ్చు.

ట్రిబ్యునలు చేసే పనేమిటి?

సెక్షను 4 సెక్షను 5 క్రింద ప్రమాణ కమతమును నిర్ణయించి కుటుంబములోని సభ్యులకు కలిగిన హక్కులు బాధ్యతలు చూచి పరిమితి నిర్ణయించి మిగిలిన భూమి వదులు కోవటం. పై ఉదాహరణలో — వున్న మొత్తం 26 ఎకరాల భూమి కూడ 'ఏ' తరగతి భూమే ననుకొందాం అప్పుడు ప్రమాణ కమతం 10 ఎకరాలు 5 గురు సభ్యులున్న యూనిటు కుటుంబానికి సీలింగు పరిమితి 10 ఎకరాలు ఆరుగురుంటే 12 అవుతుంది. కాగా—

(1) వ ప్రకటనం చూసి ట్రిబ్యునలు వదులుకోమని చెప్పదగిన భూమి యేదిలేదు—వున్నది 5 ఎకరాలే కనక అదే 60 ఎకరాలయితే, 5గురికీ(యల్, యం, హెచ్ ఐ, జెలు) ఒక్కొక్కరికి 12 ఎకరాలొస్తాయి గనుక తగ్గించదానికిగాను $5 \times 2 = 10$ ఎకరాలు వదులుకోవాల్సి వచ్చేది.

(2) వ ప్రకటనంలో—విభాగించుయితే ఎకి 4 బికి 1 సికి 4 యల్‌కు 1 యంకు 1 మొత్తం 11 ఎకరాలు ఆ యూనిటు కుటుంబానికి రాదగును. పదికంటె ఎక్కువయిన ఒక ఎకరం వారంతా వదులు కోవాలని అంటాడు. అంటే ప్రకటనలోని 26 ఎకరాలలో పది ఎకరాలకే వీరి హక్కుల పరిమితి మిగతా 16 ఎకరాలూ సమిష్టి కుటుంబంలో మిగతావారికి.

(3) వ ప్రకటనంలో — పైలాగే 1 ఎకరాలలోనే వారికి గల హక్కు మిగతా 16 ఎకరాలతో సంబంధం వారికుండనక్కరలేదని అర్థం (ఇది విడగొట్టుకోవటం అని అర్థం చేసికోవద్దు. లెక్కమాత్రమె.)

(4) వ ప్రకటనంలో $4 + 2 = 6$ ఎకరాలలోనే వారికి పరిమితి మిగతా 19 ఎకరాలు మిగతవారికిగాను అని అర్థం.

(5) వ ప్రకటనంలో కెకు 4 ఎకరాలు పైలాగే.

(6) వ ప్రకటనంలో జెకు 1 ట్రస్టు ఎకరం. అంతే ఇలా లెక్కవేస్తే—

మొత్తం వుండదగిన భూమి—ఎ,బి,సి,యల్,యంలకు 10,

డి,ఇలకు 1, జి హెచ్ ఐలకు 6, కెకు 4 జెకు 1 మొత్తం 25 ఎకరాలు కనక వదులుకోవలసింది 1 ఎకరం మాత్రం.

ఈ ఎకరం ఎవరు వదులుకోవాలంటే మొదట చెప్పిన యూనిటు కుటుంబం. హక్కులెవరెవరు ఎంతెంత వదులుకోవాలనే విషయం వాళ్ళ ఒప్పుదలమీద నిర్ణయించవచ్చును. అలాటి ఒప్పుదల కుదరకపోతే వారివారి హక్కుల దామాషా ప్రకారం మిగిలిన 10 ఎకరాలల్లో హక్కును మిగిల్చుకోవాలి. అంటే ఆ దామాషాలోనే ఈ

1 ఎకరంలో హక్కు వదులుకోవాలన్న మాట. ఈ రెంటికీ ఒకటే అర్థం. మిగిలినవి అనుకొన్న 10 ఎకరాలలో ఎ కి 4/11, బి కి 1/11 సి కి 4/11, యం కు 1/11, యల్‌కు 1/11 వున్నట్లు లెక్క.


చిత్రమేమిటంటే 'సి' మేజరయి యుండి, జె, యఫ్‌లు మైనర్లయివుంటే — ఎ, బి, జి. హెచ్, ఐ, జెలు ఒక యూనిటు కుటుంబం (6గురు) 12 ఎకరాలు వుంచుకోవచ్చు. ఆ సందర్భంలో ప్రభుత్వానికివ్వాల్సిన భూమే మిగిలేదికాదు;

ఉదా. 3. 'జె' కు తల్లో తండ్రో అదివరకే (24.1.71 కి పూర్వం) ఒక ఎకరం వ్రాసియున్నట్లయితే మొత్తం 26 ఎకరాలూ కూడ వీళ్లల్లో ఎవరికో వుండేవి. ఆ బదిలి ఇవాళ చేస్తామంటే చెల్లదు. కుటుంబంలో అంతా ఒప్పుకొంటే మాత్రం ట్రిబ్యునలుకు ఒప్పుకొనే అధికారంలేంది ఎలా చెల్లుతుంది?

ప్రముఖ సాహితీవేత్త

స్వర్గీయ తాపి ధర్మారావుగారికి శ్రద్ధాంజలి

ప్రముఖ సాహితీవేత్త, సుప్రసిద్ధ పండితుడు, విమర్శకుడు, అభ్యుదయరచయితల ఉద్యమ నిర్మాత, సంఘ సంస్కారమూర్తి అయిన శ్రీ తాపీ ధర్మారావు గారు మే 8వ తేదీ తెల్లవారుఝామున హైదరాబాదులోని తమ 86వ ఏట స్వర్గస్థులయ్యారు.



1887 సెప్టెంబరు 19వ తేదీన ధర్మారావుగారు బరంపురంలో జన్మించారు. బరంపురం, విజయనగరం, మద్రాసు పచ్చయ్యప్ప కళాశాలల్లో విద్య నభ్యసించారు. అటు పిమ్మట బరంపురంలోనూ, విశాఖపట్టణంలోనూ లెక్కల మాస్టరుగా ఉద్యోగంచేశారు. కొంత కాలంపాటు పుర్లాకిమిడి, చుండి, దక్షిణ వెలూరు, మందసా, బెంకి మొదలైన జమీందారీలలో ట్యూటరుగా, వార్డెనుగా పనిచేశారు. కొంత కాలం బొబ్బిలి రాజా ప్రైవేటు సెక్రటరీగా వున్నారు. ద్వితీయ ప్రపంచ సంగ్రామకాలంలో అసిస్టెంటు రిక్రూటుమెంటు ఆఫీసరుగా, అసిస్టెంటు పబ్లిసిటీ ఆఫీసరుగా విజయవాడ, గుంతకల్లు కేంద్రాల్లో పనిచేశారు.

బరంపురంలో 'వేగుచుక్క గ్రంథమాల, స్థాపించి అనేక పుస్తకాలను ప్రచురించి తెలుగు సాహిత్య వ్యాప్తికి తోడ్పడ్డారు. 'కొండెగాడు' జనవాణి, కాగడా అనే ప్రతికలకు సంపాదకులుగా వున్నారు. తొలిసారిగా వ్యావహారిక భాషను పత్రికారంగంలో చేపట్టిన ఘనత వీరికే దక్కుతుంది.

కొత్తపాళి, ఓనమాలు, సాహిత్యమొర్మరాలు, దేవాలయాలమీద బూతుబొమ్మలెందుకు, పెళ్ళి దాని పుట్టుపూర్వోత్తరాలు వంటి గ్రంథాలు బాగా జనాదరణ పొందాయి. అనేక సినిమాలకు కథలు, మాటలు, పాటలు రాశారు.


వీరి విజయవిలాస వ్యాఖ్యానానికి గతఏడాది కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి లభించింది, వీరు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యులు.



ఆంధ్రప్రదేశ్‌లో అనావృష్టి ప్రాంతాలలో ఆహార పదార్థాల పంపిణీ



గ్రుక్కెడు నీళ్లకోసం వాచి పోయిన పశు సంతతి




గుల్బర్గా (మైసూరు)లో ఆహార పదార్థాల పంపిణీ

★


ఆంధ్రప్రదేశ్ గుజరాత్, మహారాష్ట్ర, మైసూరు, బీహార్, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్ మొదలగు రాష్ట్రాలలోని అనేక ప్రదేశాలలో అనావృష్టి పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఈ ప్రకృతి వైపరీత్యం మీద యుద్ధం ప్రకటించినంత కృతనిశ్చయంతో ప్రజలు వీటిని ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సహాయక చర్యలు తీసుకుంటున్నాయి. క్రొత్తగా గొట్టపు బావులు తవ్వడం, పాతబావులను లోతుచేయడం జరుగుతున్నది. టేంకర్లు, ఎద్దు బండ్ల ద్వారా కూడా అనావృష్టిప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతున్నది. అక్కడి ప్రజలకు జీవనోపాధి కల్పించడానికి అనేక పథకాలు అమలు జరుపుతున్నారు. ఈ ఏడాది జూన్ నెలనాటికి దేశం మొత్తంమీద 70 లక్షలకు పైగా సహాయక పథకాలు అమలు జరుపబడతాయి. వీటిలో రోజువారీ కూలీ 1 కోటి 40 లక్షల రూపాయలవరకు వుంటుంది. అనా వృష్టిపరిస్థితుల్ని ఎదుర్కోడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఉదారంగా సహాయ అందజేస్తున్నది. దేశమంతటా సహాయక సంస్థలు అనావృష్టి బాధితుల సహాయార్థం నిధులను వసూలు చేస్తున్నవి.

★


దేశంలో నలుమూలలా
ప్రళయతాండవం చేస్తున్న



వల్లభిపురం (గుజరాత్)లో సహాయక కార్యక్రమం




పండరి పింపలగామ్ (మహారాష్ట్ర)లో ఇటీవల త్రవ్విన బావి



భావనగర్ (గుజరాత్)లో కొత్తగా వేసిన నీటి పంపులు

అనావృష్టి పరిస్థితులు



జయక్‌వాడి (మహారాష్ట్ర)లో బండ్లమీద పీపాలతో నీటి సరఫరా

స్వాతంత్ర్య ఉద్యమంలో కొన్ని ప్రధాన ఘట్టాలు:

కాకినాడ బాంబు కేసు

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పెరిస్థు కార్యకలాపాల ప్రాధాన్యత తక్కువదేమీకాదు. సంగ్రామం ప్రధానవాహినికి 'అహింసామూర్తి అయిన బాపూజీయే నాయకత్వం వహించి నప్పటికీ, శాంతియుత శాసనోల్లంఘనం, సత్యాగ్రహాలే ఉద్యమ పద్ధతుల్లో ప్రధాన పాత్ర వహించినప్పటికీ, అక్కడక్కడా హింసా విజృంభణలు, భారతీయ యువతరం కోపాగ్నిజ్వాలలు విస్ఫులింగాలై నాయకుల అదుపునుడావని విస్తరించడాలూ జరుగుతూనే ఉండినవి.

అహింసాయుత శాసనోల్లంఘన పద్ధతిలో సాగిపోయిన భారత స్వాతంత్ర్య సంగ్రామవాహినికి సమాంతరంగా హింసాత్మక కార్యకలాపాలు కూడా కొనసాగినవి. ప్రపంచ చరిత్రలో అంతవరకు సాగిన జాతీయ విముక్తి పోరాటాలన్నీ హింసా పద్ధతులలో జరిగి ఉన్నందు వల్ల నైతేనేమి, అహింసాయుతమైన శాసనోల్లంఘన విధానాన్ని రవి అస్తమించని (బ్రిటిష్ సామ్రాజ్యం వంటి అత్యంత బలీయమైన పాలక వర్గానికి వ్యతిరేకంగా కోట్లాది మంది భారతీయులు జరిపిన తిరుగుబాటులో ప్రధానమైన ఆయుధంగా మొట్టమొదటి సారిగా ప్రయోగించడానికి గాంధీజీ సంకల్పించడం సరీనూతన ప్రయోగం అయినందువల్లనైతేనేమి, దేశస్వాతంత్ర్య మహాసంగ్రామంలో హింసాకార్యకలాపాలు, విప్లవ చర్యలు సరైన స్థానాన్నే ఆక్రమించాయి. ప్రముఖంగానే ఫలితాలనూ ఇచ్చాయి. స్వతంత్రం సంపాదించుకొని, రజతోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో భారతదేశానికి స్వాతంత్ర్యం అచ్చంగా గాంధీజీ అహింసా పద్ధతులద్వారా జరిపిన పోరాటం వల్లనే సిద్ధించినదా లేక భగత్‌సింగ్, నేతాజీ సుభాస్ చంద్రబోసు, దత్తవంటివారు సాగించిన సాయుధ పోరాటాలూ, 1942లో కాంగ్రెసు అగ్రనాయకులందరూ జైళ్ళలో ఉన్నందువలన రహస్యజీవితాలు గడుపుతూ ఉండిన సోషలిస్టులు సాగించిన విప్లవ చర్యలు కూడా ఇందుకు దోహదం చేశాయా అని పరిశీలనకు పూనుకుంటే ఉభయ పద్ధతులూ ప్రాధాన్యత వహించాయనీ, ఫలితాలకు ఉభయవాహినులూ సమాన బాధ్యతనే వహిస్తాయనీ అంగీకరించవలసి ఉంటుంది.

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అహింసా పద్ధతుల్లో, శాంతియుత శాసనోల్లంఘనం ప్రధాన ఆయుధంగా సత్యాగ్రహాల రూపంలో జరిగిన ఉద్యమం సువ్యవస్థితంగా, సుసంఘటితంగా జరిగింది. విప్లవ చర్యలు, బాంబుల తయారీ, సాయుధ సంఘటనలు వ్యవస్థలేకుండా ఎక్కడికక్కడే— యువతరం ఆవేశాలను సద్యఃస్ఫూర్తితో ప్రతిబింబించినట్లుగా జరిగాయి. ఇందుకు ప్రధానకారణాలు ఏవైనా కానీయండి గాంధీజీయే, ఆయన సిద్ధాంతాలే భారత ప్రజానీకంలో స్వాతంత్ర్యం కోసం ప్రగాఢమైన పిపాసను తపనను కలిగించినప్పటికీ అక్కడక్కడా యువకిశోరాలు తల పెట్టిన ఈ విప్లవ చర్యలను వారు మార్క్సు పద్ధతులను అధ్యయనం చేసి జరిపి ఉండటం ఒక కారణం కావచ్చును. ఇలాంటి విప్లవ చర్యలను జరిపిన యువకులకు గాంధీజీ సిద్ధాంతాలలో విశ్వాసం ఉన్నప్పటికీ పద్ధతులను మాత్రం మార్క్సు సూచించిన ఎత్తుగడలనుండి అభ్యసించినందువలన ఒక సిద్ధాంతానికి, మరొక సిద్ధాంతపు పద్ధతులను ఎత్తుగడలను అతికించినందువల్ల ఈ చర్యలు ఎక్కడికక్కడ విడివిడిగా జరిగాయేగాని పథకం ప్రకారం—అంటే మొత్తం జాతీయస్థాయిలో ఇదుకుగాను ఒక పథకాన్ని రూపొందించుకొని, జాతీయనాయకత్వం అదుపాజ్ఞలననుసరించి ఆదేశాలను టిపాస్తూ జరిగిన విప్లవ చర్యలు మనకు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కనిపించవు.

లాహోరు కుట్రకేసులో పాల్గొన్న యోధులకు, మద్రాసు కుట్రకేసు సంగతి తెలియదు; మద్రాసు కుట్రకేసులోని సాహసులకు కలకత్తా కుట్రకేసుతో సంబంధం ఉండదు. ఇలా విడివిడిగాదేనికదే ఒకచర్యగా ఒక సాహసోపేతమైన పోరాటంగా ప్రసిద్ధికెక్కాయి.

దేశంలో జరిగిన ఈ విధమైన విప్లవ చర్యల పై న్యాయస్థానాలలో ఆనాటి పోలీసులు పెట్టిన కేసులన్నింటిలోనూ చట్టసమ్మతంగా నెలకొని ఉన్న ప్రభుత్వంపై యుద్ధానికి పూనుకోవడం (వేజి గ్వార్ అగెనిస్ట్ దిలాఫుల్ ఎస్టాబ్లిష్డ్ గవర్నమెంట్) అనే అరోపణను భారత శిక్షాస్మృతిలోని 120—బి క్రింద ఆరోపించి

సురమౌళి

నప్పటికి ఈ చర్యలన్నీ ఆయా ప్రాంతాలలో బ్రిటిష్ ప్రభుత్వానికి నమ్మకస్తులైన ఉద్యోగులుగా, స్వాతంత్ర్య సంగ్రామాన్ని శాయశక్తులా అణచి వేయడానికి పూనుకొని, మహాక్రూరులుగా దుష్టులుగా ప్రతిష్ఠను సంపాదించుకొన్న పోలీసు అధికారుల మీదను కలెక్టర్ల మీదను కోపాన్ని ప్రదర్శించుకొనడానికే ప్రధానంగా జరిగాయి. మొత్తం బ్రిటిష్ సామ్రాజ్యంమీదే యుద్ధం ప్రకటించినట్లుగా ఏ ఒక్క సంఘటనాజరుగలేదని నిస్సంశయంగా చెప్పవచ్చు.

కాకినాడ బాంబుకేసు 1933 ఏప్రిల్ మాసంలో జరిగింది. ఏప్రిల్ 15వ తేదీన, కాకినాడ రేవులో ఒక బోటుచాటున, లాకుల్లో దాచివున్న మందుగుండు సామగ్రి, నాటు బాంబులు ఒక్క బోటు వాని కంట పడ్డాయి. అవేమిటో చూడాలని అతనికి కుతూహలం కలిగింది. ఆపిలు పండులా ఎర్రరంగు కాగితంలో చుట్టివున్న

గు ద్రటి వస్తువు బా బేమోనన్న అనుమానం అతనికి కలుగలేదు. బొడ్డున్న ఉన్న కత్తి తీసుకొని, దాన్నికోశాడు. అది దదాలున ప్రేలింది. అతనికన్ను పోయింది. ముఖానికి తీవ్రంగా గాయాలు తగిలాయి. ప్రక్కనే ఉన్న మరో ఎనమండుగురు బోటు వాళ్లు కూడా స్వల్పంగా గాయపడ్డారు. ఆ రోజుల్లో అత్యంత ఉత్సాహ ఉద్రేకాలతో స్వాతంత్ర్య సంగ్రామకార్యకలాపాలలో పాల్గొంటూ ఉందిన యువకిశోరం భయంకరాచారి పన్నిన పన్నాగమే ఇది అని పోలీసులకు అనుమానం కలిగింది. భయంకరాచారినీ ఆయన మిత్రులనూ పట్టుకోవడానికి పోలీసులు గాలింపు ప్రారంభించారు.

ఈ సంఘటనకు పూర్వం జరిగిన కొన్ని సంఘటనలను ముఖ్యంగా భయంకరాచారిని ఇందుకై పురికొల్పిన సంఘటనలను ఇక్కడ పేర్కొనడం చాలాఅవసరం.

ఆ రోజుల్లో శ్రీబులుసుసాంబమూర్తిగారు, ఆంధ్రదేశంలో స్వాతంత్ర్య సంగ్రామంలో అగ్రనాయకులుగా ఉన్నారు. అనేక సత్యాగ్రహాలకూ శాసనోల్లంఘన ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారు. ప్రస్తుతం శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గా మారిన ఆనాటి శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారు శ్రీసాంబమూర్తికి అండదండగా ఉండి అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. వీరితో బాటే శ్రీబ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యంగారు, శ్రీ నాళం కృష్ణారావుగారూ ఆరోజుల్లో స్వాతంత్ర్యసంగ్రామంలో అగ్రగాములుగా ఉండి పాల్గొన్నయోధులు.

ఆరోజుల్లో కాకినాడలో పోలీసు అధికారిగా బహుశా సర్కిల్ ఇనస్పెక్టరుగా శ్రీ సుబ్బారావు అనే ఆయన ఉండేవారు. ఈ సుబ్బారావుకు డప్పుల సుబ్బారావు అనేపేరు చిరకీర్తిగా వచ్చింది. అంతకు ముందు ఈయన రాజమండ్రిలోనూ తదితర ప్రాంతాలలోనూ పోలీసు అధికారిగా తన విధులను బ్రిటిష్ ప్రభువుల మన్ననలను అందుకునేట్లుగా నిర్వహించారు. కాంగ్రెసువారు ఏర్పాటు చేసే బహిరంగ సభలను విచ్ఛిన్నం చేయడానికి డప్పులు వాయించడం ఈయన పద్ధతి, ఎక్కడ కాంగ్రెసుసభ జరుగుతున్నా సరే, అక్కడికి వెళ్లి ఆ సభాసమీపంలో పదుగురి చేత డప్పులు వాయింప చేసేవాడు. సభ భగ్నమైపోయేది. సత్యాగ్రహులు చేసిన వారిని అరెస్టుచేసి సరాసరి కోర్టుకు తీసుకొని పోయేవాడు కాదు. పోలీసుస్టేషన్లలో వారిని పెట్టి హింసించేవాడు, ఎముకలు విరిగేదాకా కొట్టేవాడు. ఇతనికి అండగా ముస్తఫాలీఖాన్ అనే మరోవ్యక్తి ఉండేవాడు. ఈముస్తఫాలీఖాన్ కూడా బ్రిటిష్ పాలక వర్గానికి నమ్మినబంటే. ఇతడు కూడా నిర్బంధంలో ఉన్న కాంగ్రెసు నాయకులను సత్యాగ్రహులను బాగాకొట్టేవాడు.

శాంతియుతంగా సత్యాగ్రహం చేసిన శ్రీబులుసు సాంబమూర్తిగారినీ, శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారినీ ఈడప్పుల సుబ్బారావు అరెస్టు చేసి, పోలీసు స్టేషనులో పెట్టి బాగా కొట్టాడు. దీన్ని కళ్లారాచూసిన యువతరం రక్తం ఉడికి పోవడం అసహజమేమీ కాదు. అదేవిధంగా సత్యాగ్రహులైన శ్రీనాళం కృష్ణారావునూ, శ్రీ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం గారినీ ముస్తఫా అలీఖాన్ పాశవికంగా కొట్టాడు. ఈ దెబ్బలకు శ్రీబ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యంగారి ప్రక్క ఎముకలు— రిబ్స్— విరిగిపోయినవి. వాటికి చికిత్స చేయించినా అవి మానలేదు. చివరకి ఆ గాయాలతోనే ఆయన మరణించారు.

డప్పులసుబ్బారావు, ముస్తఫాఅలీఖాన్ గార్లుసాగించిన ఈ పాశవిక చర్యలకు యువరక్తం దహించుకొని పోయింది. ప్రతీకార వాంఛ వారిలో తీవ్రరూపం ధరించింది. ఈ యువతరానికి భయంకరాచారి నాయకత్వం వహించాడు. ఆయన అసలు పేరు శ్రీ ప్రతివాది భయంకర వేంకటాచార్యులు. రహస్య కార్యకలాపాలు కొనసాగించడానికి వీలుగా తన పేరును ఆయన భయంకరాచారిగా మార్చుకున్నారు.

ఇదిలా ఉండగా అప్పటికే మద్రాసు కుట్రకేసు జరిగింది. నెల్లూరు యువకుల నాయకత్వాన జరిగిన ఈ కుట్రకేసులో ఆంధ్రదేశంలోని ప్రముఖ టెర్రరిస్టు నాయకులనేకమంది పాల్గొన్నారు. ఈ మద్రాసు కుట్రకేసు తెలుగునాడులోని మిగతా ప్రాంతాలలోని యువకులకు ప్రేరణను కలుగజేసింది. ఈ సత్యాగ్రహాలూ, శాంతియుత పోరాటాలూ ఎన్నటికి తెగేను? పాశవికంగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వాధికార్లకు ఎన్నటికి బుద్ధి వచ్చేనని అతి విసుగు చెందుతున్న యువతరానికి, ఎటువంటి థ్రిల్లూ ఏమాత్రం సస్పెన్సూలేని కాంగ్రెసు కార్యక్రమాల వల్ల సంతృప్తి చెందని యువతరానికి మద్రాసుకుట్రకేసు మంచి ప్రేరణను కలుగజేసింది.

మద్రాసు కుట్రకేసు అంతకు ముందే జరిగినదైనప్పటికీ తెలుగు గడ్డమీద జరిగిన టెర్రరిస్టు చర్యలకు కాకినాడ బాంబుకేసే నాందిగా పేర్కొనదగినది. మద్రాసు కుట్రకేసు జరిగిన మద్రాసు పట్టణం మూరుమూల్కోటు తమిళనాడు భూభాగాలై పోయినవిగద!

ఆరోజుల్లోఉత్తరహిందూస్థానంలో జరిగిన అనేక సాయుధ పోరాట చర్యలలో, విప్లవ కార్యకలాపాలలో నిందితులై నిర్బంధంలో ఉండిన అనేక మంది టెర్రరిస్టు నాయకులు, నేతాజీ సుభాస్ చంద్రబోస్ అనుయాయులు దక్షిణాపథంలోని జైళ్ళలో శిక్షలు అనుభవిస్తూ ఉండేవారు. వారి ఉనికి దక్షిణాపథం యువకులలో టెర్రరిస్టు కార్యకలాపాల పట్ల ఆసక్తిని పెంపొందించినది. ఆ రోజులలో తిరుచునాపల్లి జైలుశిక్ష అనుభవిస్తూ ఉండిన నేతాజీ సుభాస్ చంద్రబోస్ "ఇండియా ఎట్ క్రాస్‌రోడ్స్" అనే ఒక పుస్తకాన్ని రచించి సైక్లోస్టయిలు చేసి పంచి పెట్టాడు. ఇప్పుడది పుస్తకరూపంలో అచ్చయినది. ఈ పుస్తకం కూడా యువరక్తం ఉప్పొంగడానికి దోహదం చేసింది. శ్రీభయంకరాచారి ఆయన మిత్రులుకూడా ఈ గ్రంథంద్వారా ప్రేరణను పొందారు,

సరే ఎలాగయితేనేం శ్రీభయంకరాచారి తన సంకల్పానికి అనుగుణంగా ఆయుధాలను సేకరించాడు. బాంబులను తయారు జేయడాన్ని అభ్యసించి, బాంబులను తయారు చేశాడు. వీనిని ప్రయోగించక ముందే బాంబు బ్రద్దలై పథకం అంతా తలక్రిందులైంది. భయంకరాచారి, ఆయన మిత్రులూ పరారైనారు. రహస్య జీవితం గడప నారంభించారు. అయితే డప్పుల సుబ్బారావుకూడా సామాన్యుడేం కాదు. ఎలాగైతేనేమి, భయంకరాచారినీఆయన మిత్రులందరినీ అరెస్టు చేశాడు. యథాప్రకారం ఆయుధాల చట్టంక్రింద, అనుమతి లేకుండా

ఆయుధాలను ప్రోగు చేసినందుకు, బాంబులను తయారుచేసినందుకు, చట్టబద్ధంగా నెలకొన్న ప్రభుత్వం మీద యుద్ధాన్ని సంకల్పించినందుకూ నేరాలను ఆరోపించాడు.

తెలంగాణాప్రాంతంలోని కొత్తగూడెంలో శ్రీభయంకరాచారికి బంధువులుండేవారు. రహస్య జీవితంలో ఆయన కొత్తగూడెంలోని తన బంధువుల ఇంట్లో తలదాచుకోవడానికి బయలు దేరాడు. కాని ఆయన్ను శ్రీ డప్పుల సుబ్బారావు వెంబడిస్తూ వచ్చాడు. చివరికి కాజీపేట రైలుస్టేషనులో శ్రీభయంకరాచారిని శ్రీ డప్పులసుబ్బారావు స్వయంగా అరెస్టుచేశాడు.

అరెస్టయినపుడు శ్రీ భయంకరాచారి వద్ద అనేక ఉత్తర ప్రత్యుత్తరాలతో బాటు ఐదేసి ఛేంబర్లు గల ఆరు ఆధునిక రివాల్వర్లుకూడా పట్టుపడ్డాయి. రివాల్వర్లు ఉత్తరాలు ఉన్న పెట్టెతో సహా శ్రీభయంకరాచారిని అరెస్టుచేశాడు.

ఈ కేసులో శ్రీ భయంకరాచారితో సహా, మొత్తం ఆరుగురు నిందితులు. మిగతావారి పేర్లు శ్రీ సి. నరసింహాచారి, శ్రీ సత్యనారాయణాచారి–ఈ సత్యనారాయణాచారిని శ్రమజీవి సత్యనారాయణాచారి అని అంటుండేవారు, శ్రీ కాకరాల కామేశ్వరరావు, శ్రీ చల్లా అప్పారావు, శ్రీ ఓరుగంటి రామచంద్రయ్యగారలు. శ్రీ భయంకరాచారిగారు ఇటీవలవరకూ కేంద్రప్రభుత్వ ప్రణాళికా ప్రచార విభాగంలో ఫీల్డుపబ్లిసిటీశాఖలో ఉద్యోగంచేసి రిటైరైనారు. శ్రీ ఓరుగంటి రామచంద్రయ్యగారు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా ఉన్నారు.ఈకేసులోని నిందితులలో ఈ నాటికీ సజీవులుగా మన మధ్య ఉన్నవారు వీరుభయులే. మిగతా నలుగురు దివంగతులైనారు.

కేసు మేజిస్ట్రేటు కోర్టునుండి, సెషన్సుకు నివేదించబడి, హైకోర్టుదాకా నడిచింది. హైకోర్టులో ప్రభుత్వం తన పక్షాన వాదించడానికి ప్రముఖ న్యాయవాది శ్రీ బి. ఎల్. యదిరాజ్‌ను ప్రత్యేకంగా, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటరుగా నియమించింది. నిందితులపక్షాన, అప్పటికే సీనియరు న్యాయవాదిగా ప్రఖ్యాతిగాంచిన శ్రీ జగన్నాథదాసు వాదించారు. శ్రీ జగన్నాథదాసుకు జూనియర్లుగా ప్రముఖ న్యాయవాదులు శ్రీ కె. భాష్యం, శ్రీ సుసర్ల సూర్యప్రకాశరావు గారలు సహకరించారు.

ఈ కేసు హైకోర్టులో చివరిసారిగా వాదోపవాదాలు విని తీర్పును ఇచ్చిన న్యాయమూర్తులు జస్టిస్ మాధవన్‌నాయర్, జస్టిస్. బర్న్‌గారలు. ఇంత బహిరంగంగా ఉత్తర ప్రత్యుత్తరాలను జరుపుతున్న వీరు 'కుట్ర' చేశారని నమ్మడం అసమంజసమని న్యాయమూర్తులు భావించారు. 'కుట్ర' ఆరోపణను కొట్టివేశారు. అయితే ఆయుధాల చట్టంక్రింద ఆయుధాల సేకరణ, బాంబుల తయారీ నేరానికి–బోటువానికి తద్వారా గాయం తగిలినందుకుగాను శ్రీ భయంకరాచారికి మాత్రం ద్వీపాంతరవాస శిక్షను విధిస్తూ హైకోర్టు మిగతా వారందరినీ విడుదల చేసింది.

శ్రీ భయంకరాచారి ఈ కేసులో ద్వీపాంతర వాసశిక్షకు గురై సుదీర్ఘకాలం అండమానులో గడిపారు. అండమానునుండి తిరిగివచ్చిన తర్వాత అక్కడి జీవితాన్ని గురించి చక్కని గ్రంథాన్ని కూడా ఆయన రచించారు. "క్రేక్స్ పారడైజ్," అనే పేరుతో ఆయన రచించిన యీ గ్రంథానికి "అండమాను జీవితం" అనే పేరుతో తెలుగులో అనువాదం కూడా వచ్చింది.

కాకినాడ బాంబుకేసు స్వాతంత్ర్య సంగ్రామంలో ఎలాంటి విజయాన్ని సాధించ లేకపోయినప్పటికీ–అండమాను జీవితాన్ని గురించి ఒక చక్కని గ్రంథాన్ని పాఠకలోకానికి అందించ గలిగినది.

తెలుగు గడ్డమీద జరిగిన మొట్టమొదటి విప్లవ చర్య–టెరరిస్టు కార్యకలాపం కావడంతో ఈ కాకినాడకేసు, తెలుగు గడ్డ మీద జరిగిన ఇంకా అనేకమైన సకల విప్లవ చర్యలకు ప్రేరణగా నిలచినది.

ముగించేముందు మరొక్క విషయాన్ని చెప్పుకోవలసి ఉన్నది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రధాన వాహిని అయిన అహింసా పోరాటానికీ, ఆ పోరాటానికి నాయకత్వం వహించిన గాంధీజీ, మొదలగు ప్రముఖ జాతీయ నాయకులకు ఇలాంటి హింసా చర్యలు గిట్టకపోయినప్పటికీ, ఈ కార్యకలాపాలకు ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ వారి ప్రోత్సాహం, ఆశీర్వచనం లేకపోయినప్పటికీ ఇలాంటి కార్యకలాపాలలో పాల్గొనేవారిని ఆనాటి జాతీయ నాయకులు పరాయివాళ్ళగా పరిగణించలేదు; శత్రువులుగా చూడలేదు. పైగా న్యాయస్థానాలలో కేసులు నడుపుకోవడానికి అండదండలను కూడా అందించారు. తమకు ఇష్టంలేని చర్యలే అయినా వానిని వారు ఖండించలేదు.

ప్రభుత్వోద్యోగుల కరువు భత్యం

1973 మార్చి 30 వ తేదీన ప్రకటించిన ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ప్రభుత్వోద్యోగులకు కరువు భత్యం పెరిగింది. ఈ పెరుగుదల రూ. 7 ల నుండి రూ. 10 ల వరకు వుంటుంది. ధరల పెరుగుదల కారణంగా యిబ్బంది పడుతున్న ఉద్యోగులకు యీ పెరుగుదలవల్ల కొంత మేలు కలుగుతుంది.

దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వానికి సాలుకు రు. 6 కోట్లు అదనపు ఖర్చు అవుతుందని గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ పత్రికాగోష్ఠిలో ప్రకటించారు.

పంచాయతీ సమితుల సిబ్బంది, యితర స్థానిక సంస్థల సిబ్బంది, కంటిజెంట్, వర్క్ చార్జ్ సిబ్బంది, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల సిబ్బందికి కూడా యిది వర్తిస్తుంది, 1972 ఆగష్టు 1వ తేదీ నుండి యీ పెరుగుదల అమలులోకి వచ్చినట్లు పరిగణించబడుతుంది. జరిగిపోయిన కాలానికి రావలసిన బకాయీలు లెక్క గట్టి యిస్తారు.

నెలకు రూ. 85 లు అంతకులోపు జీతంగలవారికి రూ. 7 లు, రూ. 85 నుండి రూ. 210 వరకు జీతం గల వారికి రూ. 8 లు, రూ. 211 నుండి రూ. 575 వరకు జీతం గలవారికి రూ. 10 లు అదనంగా లభిస్తాయి.

సమ్మె చేయని ఉద్యోగులు

రాష్ట్ర విభజన కోరుతూ 108 రోజులు నాన్ గెజిటెడ్ ఉద్యోగులు సమ్మె చేసిన సందర్భంగా— ఒక్కరోజుకూడా సమ్మెలో పాల్గొనని ప్రభుత్వోద్యోగులకు రూ. 50 ల నగదు బహుమతి యివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. నాల్గవ తరగతి ఉద్యోగుల్లో 90 శాతం మంది సమ్మెలో పాలొనలేదనీ, వారికి యీ నగదు బహుమతి లభిస్తుందనీ గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ ప్రకటించారు.

ఉపాధికల్పన, సాంఘిక సంక్షేమశాఖ

1973 ఏప్రిల్ 1వ తేదీ నుండి సచివాలయంలో ఉపాధి కల్పన, సాంఘిక సంక్షేమ శాఖ అనే పేరుతో ఒక ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఈ ప్రత్యేక శాఖ ద్వారా నిర్వహింపబడే విషయాల వివరాలు.

1. హరిజన సంక్షేమ శాఖ ద్వారా సహాయం పొందుటకు అర్హులైన ప్రజలకు సంబంధించిన సంక్షేమ కార్యాలు. 2. భోజన వసతి గృహాలు, అనాథ శరణాలయాలు. 3. హరిజనులకు గృహ నిర్మాణం-స్థలసేకరణ, ఆరోగ్య సౌకర్యాల కల్పన. 4. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, వెనుకబడిన జాతులకు గృహవసతి కల్పన. 5. సమీకృత శిశు సంక్షేమ పైలటు పథకాలు. 6. వృద్ధాప్యపు పింఛనులు. 7, సుగాలీలు, ఏనాదుల పునరావాసం. 8. అంగవైకల్యం పొంది నిరుద్యోగులైనవారికి సహాయం. 9. పౌర ఆశక్తతల తొలగింపు. 10. విముక్త జాతులు. 11. యువజన సంక్షేమం, యువజనుల శిబిరాలు. 12. అంధులకు, బధిరులకు పాఠశాలలు-ఆశక్తులకు ప్రత్యేక పాఠశాలలు. 13. కార్మికులకు వృత్తి సాంకేతిక శిక్షణ. 14. స్త్రీ సంక్షేమ శాఖ. 15. షెడ్యూలు ప్రాంతాలు-పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖ, శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంతాలు, షెడ్యూలు జాతులు. 16. పునరావాసం, వృత్తి కల్పన 17, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు.

మా మాష్టరు గారు

—ఎఱ్ఱోజు మాధవాచార్యులు

ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారిని 1935 లో నేను ఆనర్సు చదవడానికి వాల్తేరు వెళ్ళినప్పుడు, మొదటిసారి దర్శించినాను. వారప్పుడు ఆంధ్ర యూనివర్సిటీలో ఆంధ్ర శాఖాధ్యక్షులు. నేను అందజేసిన శ్రీ వారణాసి శ్రీనివాసరావు, శ్రీ ఎస్. ఎమ్. ఎల్. ఎన్. దాసుగారల పరిచయ లేఖలు చూచి ప్రసన్నులై, ఆదరంతో పలుకరించి, వారు నా పని తెలుసుకొన్నారు. కాని నేను తెలుగు ఆనర్సు క్లాసులో చేరేందుకు అప్పటి యూనివర్సిటీ నియమావళి అనుమతించలేదు. అందువల్ల వైస్‌ఛాన్సలర్‌గా ఉన్న జయపురము దివాను శ్రీ ఓ. పుల్లారెడ్డిగారి ఆమోద ముద్రతో ఒక ప్రత్యేక సౌకర్యము కల్పించి వారు నన్ను చేర్చుకొన్నారు. తదాది వారియందు నాకు భక్తి విశ్వాసములు, వారికి నాయందు వాత్సల్యానురాగములు క్రమాభివృద్ధి చెందుతూ వచ్చినవి. మూడేళ్ళు వారి సన్నిధిలో చదివి యూనివర్సిటీలో ప్రథముడనుగా ఉత్తీర్ణుడనైనాను. తరువాత వారి ప్రోత్సాహము వల్ల యూనివర్సిటీలోనే రిసెర్చి ఫెలోగా మూడేళ్ళ కృషి ఫలమంతా రెండవ ప్రపంచ యుద్ధోపద్రవములో నష్టమైపోయింది. అదంతా ఒక పెద్ద విషాద గాథ!

ఆ వ్యాకులంతో ఇల్లు చేరి అప్పటి నుంచి ఎలాగో క్రిందా మీదా పడుతూ కాలం దొర్లించి వేస్తున్నాను. యూనివర్సిటీ గుంటూరు వచ్చి, అక్కడ ఉన్న కాలంలో కూడా మాష్టరుగారు నా పరిశోధన గ్రంథము పునఃప్రారంభించి పూర్తి చేయమని ప్రోత్సహిస్తూ వచ్చారు. కాని అనేక కారణాల వల్ల నాకు మళ్ళీ ఆ సమాధి నిష్ఠ కుదరనేలేదు.

నేను 1942 నుంచీ ఎనిమిదేళ్ళపాటు ఇంటి వద్దనే ఉండి కుటుంబ విషయాలు చూచుకోవలసి వచ్చింది. ఆ కాలంలో మా నూజివీడులో ప్రతి సంవత్సరము వసంతోత్సవాలు వైభవంగా నిర్వహిస్తూ ఉండే వాళ్ళము. ఒక సంవత్సరము ఉత్సవాలకు మాష్టరుగారు, శ్రీ కొమ్మనమంచి జోగయ్యశర్మ గారితో దయ చేశారు. ఆ ఉత్సవాలలో, మాష్టరుగారి సూచన ననుసరించి శ్రీ వేదాంతం జగన్నాథశర్మ (శ్రీ వేదాంతం లక్ష్మీ నారాయణగారి కుమారుడు) గారి భరత నాట్య కార్యక్రమం కూడా జరిగింది. మాష్టరుగారు "ఆంధ్ర సాహిత్యము-వసంతోత్సవాలు" అనే విషయం మీద గొప్ప ఉపన్యాసం ఇచ్చారు. ఆ ఉత్సవ విశేషాలు తిలకించి వారు ఎంత సంతోషించారో చెప్పలేను. అప్పటి నుంచే శ్రీ జోగయ్యశర్మగారు నన్ను "వసంత మాధవా!" అంటూ పిలవడం మొదలు పెట్టారు.

శ్రీ పింగళివారు, శ్రీ విశ్వనాథవారు తిరుపతి వెంకటేశ్వర కవీశ్వరుల శిష్య ప్రముఖులు. ఒక విధంగా సోదరులు. ఇరువురును మాకు గురువులే. నేను గుడివాడ కాలేజీలో పని చేస్తుండగా కాలేజీ ఉత్సవాలకు గురువులిద్దరను ఆహ్వానించాము. కాని, సర్దార్ పటేల్ నిర్యాణమువల్ల ఆ యేటి కార్యక్రమమంతా ఆగిపోయింది. తరువాత, శ్రీ విశ్వనాథవారి షష్టి పూర్తి సందర్భంగా శ్రీ రాజారంగయ్యప్పారావు కాలేజీలో జరిగిన మహాసభకు సోదరులు శ్రీ పాటిబండ మాధవ శర్మ, శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి మొదలైన వారు మాష్టరుగారిని ఆహ్వానించి కృతార్థులైనారు. ఆనాటి మాష్టరుగారి ఉపన్యాసము ఒక కళా ఖండము. ఆంధ్ర సాహిత్య లోక మంతకూ అదొక పర్వ దినము. అంతకు ముందొకసారి మాధవ శర్మ గారి సారథ్యము క్రింద మేమంతా మాష్టరుగారికి "గురు పూజా మహోత్సవాలు" జరపడానికి సంకల్పించినప్పుడు ప్రప్రథమ గా శ్రీ సత్యనారాయణగారి దగ్గరకు వెళ్లి వారితో ప్రస్తావించినాము. వారు చాలా సంతోషించి, ఉత్సవ నిర్వహణకు నూట పదారు రూపాయలు విరాళము వ్రాస్తూ, "గురు పూజామహోత్సవ కార్యక్రమములో మొదటి వాణ్ణిగా పాల్గొంటానని," అంటూ మమ్ములను ఎంతో ఉత్సాహ పరిచారు.

గురుపూజ

నేను 1966 లో ధర్మ అప్పారావు కాలేజీ స్థాపన సందర్భంలో నూజివీడు వచ్చేశాను. కాలేజీ మొదటి సంవత్సరమే గురుపూజా మహోత్సవాలు తలపెట్టి వైభవంగా నిర్వహించాము. తిరుపతిలో ఉంటున్న మాష్టరు గారు మా ఆహ్వానము మన్నించి నూజివీడు దయచేశారు. వారి శిష్య సంతతిలో ప్రముఖులు, విద్వత్కవులు, స్నేహితులు ఎందరో వచ్చి ఉత్సవాలలో పాల్గొన్నారు. మంగళ వాద్య స్వస్తి వచనాలతో జయ జయ ధ్వనులతో గురువుగారిని పురవీధులలో ఊరేగించి, కళాశాలావరణములో ప్రత్యేకంగా అలంకరించిన వేదిక వద్దకు పూర్ణ కుంభముతో స్వాగతము చెప్పి, అడుగులకు మడుగులు పడుతూ తీసికొనివచ్చి, శ్రీ వేలూరి శివరామ శాస్త్రిలవారి అధ్యక్షతను దేవేంద్రసభవలె జరిగిన— ప్రభువులు, కవులు, పండితులు, పురప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులు సమావేశమైయున్న నిండోలగములో వెండి సింహాసనము మీద వేంచేయింప చేసి స్తోత్ర నామావళి పఠనముతో అష్టోత్తర శతనామ సువర్ణ పుష్ప సంచయముతో వారి శిష్య ప్రియ శిష్యులందరు పాద పూజచేశారు. పట్టు జరీ అంచుల వస్త్రములతో కాశ్మీరు శాలువలతో సత్కరించారు. గద్య పద్యోపహారాలు సమర్పించారు. శిష్యగణమంతా కృతకృత్యమై మహానందమునం దోలలాడింది. ఉత్సవములు ప్రారంభించిన నాటి మంత్రి వర్యులు శ్రీ రాజా రంగయ్యప్పారావు గారు," పూజ్యులు శ్రీ లక్ష్మీకాంతం గారికి పెద్దలైన శ్రీ శివరామ శాస్త్రిలవారి సమక్షములో అపూర్వమైన అనన్య సామాన్య మైన ఇటువంటి పరిషత్సన్మానము జరపడము మహానంద దాయకంగా ఉన్నది. ఈ మహోత్సవమూ, ఈ విద్వత్పరిషత్సన్మాన సభా, నేత్ర పర్వంగా చూస్తున్న వారందరు ఎంతో ధన్యులు. అదృష్టవంతులు.'' అని సెలవిచ్చారు.

ఆంధ్ర యూనివర్సిటీలో ఆనర్సు కోర్సులు ప్రారంభము చేసినప్పుడు సర్ రాధా కృష్ణన్‌గారు శ్రీ లక్ష్మీకాంతం గారి చేత

తెలుగు ఆనర్సు కోర్సుకు పాఠ్య ప్రణాళిక సిద్ధము చేయించినారు. ఆ ప్రణాళిక ననుసరించి పద్దెనిమిది సంవత్సరాలు ఆంధ్ర యూనివర్సిటీలో వారు ఆనర్సు విద్యార్థులకు బోధన చేశారు. ఆంధ్ర భాషా సాహిత్య బోధనలో వారికి వారే సాటి. వారి ఆంధ్ర సాహిత్య చరిత్ర, సాహిత్య విమర్శ పాఠముల సంకలనములే మహాగ్రంథములైనవి. ఆంధ్ర సాహిత్య చరిత్రకు, సాహిత్య విమర్శకు సుష్టు రూపము లేర్పడినవి. శతాధికులుగా నేడు ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర, ఉస్మానియా, మద్రాసు, మైసూరు, బెంగుళూరు, ఢిల్లీ యూనివర్సిటీలలోను, అనుబద్ధ కళాశాలల లోను, ఆంధ్ర గీర్వాణాచార్యులుగా, ప్రాచార్యులుగా నున్న వారి శిష్యులందరు వారి గౌరవ ప్రతిష్ఠలను సుప్రతిష్ఠితములు చేస్తున్నారు. వారు బోధించిన ప్రాచ్య పాశ్చాత్య భావధారా సమన్వయ రూపములైన స్వీయ కల్పిత పరిభాషా ప్రవచన విశిష్టములైన సాహిత్య పాఠములే నేడు రూపాంతరములు పొంది వ్యాసములై గ్రంథములై అన్యకర్తృకములుగా ప్రచురణకు వస్తున్నవి. "ఆంధ్ర వాఙ్మయ చరితంబు నవల నెవరు చెప్పి వ్రాసిన నది గురూచ్ఛిష్టమె కదః" అని సోదరుడు శ్రీ రజనీకాంతరావుగారు చెప్పినది వాస్తవము.

నేడు ఆంధ్ర భాషోపాధ్యాయులకు తదితరోపాధ్యాయులతో సమానమైన ప్రతిపత్తి, గౌరవము ఏర్పడినవంటే అందుకు కారకులు ప్రేరకులు శ్రీ లక్ష్మీకాంతంగారే, సందేహము లేదు. కళాశాలలలో, భాషోపాధ్యాయులకు తక్కిన ఉపాధ్యాయులతో పాటు వేతనములు, ఇతర సౌకర్యములు ఉండవలెనని, తక్కిన శాఖలవలెనే భాషాశాఖ కూడా సమాన స్థాయిలో ఉండవలెనని భావించి అందుకోసము కృషిచేసి సాధించిన వారు వారే. వారి హయాములో "తెలుగు మాష్టరు" అనే తేలిక భావము పోయింది. భాషోపాధ్యాయులందరకు ఆత్మ విశ్వాసము, ఆత్మ గౌరవము పెంపొందినవి. విశ్వ విద్యాలయోపాధ్యాయుల ప్రశంసలు పొందిన సర్వతోముఖమైన వీరి దక్షతకు వేరే ప్రశంస అనవసరం! మాష్టరుగారి శిష్య వాత్సల్యము పుత్ర నిర్విశేషమైనది. నేటి విద్యావిధానమును, విద్యాలయ వాతావరణమును బాగుపడవలెనంటే వాటిలో ముందుగా ప్రాచీన గురుశిష్యసంప్రదాయానుబంధములు నెలకొనవలెనని వీరు అంటుండేవారు.

సౌందర నందము

తమ గురువులవలెనే మాష్టరుగారు నెచ్చెలియైన శ్రీ కాటూరు వేంకటేశ్వరరావుగారితో కలిసి అవధానములు చేసి, ఆశుకవిత్వములు చెప్పి, బహు కావ్యములు రచించి జంట కవులుగా ప్రసిద్ధి పొందినారు. వీరి సౌందరనందము విజయోత్సవాలు జరిపించుకొన్న ఆధునికాంధ్ర ప్రబంధము! మాష్టరుగారు ప్రత్యేకంగా కూడా ఎన్నో కావ్యాలు గ్రంథాలు వెలయించారు. సాహిత్య సౌరభముతో, పాండిత్య ప్రకర్షతో, విమర్శపాటవముతో భరితములై పరిణతములై వీరి వ్యాసోపన్యాసములు విద్వజ్జనామోదము నఖండముగా నందినవి. వీరు సాహిత్యోపనిషద్రహస్యసిద్ధులు! అద్యతనాంధ్ర కావ్య ప్రపంచ ప్రాడ్వివాకులు! అనన్య ప్రమాణ ప్రతిపత్తి కలవి వారి ప్రవచన విశేషములు!

పద్యములు, శ్లోకములు చదవడము మాష్టరుగారిదొక విశిష్టమైన పద్ధతి. అసలు వారి వాచికమే జలదగంభీరస్వనము గలది. ఉభయ కావ్య ప్రౌఢి శిల్పము ఉద్దాని కనుపుగా తమ వాచికమును లచి, తూచి వెలయింప గల కౌశలమును సహజాభరణములుగాగల మాష్టరుగారు ఆకాశవాణికి అపురూపములైన అలంకారములెన్నియో సంతరింపగల్గుటయం దాశ్చర్యమేమియును లేదు.

అపర క్షేమేంద్రుడు

మాష్టరుగారు మహాగంభీరులు. మితహిత సత్య భాషాభూషణులు. వ్యాహార వ్యవహార నిర్వహణమున అంతటి నియోగి ప్రభువును మరొకరిని చూడలేము. కావ్య జగత్తునందే కాక, సాధారణ జగత్తులో కూడ ఔచితీ పాలనమున వారు అపర క్షేమేంద్రులు. బిరుదులకు సన్మానములకు ఆడంబర ప్రకటనలకు వారెప్పుడును విముఖులే.

అమ్మగారు పరమపదించినప్పటినుండియు వారు మానసికముగా కొంత క్రుంగిపోయినారు. కాని వారది యేమాత్రమును పైకి కన్పించనీయలేదు. "సాహిత్య శిల్పసమీక్ష" రెండవ ముద్రణ ప్రతులు కూడ చెల్లిపోతున్నవని, ఆంధ్ర వాఙ్మయ చరిత్ర రచన పూర్తి అవుతున్నదని, హైద్రాబాదులో సాహిత్య ఎకాడమీ సమావేశములకు దయచేసినప్పుడు సెలవిచ్చినారు. అది కూడ ముద్రణ పూర్తి అయితే వారికి చాల సంతోషముగా వుండేది. ఇంతలోనే వారి అవసానము ముంచుకొని వచ్చింది. ఆ సందేహము కలిగియే కాబోలు, "ప్రారంభించిన వాఙ్మయాధ్వరము నిష్ప్రత్యూహపర్యాప్తమైనా రామామణీ యంత్యకాల శుభవాంఛా పూర్తిం గావింపగా నారోగ్యమ్మును నాయువున్ మఱియు ధైర్యమ్మున్ ప్రసాదింపవే క్షీరాంభోనిధి కన్యకా హృదయ రాజీవార్క! భక్త ప్రియా!" అంటూ, ఎన్నడును లేని విధముగా భయాకుల మనస్కులై పరిదేవనము చేస్తూ వారు భగవానుని వేడుకొన్నారు.

హైదరాబాదు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాష్టరుగారిని డిశెంబరు 24 ఉదయము 11 గంటలకు చివరిసారి దర్శించినాను. ప్రాణవాయువు సాధనము ప్రక్కనే ఉన్నది. దగ్గర వారి రెండవ అబ్బాయి, మనుమడు వున్నారు. మాష్టరుగారు ఎప్పటి వలెనే నన్ను కుశల ప్రశ్నలు వేసి మాటాడినారు. గాంభీర్యము తగ్గని వారి వాగ్వైఖరి చూడగా నాకేమీ అధైర్యము కలుగలేదు. డాక్టర్ల నిర్దేశము వల్ల మాష్టరుగారి వద్ద నేను ఎక్కువ సేపు ఉండే అవకాశము లేక పోయింది. విధిలేక సెలవు తీసికొని వచ్చివేసినాను.

నాల్గయిదు రోజులు యూనివర్సిటీ సమావేశములు చూచుకొని నిరుడు జనవరి 10వ తేదీ ఉదయము నేను వాల్తేరు నుండి నూజివీడు బయలు దేరుతుండగా, "గురువుగారు గత రాత్రి పరమపదించినా" రన్న రేడియో వార్త పిడుగు పాటుగా వినవచ్చింది, దుర్విధి!— దుఃఖము పొంగివచ్చింది—— కొంతసేపు నిశ్చేష్టుడనై అలాగే ఉండిపోయాను.

అప్పుడే సంవత్సరము జరిగిపోయింది!
గురుదేవుల ఆత్మకు పరమ శాంతి లభించుగాక!

ఆంధ్రప్రదేశ్‌లో జలవిద్యుత్ ప్రాజెక్టులు



— సి. వి. నరసింహా రెడ్డి

ఆదిమకాలంలో మానవుడు అగ్నిని కనుక్కోవడం ఆనాటి సమాజ పురోగమనంలో ఒక మహావిప్లవంగా భాసించింది. దాని వల్ల మానవనాగరికతా స్వభావమే మారింది. అందుకే ఈ దేశంలో ప్రజలు చేసే కర్మకాండలో అగ్నిదేవునకు అంత ప్రాధాన్యం లభించింది. ఆధునికసమాజ చరిత్రలో విద్యుచ్ఛక్తి అటువంటి విప్లవాన్ని సాధించింది.

విద్యుచ్ఛక్తి అనే మాట వినగానే తళతళలాడే కాంతి మన స్మృతిపథంలో మెరుస్తుంది. ఈ కాంతి ఒకవైపు దేశానికి, మరొకవైపు మానవులందరికీ ఉపకరించే కాంతి. అంధకారంలోవున్న మానవజాతిని వెలుగులోకి తీసుకెళ్ళి శోభాయమానమైన జీవితాన్ని సమకూర్చే కాంతి ఇది.

నిజంగా విద్యుచ్ఛక్తి ఒకదేశంయొక్క అభివృద్ధికి కొలత బద్ద. దేశప్రజల జీవనస్థాయి, వారి ఐహికసంపద ఆర్థికాభ్యుదయం తెలుసుకోవడానికి ప్రజలు సగటునఎంత విద్యుచ్ఛక్తి వాడుతున్నారనేది ఒక సూచికగ పరిగణింపబడుచున్నది. భారతదేశంలో తలసరి విద్యుచ్ఛక్తి వాడకం 77 యూనిట్లు ఉండగా, మన రాష్ట్రములో 1970–71లో తలసరి సగటు వాడకం 55 యూనిట్లు. ఇది దేశం సగటువాడకం కంటే తక్కువే. జాతీయస్థాయికి రావడానికి మన రాష్ట్రం మరింత కృషిచేయాల్సిన అవసరం ఎంతైనాఉంది.

స్వరాజ్యం లభించిన తరువాత, సంపూర్ణవికాసం కోసం, పరిపూర్ణ ఆర్థికసాఫల్యంకోసం, మన జాతీయ ప్రభుత్వం ఒక మహత్తరమైన ప్రగతియాత్ర ప్రారంభించింది. ప్రజలందరికీ సకలసౌభాగ్యాలు కలిగించి వారికి ఆనందమయమైన జీవితాన్ని సమకూర్చడమే యీ యాత్ర ముఖ్యోద్దేశం. ఈ జైత్రయాత్ర పురోగతిలో విద్యుచ్ఛక్తి నిర్వహిస్తున్నపాత్ర అమోఘం.

విద్యుచ్ఛక్తి అనేక అవసరాలకు ఉపయోగపడుతుంది నిజానికి మన అభ్యుదయమంతా కూడా–అంటే మానవుని నాగరికజీవితం యావత్తూ–నేడు విద్యుచ్ఛక్తి అభివృద్ధితో ముడిపడివున్నది. ఇటు వ్యవసాయరంగానికీ, అటు పారిశ్రామికరంగానికీ విద్యుచ్ఛక్తి చాలా అవసరం. సేద్యపు నీటి అవసరాలకీ, నీరుతోడే పంపుసెట్లు నడపడానికీ యితర వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడమే కాకుండా, గృహ అవసరాలకు, నిత్యావసర వస్తువులు ఉత్పత్తి చేసే పారిశ్రామిక వ్యవస్థలకు విద్యుచ్ఛక్తి ఇతోధికంగా వినియోగపడుతుంది. పట్టణంలో కొద్దిసేపు విద్యుచ్ఛక్తి మౌనం వహిస్తే మనకు తెలుస్తుంది దాని ప్రాముఖ్యత ఎటుచూసినా చిమ్మచీకటి; సమస్తవ్యాపారం స్తంభిస్తుంది. యంత్రాలు పనిచేయడం మానుకుంటాయి. అంతా అయోమయంగా ఉంటుంది. మరోక్షణంలో విద్యుత్‌ప్రసారం ప్రారంభంకాగానే, మరచక్రాలు తిరిగి పని చేయడం సాగుతవి. ఎటుచూసినా వెలుతురు అగపడుతుంది. కారు చీకట్లోనుండి వెలుతురులోకి పయనిస్తున్నట్లు ఉంటుంది. ఇది విద్యుచ్ఛక్తి ప్రాముఖ్యత. అందుచేతనే అన్నిదేశాలలో మరేయితరరంగాలకులేని ప్రాముఖ్యత, ప్రాధాన్యం విద్యుచ్ఛక్తిరంగానికి వుంది.

మనదేశంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేయడానికి కావల్సిన అవకాశాలు సాధనసంపత్తి ముడిపదార్థాలు పుష్కలంగావున్నవి. విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి ప్రధానంగా కావల్సినవి నీరు, బొగ్గు, ఆయిల్, ఖనిజాలు. భారతదేశంలోని నదులలోగల నీరు, జలపాతాలవల్ల నాలుగుకోట్ల పదిలక్షల కిలోవాట్ల జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయవచ్చునని అంచనా.


విద్యుచ్ఛక్తి ముఖ్యంగా మూడువిధాల ఉత్పత్తి చేయవచ్చును. ఆయిల్, బొగ్గు మున్నగు ఇంధనపదార్థాల సహాయంతో విద్యుచ్ఛక్తిని పుట్టించడం ఒక పద్ధతి. వీటిని 'థర్మల్' విద్యుచ్ఛక్తి కేంద్రాలని అంటారు నదీజలాల నుండి, జలపాతాలనుండి విద్యుచ్ఛక్తిని పొందడం రెండవపద్ధతి. వీటిని జలవిద్యుత్ కేంద్రాలని అంటారు. ఇక మూడవపద్ధతి చాలా ఆధునికమైనది, చౌకైనపద్ధతి కూడా. ఇందులో అణుశక్తి నుండి విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయబడుతుంది. వీటిని అణువిద్యుత్‌కేంద్రాలని వ్యవహరిస్తారు.

దేశ సర్వతోముఖాభివృద్ధికి విద్యుచ్ఛక్తిని విరివిగా వాడాలన్న కృషిలో పంచవర్షప్రణాళికలక్రింద పెక్కు నదీలోయ విద్యుచ్ఛక్తి ఉత్పాదక కేంద్రాలు ప్రారంభించబడినవి. భాక్రానంగల్, దామోదర్‌లోయ ప్రాజెక్టులు వీటికి తార్కాణాలు అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుదుత్పాదనకు జలవిద్యుత్ కేంద్రాలు స్థాపించబడినవి.

నదుల రాష్ట్రంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్‌లో జలసంపద అపారంగావుంది. కృష్ణా, గోదావరి, తుంగభద్రా, పెన్నా, నాగవళి

వంశధార, మున్నగు జీవనదులు ప్రవహిస్తూ తెలుగుభూమిని పునీతం చేస్తున్నాయి. కుంతలలాంటి జలపాతాలుకూడా ఉన్నాయి. ఈ నదీ జలసంపదను సక్రమంగా ఉపయోగించుకుంటే మన రాష్ట్రంలో 30 లక్షల కిలోవాట్ల జలవిద్యుదుత్పాదనకు అవకాశాలు ఉన్నవని అంచనా వేయబడింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుచ్ఛక్తి యొక్క స్థాపితశక్తి 668 మెగావాట్లు. దానిలో 268 మెగావాట్లు జలవిద్యుత్



పోచంపాడు ఆనకట్ట

కేంద్రాల నుండి, 380 మెగావాట్లు థర్మల్ విద్యుచ్ఛక్తి, మిగత 20 మెగావాట్లు గ్యాస్ టర్బోకేంద్రాల నుండి విద్యుచ్ఛక్తి పొంద బడుచున్నది. అయితే నాల్గవప్రణాళికాంతానికి 884 మెగావాట్ల వరకు విద్యుచ్ఛక్తి గిరాకి పెరగగలదని అంచనావేయబడింది. ఈ అవసరాన్ని పూర్తి చేయడానికి రాష్ట్రప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తున్నది. కొన్ని క్రొత్త ప్రాజెక్టుల ప్రారంభంతోపాటు ప్రస్తుతం పనిచేయుచున్న విద్యుత్ఉత్పాదక కేంద్రాలను పటిష్టం చేసే కార్యక్రమాలు చేపట్టబడినవి.

ఇక మన రాష్ట్రంలోని జలవిద్యుత్ప్రాజెక్టుల విషయం తెలుసుకుందాం.

మాచ్ ఖండ్ కేంద్రం

ఆంధ్రప్రదేశ్-ఒరిస్సా సరిహద్దులోని మాచ్ ఖండ్ నదీజలాలను వినియోగించడానికై మాచ్ ఖండ్ జలవిద్యుత్కేంద్రం 1955 ఆగస్టు మాసంలో ప్రారంభించబడింది. ఇది ఆంధ్రప్రదేశ్-ఒరిస్సా ప్రభుత్వాల ఉమ్మడిపథకం. ఉత్పత్తి అయ్యే విద్యుచ్ఛక్తి వినియోగంలో మన రాష్ట్రం వాటా 30 వంతులు. ఈ విద్యుత్ కేంద్రం విశాఖపట్టణానికి సుమారు 200 కిలోమీటర్ల దూరాన ఉన్నది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ వాటగా 80.3 మెగావాట్ల విద్యుచ్ఛక్తి మాచ్ ఖండ్ నుండి మనం పొందుచున్నాం. ఈ ప్రాజెక్టుపై సుమారు 23 కోట్ల రూపాయలు ఖర్చుచేయబడినవి.

తుంగభద్రా-హంపీ పథకం

మొదటి పంచవర్షప్రణాళికా కాలంలో ప్రారంభించిన మరొక ముఖ్యమైన పథకం - తుంగభద్రా జలవిద్యుత్ కేంద్రం. ఇది ఆంధ్రప్రదేశ్-మైసూరు రాష్ట్రాలు కలిసి ప్రారంభించిన పథకం. తుంగభద్రడామ్‌కు దిగువ 20 కిలో మీటర్ల దూరాన హంపివద్ద విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయబడుతున్నది. ప్రస్తుతం తుంగభద్రడామ్ హంపీకేంద్రాల నుండి మనరాష్ట్రానికి వాటగా 57.6 మెగావాట్ల విద్యుచ్ఛక్తి లభిస్తున్నది.

ఎగువ సీలేరు

ఇది జలవిద్యుత్ ప్రాజెక్టు. సీలేరు నది జలాలను ఉపయోగించి విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసే దృష్టితో విశాఖపట్నం జిల్లాలో చింతపల్లి తాలూకా గుంటువాడవద్ద సీలేరు నదిపై మళ్ళింపు ఆనకట్ట నిర్మించబడింది. చింతపల్లి నుండి 72 కిలోమీటర్ల దూరాన పవర్ హౌస్ నిర్మాణం జరిగింది. ఈ ప్రాజెక్టు నుండి మనకు లభించే విద్యుచ్ఛక్తి 120 మెగావాట్లు.

నిర్మాణంలో నున్న ప్రాజెక్టులు శ్రీశైలం

నిర్మాణంలోవున్న జలవిద్యుత్ ప్రాజెక్టులలో శ్రీశైలం చాలా ప్రధానమైనది. జలవిద్యుత్ కేంద్రాలన్నింటికీ కూడా శ్రీశైలం తలమానికం వంటిది. శ్రీశైలం మహాపుణ్యక్షేత్రం. ఈ క్షేత్రానికి ప్రతియుగములోను ఏదో ఒక ప్రాముఖ్యత ఉంటూవచ్చింది. శ్రీశైల మల్లికార్జునుడి ప్రాముఖ్యం ప్రాచీన కాలం నుంచి కూడా నాటికి నేటికి ఉన్నది. ఇక మున్ముందుకూడా ఉంటుంది. అయితే యీ



శ్రీశైలం ఆనకట్ట

నాడు ఆధునిక దేవాలయంగా అభివర్ణించబడే ఒక బ్రహ్మాండమైన జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించబడుతున్నందున దీని ప్రాముఖ్యం మరింత పెరిగింది. కృష్ణా నదిపై నిర్మించబడుతున్న యీ జల విద్యుత్ కేంద్రానికి 1963లో నవభారత నిర్మాత శ్రీ నెహ్రూగారు ప్రారంభోత్సవం చేశారు. ఒక వైపు దైవశక్తి, మరొకవైపు

ప్రాకృతిక శక్తి యీ రెండింటికి సమ్మేళనం కుదిర్చేటటువంటి యీ శ్రీశైలం మనందరికి ఎంతో పరమపవిత్రమైనది. శ్రీశైలం వద్ద ఒక్కొక్కటి 110 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనచేసే 4 యంత్రాలు మొదటి దశలో నిర్మించడానికి ఉద్దేశించబడినవి. ప్రస్తుత అంచనాల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ. 109 కోట్ల వరకు పెరగ వచ్చును. డామ్ ప్రక్కలందు పునాదివేయడం, మళ్ళింపు కాలువపని మళ్ళింపు సొరంగం, రెండు కాఫర్ డాముల నిర్మాణం, 7 నుండి 10 వ బ్లాకు వరకు డామ్ నుండి పునాదులు త్రవ్వడం వంటి పనులన్నీ పూర్తి అయ్యాయి. ఇక్కడ కృష్ణానదిపై వంతెన కూడా నిర్మించబడింది. 1972-73లో రూ. 1 కోట్ల 20 లక్షలు కేటాయించబడింది. అంతిమదశ పూర్తి అయిన తరువాత 770 మెగావాట్ల విద్యుచ్ఛక్తి శ్రీశైలంలో ఉత్పత్తి అగుతుంది. రాష్ట్రంలోని విద్యుత్ క్షామ నివారణకు యీ ప్రాజెక్టు యితోధికంగా తోడ్పడగలదు.

బలిమెల డామ్

ఆంధ్రప్రదేశ్-ఒరిస్సా రాష్ట్రాలు సంయుక్తంగా బలిమెల డామ్ పథకాన్ని అమలు జరుపుతున్నాయి. బలిమెల డామ్ వద్ద రిజర్వాయరులోకి వచ్చిన మొత్తం నీటిలో సగభాగం ఆంధ్రప్రదేశ్‌కు లభిస్తుంది. ఈ డామ్‌కు అయ్యే ఖర్చులో మన రాష్ట్రం వాటా రూ. 12 కోట్ల వరకు ఉంటుంది. ఇంతవరకు రూ. 10.36 కోట్లు చెల్లించబడింది. ప్రాజెక్టు పనులు బలిమెల సంయుక్త కంట్రోలు బోర్డు యాజమాన్యంతో జరుగుతున్నవి. డాము నిర్మాణం చాలా వరకు జరిగింది. నీరు నిల్వచేయడానికి ప్రస్తుతం వీలుకలుగుతుంది. నిర్మాణం పూర్తి అయిన తరువాత బలిమెలలో ఆంధ్రప్రదేశ్ పవరు హౌస్ నుండి మనకు 60 మెగావాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కాగలదని అంచనావేయబడినది.

దిగువ సీలేరు

ఎగువ సీలేరు 56 కిలోమీటర్ల దిగువన తూర్పు గోదావరి జిల్లాలో దిగువ సీలేరు విద్యుత్ పథకం నిర్మించబడుతున్నది. డొంకరాయివద్ద మళ్లింపు డామ్, మోతుగూడెం వద్ద పవర్ హౌస్ నిర్మించి ఎగువ సీలేరు నుండి వచ్చే నీటిని ఉపయోగించి విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసే ఉద్దేశంతో యీ ప్రాజెక్టు నిర్మించబడుతుంది. దీనిపై వ్యయం సుమారు రు. 50 కోట్ల వరకు ఉంటుంది. 1974వ సంవత్సరం నాటికి మొదటి యూనిటు పనిచేయడం ప్రారంభించవచ్చునని ఆశించబడుచున్నది. ప్రథమదశలో ఒక్కొక్కటి 100 మెగావాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేసే 4 యూనిట్లు నిర్మిస్తారు.

కొత్తపథకాలు

రాష్ట్రంలోని విద్యుచ్ఛక్తి స్థాపితంశక్తిని మరింత పెంపొందించుటకు ప్రస్తుతం నిర్మాణంలోనున్న ప్రాజెక్టులే గాకుండ 1972-73 సంవత్సరంలో రెండు క్రొత్త జలవిద్యుత్ పథకాల ప్రారంభానికి నిధులు కేటాయించారు.

నాగార్జునసాగర్ పంపు స్టోరేజి పథకం

నాల్గవ ప్రణాళిక కాలంలో తలపెట్టిన జలవిద్యుత్ ప్రాజెక్టులలో నాగార్జున సాగర్ పంపుస్టోరేజి పథకం ఒకటి. నాగార్జున సాగర్ వద్ద ఒక్కొక్కటి 50 మెగావాట్ల స్తోమత శక్తిగల రెండు జలఉత్పాదన యంత్రాలను నెలకొల్పడానికి యీ పథకం ఉద్దేశించబడింది. దీనిపై దాదాపు 10 కోట్ల రూపాయిలు వ్యయం జరుగునని అంచనా. నిర్మాణం తరువాత 100 మెగావాట్ల విద్యుచ్ఛక్తి మన రాష్ట్రానికి లభించగలదు.

ఎగువ సీలేరు రెండవ దశ

ప్రస్తుతం ఎగువ సీలేరు విద్యుత్ కేంద్రం వద్ద రెండు యూనిట్లు ఒక్కొక్కటి 60 మెగావాట్ల శక్తిగల వాటికి తోడుగా యీ రెండవదశ పథకం క్రింద 60 మెగావాట్ల సెట్టును ఒకదానిని నెలకొల్పడానికి సంకల్పించబడింది. ఈ అదనపు సెట్టును నెలకొల్పడానికి దాదాపు రు. 4.5 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా. ప్రణాళికా సంఘం ఆమోదం లభించవలసింది.

క్రొత్త ప్రాజెక్టుల పరిశీలన

మన రాష్ట్రంలోని నదీజలసంపద, జలపాతాల నీరును సక్రమంగా ఉపయోగిస్తే మరింత విద్యుతుత్పాదనకు అవకాశాలున్నవి. అయితే క్రొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి ముందు సమగ్రమైన సర్వే జగరాలి. అప్పుడే మనం ఎక్కడ ఏప్రాజెక్టును నిర్మించాల్సిందీ నిర్ణయించవచ్చును. అందుచేత రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు వారు జలవిద్యుత్తు ఉత్పాదనకు బాగా అనువైన గిట్టుబాటయిన ప్రదేశాలను ఎంపిక చేయడం కోసం జలవిద్యుత్తుకు అనుకూలంగావున్న పెక్కు ప్రదేశాలను పరిశీలనచేయించాలి. కొన్నిటికి ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేయబడ్డవి. మరికొన్నింటికి నివేదికలు తయారవుతున్నవి. పరిశీలనజరిగినప్రదేశాలలో యీ దిగువ నుదహరించినవి పేర్కొనదగినవి.

1. ఇచ్చంపల్లి జలవిద్యుత్ పథకం.
2. సింగారెడ్డి జలవిద్యుత్ పథకం.
3. ఎగువ కృష్ణా జలవిద్యుత్ పథకం.
4. కుంతల జలవిద్యుత్ పథకం.
5. కె. సి. కెనాలు జలవిద్యుత్ పథకం.
6. పోచంపాడు జలవిద్యుత్ పథకం.
7. పులిచింతల జలవిద్యుత్ పథకం.
8. ప్రాణహిత జలవిద్యుత్ పథకం.
9. సింగూరు జలవిద్యుత్ పథకం.

మన రాష్ట్రంలో అపారంగా లభించే నదీజల సంపదను సక్రమంగా వినియోగించి, నిర్మాణంలోనున్న ప్రాజెక్టులను వితకాలంలో పూర్తిచేసి, సర్వే రిపోర్టుల ప్రకారం క్రొత్త ప్రాజెక్టులను ప్రారంభించి వాటి నుండి ఉత్పత్తి అయ్యే కాంతిని ఇటు పారిశ్రామికాభివృద్ధికి, అటు గ్రామాలలో వ్యవసాయాభివృద్ధికి చవుకగా లభింపజేస్తే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథకంలో అగ్రస్థానం వహించగలదనుటలో అతిశయోక్తి లేదు. తద్వారా తెలుగుదేశం సస్యశ్యామలాం, సుభిక్షమవుతుంది.

చిత్తూరు జిల్లాలో దర్శనీయ స్థలాలు

టి. ఎన్. జయరామరెడ్డి

చిత్తూరు జిల్లాను సందర్శించాలన్న కుతూహలం యిప్పుడిప్పుడు దేశంలోని నలుమూలల ప్రజలకు కలుగుచున్నది. అందుకనే యిచ్చట యాత్రికుల సంఖ్య అనూహ్యంగా అధికమవుతూ వుంది. అందుకు కారణం ప్రపంచ ఖ్యాతి గాంచిన తిరుమల దేవుని సన్నిధి, శిల్పనిర్మాణ సౌందర్యంలో వన్నెకెక్కిన శ్రీకాళహస్తీశ్వరాలయము, మనోహర సుందర దృశ్యసీమలు గల హార్స్లీ కొండ, కాంబాకా అడవులు మొదలగునవి. అంతేగాక అనేక పుణ్యక్షేత్రాలతో, వినోద విజ్ఞాన కేంద్రాలతో, చిత్రవిచిత్ర కర్మాగారములతో విలసిల్లు ఈ జిల్లా సందర్శకులను ముగ్ధుల్ని చేస్తూంది. విభిన్న రంగాలలో వస్తున్న అభివృద్ధిని గాంచి అధ్యయనం చేయాలనే ఆసక్తితో వచ్చే విద్యార్థులకు కొన్ని ప్రదేశాలను చూడాలని వచ్చు విలాస యాత్రికులకు, పుణ్యక్షేత్రాలను తనివితీరా దర్శించే భక్తులకు ప్రత్యేక సదుపాయాలు అమర్చబడియుండుట విశేషము.

చిత్తూరు జిల్లా మదనపల్లె, వాయల్పాడు, పుంగనూరు, పలమనేరు, చంద్రగిరి శ్రీకాళహస్తి, పుత్తూరు, చిత్తూరు తాలూకాలతో 1911లో యేర్పడింది. 1960 లో సత్యవీడు తాలూకా రూపొందించబడింది. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా యిటీవలనే కుప్పం తాలూకా యేర్పడినది.

చిత్తూరు జిల్లాలోని దర్శనీయ స్థలాలను సందర్శించ వలయునన్న యాత్రికులు మదనపల్లె నుంచియైన లేక శ్రీకాళహస్తి నుంచైనా బయలుదేరవచ్చును. అదిగాక చిత్తూరు అయినా, తిరుపతి యైనా కేంద్రముగా పెట్టుకొని యాత్రా స్థలాలను చూడవచ్చును.

కొన్ని ముఖ్య స్థలాలు

సోంపల్లె గ్రామము మదనపల్లె తాలూకాలోని ములకల చెఱువుకు 6 కి. మీటర్ల దూరములో వుంది. మనోజ్ఞమైన శిల్ప కళతో విలసిల్లు శ్రీ చెన్నకేశ్వరస్వామి ఆలయం యాత్రికులకేగాక వాస్తు శాస్త్ర నిపుణులకు కూడ దర్శనీయమైన స్థలం. ఈ ఆలయంలో శిల్ప సౌందర్యం జగన్మోహనమై వెలుగొందుచున్నది. రాళ్ళ సౌందర్యానికి నిలయమైన ఈ ఆలయంలోని మండపాల మనోజ్ఞ శిల్పాలు పవిత్ర పురాతన వైభవాన్ని జ్ఞప్తికి తెస్తాయి. ఇచ్చటయున్న ధ్వజస్తంభం, బలిపీఠం విశిష్టమైన శిల్పసౌందర్యంతో విలసిల్లుచున్నవి. ఈ ఆలయపు మహా మంటపంలోని వర్ణచిత్రములు లేపాక్షిలోని కుడ్యచిత్రములకు యేమాత్రం తీసిపోవు.

హార్స్లీ కొండలు

రమణీయమైన ప్రకృతి దృశ్యాలతో అలరారుతున్న హార్స్లీ కొండలు మదనపల్లె నుంచి 24 కి. మీ. దూరంలో సముద్రమట్టానికి 4100 అడుగుల ఎత్తున వున్నవి. ఈ పరిసర ప్రాంతమంతయు కొండలు, కోనలు, లోయలు, వాగులు పచ్చిక

మైదానాలు సాక్షాత్కరించి కళ్ళను మిరుమిట్లు గొలిపే ఈ కొండలు చక్కని విలాస యాత్రిక కేంద్ర మనడంలో సందేహము లేదు.

సౌందర్యోపాసకులకు విశేషంగా ఆసక్తి కలిగించగల సహజ సంపదలతో విలసిల్లే ఈ వేసవి కేంద్రములో యాత్రికుల కనేక సౌకర్యములు గలవు. యాత్రికులు బసచేయడానికి సమాచార పౌరసంబంధశాఖ విశ్రాంతి గృహాలు, అటవీశాఖ వారి బంగళా, జిల్లా కోపరేటివ్ మార్కెటింగు సొసైటీ వారి విశ్రాంతి గృహం మొదలైనవి ఉన్నాయి. భోజన వసతులకు ప్రత్యేక ఏర్పాటు లున్నాయి. ఆంధ్రప్రదేశ్ గవర్నరుగారి వేసవి విడిది నిమిత్తం ఒక సమున్నత సౌధం కూడ యిచ్చట నిర్మించబడింది.

ఈ కొండలకు సమీపంలోనే ప్రకృతి రామణీయతకు ప్రబల నిదర్శనంగా నిలచి, క్రమశిక్షణకూ, ఉన్నత విద్యా ప్రమాణాలకూ ప్రసిద్ధిగాంచిన ఋషిలోయ పాఠశాల యాత్రికులు తప్పక చూడవలసిన గురుకులం.

శానిటోరియం

మదనపల్లెకు 8 కి. మీ. లో యుండు ఈ శానిటోరియం ప్రపంచ ఖ్యాతి గాంచినటువంటి వైద్యశాల. వేలాది క్షయ రోగ పీడితులకు పునర్జన్మ కల్పిస్తున్నది ఈ ఆరోగ్యవరం. ఈ ప్రజోపయోగకరమైన సంస్థ యాత్రికులు చూడదగినది.

శ్రీతలకోన క్షేత్రము.

పురాణ ప్రసిద్ధిచెందిన శివక్షేత్రములలో శ్రీతలకోన క్షేత్ర మొకటి. రవాణా సౌకర్యములు లేకుండుటచే శ్రీ కాళహస్తి, శ్రీశైలములవలె వెలుగులోకి రాక మరుగుననే యున్నది. ఈ క్షేత్రము మదనపల్లెనుండి తిరుపతికి పోవు మార్గమున బాకరా పేటనుండి 24 కి. మీ. లోను, నెరబైలుకు 10 కి. మీ. దూరము లోను యున్నది, శ్రీ శిద్ధేశ్వరుడనే నామధేయముతో పరమేశ్వరు డిచ్చట వెలసియున్నాడు.

అచ్చటనుండి 3. కి. మీ. దూరమున "శిరోద్రోణ తీర్థ" మను జలపాతము 200 అడుగుల ఎత్తునుండి దుముకుచూ, చూపరుల కత్యానందకరముగ నుండును. ఇచ్చట స్నాన మాచరించిన పాప పరిహార మగునని ప్రతీతి. వేసవికాలములో యిచ్చట చాల చల్లగ హాయిగ యుండుటయేగాక, చుట్టు కొండలు, కోనలు, చెట్లు మహదానందకరముగా యుండును. ఈ సుందర స్థలములో అటవీశాఖవారి విశ్రాంతి భవనము యాత్రికుల కెంతో సదుపాయము.

శ్రీ శిద్ధేశ్వర స్వామికి ప్రతి సంవత్సరము శివరాత్రి పర్వదినాన వేలాది భక్తులు వచ్చి వైభవముగా పూజలుచేసి తమ భక్తిని చాటుకొందురు.

కుప్పం

కుప్పం అనగానే 'కంగుంది కుప్ప' మా అని చాలమంది అడుగుదురు. కాని కంగుంది గ్రామము వేరే; కుప్పం వేరే. కుప్పం చిత్తూరునుంచి పలమనేరు మీదుగా 114 కి.మీ. దూరములో జిల్లాకు మాత్రమే సరిహద్దుగాక, రాష్ట్రమునకు కూడ సరిహద్దుగా యున్నది. కుప్పం మేజరు పంచాయతీ, సుమారు 12వేల జనాభాతో, అన్ని సౌకర్యములతో కూడుకొన్న చిన్న పట్టణము. ఎండాకాలము చాల చల్లగా, హాయిగా యుండుటచే 'బీదల పాలిట నీలగిరి' (Poor man's Ooty) అని ప్రతీతి. ఇచ్చటికి రైలు, రోడ్డు సౌకర్యము చాల అనుకూలముగా యుండి తూర్పున తమిళనాడు, పడమర మైసూరు రాష్ట్రము కలిగి అన్ని భాషల సంస్కృతులకు ఆలవాలమై యున్నది. కంగుంది గ్రామము కుప్పంనకు సుమారు 10 కి. మీ. దూరములో విజిలా పురమునకు పోవు మార్గమున యున్నది. కంగుంది రాజులకోట, కోట బురుజులు యీనాటికి ఆ రాజుల గొప్పతనమును చాటుచున్నవి. అచ్చట నొక శిధిలావస్థలో యున్న శివాలయము గలదు.

'గాజు నునుపుచేయు' పరిశ్రమలకు 'శ్రీగంధం నూనె' పరిశ్రమలకు కుప్పం రాష్ట్రములోనే గాక భారత దేశములోనే ప్రశస్తి. ఈ పరిశ్రమలవలన అద్దమువలె నునుపుచేయబడిన గాజు, సుగంధమైన శ్రీగంధం నూనె యితర దేశములకు యెగుమతి అయి, అందుమూలముగా లక్షలాది రూపాయలు భారతావనికి విదేశ మారక ద్రవ్యాన్ని ఆర్జించుట యెంతయో ముదావహము. ఈ పట్టణములో సుమారు 20 గాజు నునుపుచేయు పరిశ్రమలు స్థాపనయై వందలాది కార్మికులకు జీవన భృతిని కల్గించుట విశేషము. కఱకు రాతినుండి అద్దమువలె తయారుచేయు ఈవింత పరిశ్రమలు చూపరుల కెంతయో ఆశ్చర్యము కల్గించును. శ్రీగంధం నూనె పరిశ్రమలద్వారా వచ్చు సువాసన కల్గిన చమురును అనేక వైద్య సదుపాయములకు తదితర పరిమళ ద్రవ్యములకు వాడుదురు.

అంతేగాక 'కుప్పం క్విల్ట్' దేశమంతా పేరుగాంచిన పరుపులు. ఇచ్చట అనేక కుటుంబీకులు ఈ పరుపులను తయారు చేసి జీవించుచున్నారు. ఈ పరుపులను తయారుచేయుటకు కుప్పంలో ఒక సహకార సంస్థ కూడ కలదు. ఈవిధముగా ఈ చిన్ని పట్టణము దేశస్థులనేగాక, యితర దేశస్థులనుకూడ ఆకట్టుకొనుచున్నది. కుప్పం పుణ్యక్షేత్రం గాకపోయినా చిత్ర విచిత్ర వుపయోగకరమైన పెక్కు పరిశ్రమల నిలయమగుటచే యాత్రికులను విశేషంగా ఆకర్షించును.

శ్రీ మొగిలీశ్వర దేవాలయము

శ్రీ మొగిలీశ్వర దేవాలయం చాల పురాతన పుణ్యక్షేత్రము. చిత్తూరునుండి బెంగుళూరుకు పోవు మార్గములో 30 వ కి.మీ.లో యుండుటచే యాత్రికులు వచ్చి దర్శనము చేసికొని పోవుటకు చాల అనుకూలముగ యున్నది. యాత్రికులకు యిచ్చట ప్రకృతి సౌందర్యము, నంది నోటినుండి వచ్చే నిరంతర జలధార, అన్ని కాలములలోను ఒకే నీటిమట్టముతో యుండు కోనేరు అత్యాశ్చర్యము కల్గించును. బంగారు పాళెం జమీందారులు ఈ క్షేత్రమును కొంత పునరుద్ధరించారని చెబుతారు.

ప్రతియేటా శివరాత్రి కాలములో పదిదినములు వుత్సవములు కడు వేడుకగా జరుగును. అనేక భక్తాదులు వేలసంఖ్యలో యితర రాష్ట్రములనుండి కూడ వచ్చి భక్తి శ్రద్ధాంజలులు అర్పింతురు.

ఈ దేవస్థాన అధ్వార్యాన ఒక అథితి గృహము నిర్మింపబడి యున్నందువలనను, రాకపోకలకు బస్సు సౌకర్యములున్నందు వలనను యిచ్చిటికి విచ్చేయు యాత్రికులకు చాలా సౌకర్యముగా యున్నది.

చిత్తూరు

చిత్తూరులో శిల్పకళా నైపుణ్యాలు ప్రతిబింబించే దేవాలయాలు గాని, రమణీయ మనోజ్ఞ సుందర దృశ్యాలుగల కొండలు గావి, కోనలుగాని లేవు. అయినా యిటీవలనే పునరుద్ధరించబడిన శివాలయము చక్కని శిల్పములతో నుండుట గమనించదగినది. చిత్తూరులోయుండు చక్కరఫ్యాక్టరీ, న్యూట్రిన్ పిప్పరమెంట్ల పరిశ్రమ, ప్రభుత్వ పాల కేంద్రము, కోళ్ళఫారము మొదలగునవి యాత్రికులకు విజ్ఞాన వినోదములు కల్గించుటలో ఎలాంటి సందేహములేదు. ఈ పట్టణమునకు ఆగ్నేయ దిశలో సుమారు 2కి మీ. లో రిజర్వు ఫారెస్టులో వేసియుండు 'రౌండురోడ్డు'మంచి విహారస్థలము.

చంద్రగిరి


చారిత్రాత్మకమైన చంద్రగిరి తిరుపతికి 11 కి. మీ. దూరంలో చిత్తూరు-తిరుపతి రోడ్డులో యున్నది. శౌర్య పరాక్రమాలకు ధైర్యస్థైర్యాలకు ప్రసిద్ధి గాంచిన విజయనగర రాజులకు చాలా సంవత్సరాల పాటు నివాసమైన ఈ ప్రదేశములో చూపరులను సమ్మోహితులను చేసే, ఎన్నో చరిత్ర విశేషాలున్నాయి. అక్కడ ప్రాచీన శిలా నిర్మిత దుర్గం ఉన్నది. దిగువ 'కోట చుట్టూ నేటికీ చెక్కు చెదరకుండా అమూల్యమైన విజయనగర శిల్ప కళా నైపుణ్యాన్ని ప్రతిబింబింపజేసే శిలా నిర్మిత శిథిల దేవాలయాలున్నాయి. చంద్రగిరి కోట ప్రాకారంలో ప్రశాంత మనోజ్ఞ ప్రదేశంలో ప్రసిద్ధ శిల్పవరేణ్యుల అనల్ప శిల్ప కళానైపుణ్యాన్ని చాటే రాజమహలు రాణి మహలు విరాజిల్లుతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతిచెందిన విజయ నగర సామ్రాజ్యపుప్రాభవ వైభవాలను చాటే ఆ సమున్నత సౌధాలను తిలకిస్తే ఏదో అవ్యక్తమైన ఆవేశం, ఆవేదన అనుభూతి ఉత్కంఠ హృదయాలలో ఆక్రమిస్తుంది.

కనుల పండుగ జేసే ఈ కళాఖండము క్రీ॥శ॥ 1000 వ సంవత్సరలో శ్రీ ఇమ్మడి యాదవ నరసింహ రాయలు గారిచే నిర్మింపబడినది. చంద్రగిరి మహలు చంద్రగిరికి అతి సమీపము లోనే యుండి అనేక మంది యాత్రికుల నాకర్షించు చున్నది.

తిరుమల - తిరుపతి

శ్రీ వేంకటేశ్వరుని వైభవము వినని భారతీయుడుండడు. తిరుమల_తిరుపతి ప్రపంచయాత్రా కేంద్రములలో చాలా ప్రశస్తమైన పవిత్ర పుణ్యక్షేత్రములలో అతిప్రముఖ స్థానము గలిగిన క్షేత్రరాజము. శ్రీ వెంకటేశ్వర స్వామి పేరు స్మరిస్తే పాపాలు పటాపంచలవుతాయి తిరుమల క్షేత్రాన్ని సందర్శిస్తే కష్టాలు కరిగి పోతాయి. తిరుమల తిరుపతి భక్తుల పాలిట కల్పవృక్షము, కామధేనువు. బాలాజీ భక్త జన సులభుడు. ఏడుకొండల వేంకట రమణుడు కరుణా తరంగుడు. ఆపద మొక్కులవాడైన వడ్డీకాసులవాడు పిలిస్తే పలుకుతాడని ప్రతీతి. శ్రీమంతుడు, దయాసముద్రుడగు శ్రీ వేంకటాచలపతి ఆశ్రితులకు పారిజాతము వంటివాడు. ఏడు కొండలపై వెలసిన కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనార్థం వచ్చే యాత్రికులతో వెలుగొందుచున్న దివ్యస్థలం. ఈ జగద్విఖ్యాత దేవాలయం శిల్ప నిర్మాణ సౌందర్యముతో నయన పర్వమై సకల సంపదలతో తులతూగుచున్నది.

ఈ దేవాలయం ప్రక్కనే పెద్ద కోనేరు గలదు. శ్రీ వేంకటేశ్వరస్వామి, తన దేవేరులతో జలక్రీడలు సలిపే నిమిత్తం శ్రీ



తిరుపతి వేంకటేశ్వరస్వామి దేవాలయం

వైకుంఠం నుంచి గరుత్మంతునిచే ఈ సరస్సు తీసుక రాబడిందని చెబుతారు. ఈ సరోవరంలో స్నానమాడడం అవశ్య కర్తవ్యమని భక్తులు భావిస్తారు.

శ్రీ వరహ స్వామి గుడి సరోవరం దగ్గరలోనే యున్నది. శ్రీ వేంకటేశ్వరునికి ఆశ్రయ మిచ్చిన శ్రీ వరాహ స్వామిని ప్రథమంగా దర్శించాలని అందరి నమ్మిక.

తిరుమలలోనే 7, 8 కి. మీ. దూరములో పరమ పావనాలైన పాపనాశం, ఆకాశగంగ తీర్థాలున్నాయి. ఇచ్చట యాత్రికులు విశేషంగా స్నాన మాచరించెదరు. తిరుమలలో యుండు యింకా

ఎన్నో ధర్మ సత్రాలు, నయనానందకరమైన ప్రకృతి దృశ్యాలు చూడడానికి ఎంతో ముచ్చటగాను, ఆహ్లాదకరముగాను యుండును.

తిరుపతిలో యుండు శ్రీ గోవిందరాజస్వామి దేవాలయం వైష్ణవ మత వ్యవస్థాపనా చార్యులైన శ్రీ భగవద్రామానుజుల వారిచే ప్రతిష్ఠించబడినదని ప్రతీతి. భక్తి రసోద్బోధకమైన ఈ ఆలయంలో ప్రతి సం॥ము వైశాఖ మాసంలో బ్రహ్మోత్సవము వైభవముగా జరుగును

ఇచ్చట సర్వకాలములలోను ఎత్తైన పర్వతలోయనుండి ప్రవహించు జలపాతము యాత్రీకులకు ఎంతో సంతోషము కల్గించును. ఈ సుందర నయనానందకర ప్రదేశమునకు పోవుటకు చక్కని రోడ్డు సదుపాయము గలదు.

పురాణకాలములో శ్రీ శ్రీనివాసుడు, పద్మావతిని నారాయణ వనంలో కళ్యాణ మాడినపుడు పరమేశ్వరుడు తన అర్ధాంగి అయిన కామాక్షితో వివాహ మహోత్సవానికి విచ్చేసి, తరువాత ఈ కోనలో కొన్నాళ్ళు మకాముచేశాడని ప్రతీతి. ఇచ్చట పరమేశ్వరుని, కామాక్షిని విగ్రహాల రూపములో సందర్శించవచ్చును. ఇచ్చట జలపాతము సాక్షాత్తూ గంగాభవానియని పురాణ ప్రసిద్ధి. అచ్చట 40 రోజులు స్నాన మాచరించిన దీర్ఘ రోగములు నయితము నయమగునని భక్తుల నమ్మిక. అనేక రకముల వన వృక్షములచే ఈ ప్రదేశమంతయు చల్లగా. హాయిగా యుండును ఈ సుందర ప్రదేశము సినిమా అవుట్‌డోర్ షూటింగులకు చాల ప్రసిద్ధి ఇచ్చటికి వచ్చు యాత్రీకులకు ఒక సత్రమున్నది.

శ్రీ కైలాసనాథస్వామికి ప్రతి సంవత్సరము ఆషాఢ శుద్ధ పౌర్ణమిరోజున, కార్తీకమాసమున ప్రతి సోమవారమున, మహాశివరాత్రి సందర్భములోను వేలాది భక్తులు ఉత్సవమును తిలకించి పూజలు చేసికొని పోవుదురు.

నాగలాపురం

మహోన్నత గోపురాలతో, శిల్ప సంపదతో విలసిల్లుతూ అలనాటి కళాకారుల ప్రతిభను ప్రతిబింబించే పుణ్యక్షేత్రం నాగలాపురము. ఇచ్చట వేదవల్లీ సమేత శ్రీ వేదనారాయణస్వామి వెలసియున్నాడు. ఈ క్షేత్రం పుత్తూరు-మద్రాసు మార్గములో పుత్తూరు నుండి 30 కి మీ. లో కలదు. ప్రస్తుతము ఈ దేవాలయము తిరుమల-తిరుపతి దేవస్థానము వారి ఆధ్వర్యములో యుండి, దిన దినాభివృద్ధి గాంచుచు యాత్రీకులను విశేషంగా ఆకర్షించుచున్నది. పూర్వము శ్రీ కృష్ణదేవరాయలు ప్రధాన పోషకులుగా నుండిరని ప్రతీతి. ఇటీవలనే తిరుమల-తిరుపతి దేవస్థానమువారు యాత్రీకుల సౌకర్యార్థం తిరుమలనుంచి యిచ్చటికి బస్సు సౌకర్యములు కల్గించియున్నారు.

ప్రతి సం॥ము మార్చి మాసములో జరుగు సూర్యపూజ వుత్సవములు కడు ప్రశస్తమైనవి. ఆ పవిత్రమైన మూడు దినము పదు సూర్య రశ్మిచే శ్రీ వేదనారాయణుని శిరస్సు, నాభి పాద పద్మములు పూజింపబడుటయే ఈ వుత్సవముల ప్రత్యేకత.

తిరుపతిలోనే శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయం గలదు. శ్రీ స్వామి గొప్ప వరప్రసాది అని భక్తులంతా వేనోళ్ళ కొనియాడుతారు ఇచ్చటనే శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయము సకల కళాశాలలతో దిన దిన ప్రవర్ధమానమై యాత్రీకులకు ప్రముఖ దర్శనీయ స్థలమై వర్ధిల్లుచున్నది.

శ్రీ కపిలేశ్వర ఆలయం ఒక్కటే తిరుపతిలోని శివాలయం. దీనిని ఒక ప్రక్కన కపిల తీర్ధమనే జలపాతం వున్నది. ఇందు భక్తులందరు స్నాన మాచరించుట పుణ్యముగా భావింతురు. ఈ ఈ ఆలయం తిరుపతికి 3 కి. మీ. దూరములో తిరుపతినుంచి తిరుమలకు పోవు మార్గములో యుండుటవలన యాత్రీకులకు చాల సౌకర్యముగా యున్నది.

తిరుమల-తిరుపతి దేవస్థానమువారు యాత్రీకులకు సకల సదుపాయములు కడు భక్తి శ్రద్ధలతో కలిగించుట చాల ముదావహము.

తిరుచానూరు

శ్రీ వేంకటేశ్వరస్వామివారి అర్ధాంగి అయిన పద్మావతి దేవి తిరుచానూరు దేవళం ప్రక్కనవున్న సరోవరంలో ఒక తామర పుష్పముపై అవతరించారని ప్రసిద్ధి. ఈ దేవాలయం శిల్పకళా నిలయమై గోపురముతో యాత్రీకులను విశేషంగా ఆకర్షించును. తిరుమలకు వెళ్ళి శ్రీ వేంకటేశ్వరుని దర్శించిన భక్తులందరు పద్మావతీ దేవిని దర్శించిగాని వెళ్ళరు. ఇచ్చట కళ్యాణములు చేయుట యావత్ భారత దేశమంతయు పుణ్యమని భావించుటచే తిరుచానూరు నిత్య కళ్యాణము పచ్చతోరణముగా నుండుట యాత్రీకుల కాశ్చర్యము కల్గించును.

నారాయణ వనం

కంకణ చిహ్నితుడైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంతో అలరారుతున్న ఈ పవిత్ర ప్రదేశం, ఆకాశరాజు పుత్రికయైన పద్మావతీ-వేంకటేశ్వర పరిణయ మహోత్సవాన్ని తిలకించి పులకించిందనే పురాణగాథ యున్నది. ఈ దేవాలయం ఆకాశరాజు నిర్మించినట్లు ప్రతీతి. పుత్తూరునుంచి మద్రాసుకు పోవు మార్గములో 5 వ కి. మీ. లోనే యున్న ఈ నారాయణ వనం సొగసైన చేనేత వస్త్రముకు కూడ ప్రసిద్ధి.

కైలాసనాథస్వామి కోన

పుత్తూరు నుండి 11 కి.మీ దూరములో పుత్తూరు-మద్రాసు రోడ్డులో అరణం గోవిందప్ప నాయుడు కండ్రిగ అను గ్రామం వద్దనుంచి $1\frac{1}{2}$ కి మీ. దూరములో మిక్కిలి ప్రశాంతమైనచోట శ్రీ కైలాసనాథస్వామి కోనగలదు.

గుడిమల్లాం

గుడిమల్లాం శిలా శిల్ప సంపద ప్రశస్తపరచబడ్డ ప్రసిద్ధమైన శ్రీ పరశురామేశ్వరాలయంతో విరాజిల్లుతున్న ప్రదేశం. ఇచ్చటి శిల్ప చాతుర్యం చూపరులను ఆశ్చర్యములో ముంచును. ఈ పవిత్ర ప్రదేశమునకు రేణిగుంట నుంచి 8 కి.మీ. పాపానాయుడు పేటకు బస్సు ప్రయాణముచేసి అచ్చట నుంచి 3 కి మీ. నడిచిపోవలయును. అందుచే అట్టే యాత్రికుల నాకర్షించ లేకున్నది.

శ్రీవ్యాసాశ్రమము

శ్రీకాళహస్తి తాలూకాలోని ఈ ఆశ్రమము కొండలతో, ప్రకృతి రమణీయ దృశ్యములతో తిరుపతి, శ్రీకాళహస్తి మార్గములో ఏర్పేడుకు 1 కి. మీ. దూరములో కలదు. బస్సు, రైలు సదుపాయము గలదు. ఈ ఆశ్రమము మలయాళ స్వాములవారిచే 1926 సంవత్సరములో స్థాపించబడినది ఈ ప్రదేశమందు కాశీబుగ్గ తీర్థమను పవిత్రజలాశయము కలదు. అందు జలము సర్వకాలములయందును తగ్గక యాత్రికుల కాశ్చర్యము కల్గించును. ఈ తీర్థమునకు అనతి దూరములోనే శ్రీ మలయాళ స్వాములవారి కుటీరము నెలకొని యున్నది.

ప్రస్తుతము శ్రీ వ్యాసాశ్రమము శాంతినికేతనమువలె విద్యాపీఠమైయున్నది. సుమారు 500 మంది బాలబాలికలకు ప్రత్యేక వసతులతో సంస్కృతభాషా అధ్యయనమునకు ప్రాముఖ్యత యిస్తూ యితర అంశములు కూడ బోధించేయు ఉన్నతపాఠశాల గలదు. ప్రతి యేడాది వేలాది భక్తులు మాఘ మాసములో ఆశ్రమమున కరుదెంచి, శ్రీ స్వాములవారికి పూజచేసి, కానుకలర్పింతురు. వేదాంత విజ్ఞాని, శ్రీ విమలానంద స్వాములవారి అధ్వర్యమున ప్రస్తుత మీ ఆశ్రమము దినదిన ప్రవర్ధమానమగుచు యాత్రికులను విశేషముగా ఆకట్టుకొనుచున్నది.

శ్రీకాళహస్తి

కృతయుగములో సాలెపురుగు, సర్పము, ఏనుగు, శ్రీ కాళహస్తిలో అనేక సంవత్సరములు అచంచలమైన భక్తితో తపస్సుచేయగా ఆ ముగ్గురికి సర్వేశ్వరుడు సాక్షాత్కరించి సాయుజ్యం ప్రసాదించి వారికోర్కె ప్రకారం శిలామయ లింగాకారం చెందాడని స్థలపురాణం చెబుతున్నది. కనుకనే ఇక్కడి లింగానికి శ్రీ కాళహస్తీశ్వరుడనే నామం కల్గింది. ఈ ఆలయంలో ప్రజ్ఞాసంపద, హస్తనైపుణ్య విశేషం, ఆధ్యాత్మిక వికాసం వెనోళ్ళచాటే కళాఖండాలు సందర్శకులను సమ్మోహితులను చేస్తాయి. శ్రీ కంచికామకోటి పీఠాధిపతుల ప్రోత్సాహప్రోద్బలాలతో పునరుద్ధరించబడ్డ నటరాజ రంగస్థలం దివ్యశిల్ప ప్రాభవానికి, కళా కౌశలానికి తార్కాణం.

మహాశివరాత్రి పర్వదినాన నలుమూలల నుంచి వేలాది భక్తులు శ్రీ కాళహస్తీశ్వరుని జ్ఞాన ప్రసూనాంబను దర్శనం చేసుకొంటారు. సమస్త భక్తజన హృదయాలలో శాశ్వత స్థానాన్ని గడించగల్గిన ఈ దివ్యస్థలం తప్పక దర్శించ తగ్గది.

శ్రీ కాళహస్తీశ్వరాలయమేగాక, కన్నప్ప శిఖరము ప్రకృతి సంపదలతో నయనానందకరముగా యుండు లోయావి. దుర్గాంబ కొండ శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారి తిప్ప, వెయ్యిలింగాల కోన మొదలగునవి కూడ యాత్రికులచే యిచ్చట సందర్శించదగ్గ ప్రదేశాలు. కలంకారి శిల్పములో శిక్షణ ఇచ్చుచు పురాతన శిల్పసౌందర్యమును పునరుద్ధరణ గావించుటకు శ్రీ కాళహస్తిలోయున్న ప్రభుత్వశిక్షణ కేంద్రము ఎంతయో తోడ్పడుచున్నది. సౌందర్యోపాసకులైన యాత్రికులు ఎందరో కలంకారి వస్త్రములను కొనుగోలు చేయుచుందురు. శ్రీ కాళహస్తి కంచుపాత్రలు, దువ్వెనలు యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తాయి.

కాంబాక అడవులు

మనోహర సుందర దృశ్యములతో బాటు సెలయేళ్ళు గలిగినటువంటి ఈ సుందర వనములు శ్రీ కాళహస్తినుండి మద్రాసుపోవు మార్గములో వరదయ్యపాళెం నుంచి 8 కి.మీ. దూరములో యున్నవి. బస్సు రోడ్డు నుంచి 5 కి.మీ. పోయిన తర్వాత ఈ సుందర ప్రదేశము ప్రారంభమయి పోనుపోను నయనానందకరముగనుండి మనస్సున కాహ్లాదము కల్గించును. ఈ ప్రదేశమొక ప్రసిద్ధ విలాస యాత్రా కేంద్రమనుట అతిశయోక్తి కాదు. ఇచ్చట ఎన్నో తడవలు చలనచిత్ర నిర్మాతలు షూటింగులు తీసినారు. చుట్టుపట్లయుండే రకరకాల అడవి తీగలు, పుష్పములు మత్తెక్కించే సువాసనలు వెదజల్లును. ఆ సరస్సులను చూచినంతనే ప్రతిఒక్కరికి స్నానమాడ నభిలాష కలుగును. అచ్చటనుండి 3 కి.మీ దూరములో నొక జలపాతము గలదు. అచ్చటికి పోవలయునన్న రాళ్ళలో రప్పలలో బహు కష్టముతో నడిచిపోవలయును. ఇంకే మార్గము లేదు. ఆ కొండల పైన 6 కి.మీ. వెళ్ళినచో ఎప్పుడో నిర్మించిన అటవీశాఖ వారిబంగళా కలదు. అచ్చట దృశ్యములు చూడవలయునే గాని చెప్పనలవిగానటువంటి మనోహరమైనవి. ఆ బంగళానుంచి మద్రాసు 'లైట్ హౌస్'ను గమనించవచ్చును. రాత్రిలందు 'లైట్‌హౌస్' కాంతి కిరణములు ఈ బంగళాపై బడును. ఈ ప్రదేశము చిత్తూరు జిల్లాకే గాక రాష్ట్రమున కంతయు ప్రసిద్ధమైన విలాస యాత్రాస్థలముగా రూపొందదగినది. ప్రభుత్వమువారు కొన్ని కనీస సౌకర్యములు కల్పించిన ఎంతోమంది యాత్రికుల నాకర్షించుననుటలో ఎలాంటి సందేహము లేదు.

చిత్తూరు జిల్లాలో పర్యటన యాత్రికులకు నిజంగా ఒక అనుభూతి యనక తప్పదు.

కనీస సౌకర్యాలు కల్పించిన

కోపల్లె పంచాయతీ

— బి ఎస్. నాగ్

"కో" అని పిలిస్తే ఆ ఊరి గ్రామదేవత ప్రత్యక్షమై పలికేదట, ఆ కారణంగా ఆ గ్రామానికి "కోపల్లె" అని పేరు వచ్చిందని ఆ గ్రామ సర్పంచ్ శ్రీ దందులూరి బాపిరాజుగారు అన్నారు.

కోపల్లె పశ్చిమ గోదావరి జిల్లా యందు ఆకివీడు సమితిలో భీమవరం, జక్కరం రహదారిపై భీమవరం పట్టణానికి 5 మైళ్ళ దూరంలో ఉన్న కుగ్రామం ఈ గ్రామ జనాభా 2,953 మంది. గ్రామ విస్తీర్ణం 1669-74 ఎకరాలు. ఈ గ్రామంలో 127 పక్కా భవనాలు. 297 తాటాకు ఇళ్ళు, 98 పూరిళ్ళు, పెంకుటిళ్ళు ఉన్నాయి- ఈ గ్రామంలో మధ్యమ కుటుంబీకులు ఎక్కువ.

పంచాయతీ రాజ్యం అవతరణ కోపల్లె గ్రామ అభ్యుదయానికి నాందీ వచనం అయింది. కోపల్లె గ్రామం ఈ నాడు ప్రగతి పథంలో పయనిస్తూ పశ్చిమ గోదావరి జిల్లాలో యితర గ్రామాలకు మార్గదర్శకమయిందంటే అతిశయోక్తి లేదు. కోపల్లె గ్రామం చరిత్ర ఆ గ్రామ ప్రజలు గర్వించదగింది. ఒకనాడు స్వాతంత్ర్యోద్యమంలో అసమాన ధైర్యసాహసాలతో భీమవరం తాలూకా ప్రజలకు తిరుగులేని నాయకునిగా పేరొందిన శ్రీ దంతులూరి నారాయణరాజు గారు ఈ గ్రామ నివాసి-గ్రంథాలయ ఉద్యమంలో ఆదర్శవంతమైన పాత్రవహించి ఊరూరా గ్రంథాలయ ఉద్యమాన్ని వ్యాపింపజేసి విజ్ఞానరేఖలు వెదజల్లిన తేజోమయమూర్తి శ్రీ కాళ్ళకూరి నరసింహం ఈ గ్రామనివాసి. ఎంతో పాత చరిత్ర ఉందని కోపల్లె గ్రామ ప్రజలు సగర్వంగా చెప్పుకోవచ్చును. వెల్లి విరిసిన చైతన్యానికి ప్రతిరూపమే కోపల్లె గ్రామం—అయితే పాత చరిత్రను చూసి మురిసిపోతూ పాత స్మృతులతో కాలం గడపడంలేదు. ఈ గ్రామ ప్రజలు, పాత చరిత్ర పునాదులపై కొత్త చరిత్రను సృష్టించుకొనటానికి కృషి చేస్తున్నారు.

గ్రామీణ భారతావనిని తేజోమయం చేయటానికి కృషి చేస్తున్న చైతన్యవంతమైన నాయకులను నిస్వార్థ పరాయణులను కలుసుకోవాలంటే ఈ గ్రామం సందర్శించి, గ్రామపంచాయతి సభ్యులను, సర్పంచ్ శ్రీ బాపిరాజుగారిని కలుసుకోండి చాలు. మీకే అర్థమౌతుంది. వారెంత నిస్వార్థపరులో ప్రజాసేవకులో అర్థమవుతుంది.

త్యాగాలకు మారుపేరుగా పేరొందిన శ్రీ దంతులూరి నారాయణరాజుగారి కుటుంబంలో పుట్టిన శ్రీదంతులూరి బాపిరాజుగారు కోపల్లె గ్రామ పంచాయతీ ద్వారా అభ్యుదయ కార్యక్రమాల నిర్వహణకు నడుం కట్టి పనిచేస్తూ గ్రామప్రజల ప్రేమాభిమానాలకు పాత్రులయ్యారు.

కోపల్లె గ్రామపంచాయతీ 1925వ సంవత్సరంలో ఏర్పడింది. ఈ గ్రామం ప్రజావిరాళాలకు పెట్టింది పేరు. ప్రభుత్వం అమలు పరచే ఏ కార్యక్రమానికైనా గ్రామప్రజలు ముందుకు వచ్చి తమ సహకారాన్ని విరాళాలు, శ్రమదానం రూపంలో అందజేయటం ఆ గ్రామ ప్రజల చైతన్యానికి చిహ్నం.

వ్యవసాయ రంగం

వ్యవసాయ రంగంలో కోపల్లె గ్రామ ప్రజలు సాధించిన అభివృద్ధిని వివరిస్తారా అని గ్రామస్థాయి కార్యకర్త శ్రీ సయ్యెపు రాజు వెంకటక్రిష్ణంరాజుగారిని అడిగినపుడు వరిలా అన్నారు. "ఈ గ్రామం ఆయకట్టులో నాల్గింట మూడువంతులు వరకు అధిక దిగుబడినిచ్చే మేలురకం వంగడాలు వేసి పండిస్తున్నారు. ఈ గ్రామ రైతులు. శ్రీ దంతులూరి ప్రకాశంగారి పొలంలో ఐ. ఆర్. 8 వరిని వేసి ఎకరానికి 38 బస్తాలు పండించారు. శ్రీ ముంజేటి వెంకట్రామయ్య, డి. సత్యనారాయణగార్లు మషూర్ రకం వరిని వేసి 30 బస్తాల ధాన్యం దిగుబడినీ సాధించారు. తైచుంగ్ నేటివ్ — 1 లాంటి వరి వంగడాలు భీమవరం తాలూకాలో ప్రప్రథమంగా వేసి పండించిన ఘనత ఈ గ్రామ రైతులకే దక్కింది. మూడు పంటల పథకాన్ని అమలుపరచి ఆకివీడు సమితిలో ఉత్తమ గ్రామంగా పేరెన్నిక గన్నది, కోపల్లె గ్రామం. ఈ గ్రామంలో రైతులకు ఐదు ట్రాక్టర్లు, అయిదు ఆయిల్ యింజనులు, 40 స్ప్రేయర్లు ఉన్నాయి.

గ్రామీణ బ్యాంకు

కోపల్లె గ్రామ రైతాంగంకు పరపతి సౌకర్యం కల్పించటానికి గాక ఇతర గ్రామ రైతాంగానికి కూడా ఈ గ్రామంలోవున్న గ్రామీణ బ్యాంకు పనిజేస్తున్నది. ఈ గ్రామీణ బ్యాంకు 2494 మంది సభ్యులతో 1,67,926 రూపాయల వాటా ధనంతో పనిజేస్తున్నది. ఈ బ్యాంకులో 1,82,412 రూపాయలు నిధులున్నాయి. 1970–71 సంవత్సరంలో రైతులకు 4,51,015 రూపాయలు వివిధరకాలైన అప్పులను అందజేసింది. ఈ గ్రామీణ బ్యాంకు, ఈ బ్యాంకు 1,26,746 రూపాయలు విలువజేసే ఎరువులు, 6,288 రూపాయలు విలువజేసే పురుగు నివారణ మందులను రైతులకు అమ్మింది. రైతుల పరపతి అవసరాలను చక్కగా ఈ గ్రామీణ బ్యాంకు తీర్చిందనే చెప్పాలి. మొట్టమొదట ఈ గ్రామీణ బ్యాంకుకు అధ్యక్షులుగా శ్రీ దంతులూరి బాపిరాజుగారు ఉండేవారు. గ్రామీణ బ్యాంకు శాశ్వత భవనాన్ని నిర్మించుకొంది.

పశుపోషణ

వ్యవసాయ రంగంలో గణనీయంగా కృషిచేసిన ఈ గ్రామ పంచాయతీ పశుపోషణ విషయంలోకూడా కృషిచేస్తున్నది. "పశువుల ఆసుపత్రి నెలకొల్పుకోండి" అనే పథకంక్రింద పశువుల ఆసుపత్రి నిర్మాణానికి గాను శ్రీ బాపిరాజుగారు పూనుకొన్నారు. ఆ గ్రామస్తులు శ్రీమతి మంతెన సీతాయమ్మగారు ముందుకు వచ్చి 25,000 విరాళం యిస్తే, గ్రామప్రజలు పశువుల ఆసుపత్రి శాశ్వత భవన నిర్మాణానికి 10 వేల రూపాయలు విరాళం యిస్తున్నారు. ఆసుపత్రి మందులకుగాను, కోపల్లె, వేరపాడు, జక్కారం, బొండాడ మొదలైన పొరుగు పంచాయతీలు సాలీనా 1500 రూపాయలు యివ్వడానికి ముందుకు వచ్చాయి.

కోపల్లె గ్రామ పంచాయతీ 9,655 రూపాయల ఖర్చుతో సర్వాంగ సుందరమైన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని నిర్మాణం చేసింది.

రక్షిత మంచినీటి సౌకర్యం

కోపల్లె గ్రామ పంచాయతీ నిర్వహించిన మరొక చైతన్యవంతమైన కార్యక్రమం—పరిరక్షిత మంచినీటి పథకం నిర్మాణం—ఎనభై వేల రూపాయలు ఖర్చుచేసి పరిరక్షిత మంచినీటి పథకాన్ని కోపల్లె పంచాయతీ నిర్మించింది. పథకనిర్వహణఖర్చులో నాల్గోవంతు గ్రామపంచాయతీ భరించింది. గ్రామంలో ప్రజలకు ప్రత్యేకంగా కుళాయిలు కూడా వేసింది. ప్రైవేటుగా ప్రజలు 53 కుళాయిలు వేయించుకున్నారు. ఒక్కొక్కరినుంచి ఒక్కొక్క కుళాయికి 300 రూపాయలు విరాళం పోగుచేయటం జరిగింది. నెలకు నాలుగు రూపాయల నీటి పన్నును పంచాయతీ వసూలు చేస్తున్నదని పంచాయతీ విస్తరణాధికారి శ్రీ మండ వెంకటరెడ్డిగారన్నారు.

కొబ్బరి మొక్కలు

ప్రజా విరాళాలపై ఆధారపడకుండా, ప్రభుత్వ గ్రాంటులకు ఎదురుచూడకుండా ఉండేందుకు ఆదాయ వనరులన్నీ సృష్టించుకొనాలని, "స్వయం చలన సంస్థ"గా రూపొందించుకొనాలని పంచాయతీ నిర్ణయించుకొంది. 1959–60 సంవత్సరంలో ఈ గ్రామ పంచాయతీ ఆదాయం 1247 రూపాయలు ఉండేవి. కాని సర్పంచ్ తీసుకున్న చొరవవల్ల ఈ గ్రామంలో పన్నులు హెచ్చింపు రెండు సార్లు జరిగింది. ఈనాడు ఈ గ్రామ పంచాయతీ ఆదాయం పన్నుల రూపంలో 4596 రూపాయలు. 132 కొబ్బరి మొక్కలు నాటించి ఆదాయాన్ని పెంపొందించారు. కొబ్బరి మొక్కలు ఫలసాయంవల్ల 1969–70 సంవత్సరంలో 2042 రూపాయలు ఆదాయం లభించింది.

కోపల్లె గ్రామ పంచాయతీ 1964–65 సంవత్సరంనుంచి 48,488 రూపాయలు ఖర్చుచేసి రోడ్లు వేయటం, నిర్వహించటం జరిగింది అని సర్పంచ్ శ్రీ బాపిరాజుగారన్నారు.

"కోపల్లె" పశ్చిమ గోదావరి జిల్లాలో పారిశుద్ధ్యం కోసం పాకీ పనివారిని నియమించి నియమిస్తున్న ప్రప్రథమ మైనర్ పంచాయతీ.

ప్రజల విరాళం ఎక్కువ

ఈ గ్రామం సందర్శించిన తర్వాత పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్తు కార్యదర్శి శ్రీ కళా వెంకటావుగారిని కలుసుకొన్నప్పుడు కోపల్లె గ్రామ పంచాయతీ ప్రత్యేకత ఏమిటని ప్రశ్నించినప్పుడు "ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయంకంటే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఇచ్చిన విరాళాలు ఎక్కువ. అదే కోపల్లె గ్రామ పంచాయతీ ప్రత్యేకత" అని అన్నారు.

ముక్తకాలు

మంచి కవిత

మంచికవిత వినిన మల్లెలు పూచిన
ట్లుండు మనసునందు, నిండుదనము
కలిగినట్లు తోచు తలపులకు, మధువు
కు సినట్లు తోచు పరిసరములు.

దేశభక్తి

మధువు వలదు నాకు, మధురోక్తి చాలును
కలిమి వలదు నాకు బలము చాలు
పదవి వలదు నాకు బ్రతుకుతెరువు చాలు
ముక్తి వలదు దేశ భక్తి చాలు.

కుటుంబ ఆస్తి

'ఆస్తి ఎంతయున్న ?' దని యడుగు నొకడు
చెప్పె : 'గృహిణియా సుశీల, పిల్ల
లా మణులు, జనకుడు ప్రేమమూర్తి, కలదు
బలము నాకు, ఆస్తి కలదె వేరు !'

ఉన్నఊరు

పల్లెటూరివాడు పట్టణమును చూచి
నోరు తెరచు, పల్లెటూరి శోభ
కు ముదితుడగు పట్టణమువాడు ; ఎందుకో
ఉన్న ఊరి మీద చిన్న చూపు

నవత

ఉన్నదాని మీద చిన్న చూపును, లేని
దాని మీద లేనిపోని మమత
కలిగియుంట వెర్రి గావచ్చు ; కాని మా
నవుడు కోరుచుండు నవత నెపుడు.

ఇంటా-బయటా

బయట నవ్వుమొగము, పరులతో మాటాడు
తేనె లొలుకు నట్లు ; కాని యేమి
చిత్రమో తెలియదు, చిందులు త్రొక్కును
భార్య యతని కంటబడిన యంత

కొద్ది తేడా

రాజకీయవాది రాబోవు ఎన్నిక
లను గురించియే తలంచుచుండు ;
రాజనీతివేత్త రాబోవుతరమును
గూర్చి సతము తలచుకొనుచు నుండు.

ప్రకృతి ధర్మము

పుట్టిన ప్రతి వ్యక్తి గిట్టక తప్పదు
పువ్వు వాడినట్లు, ప్రొద్దు వ్రాలి
నట్లు: కాని మృత్యు వనిన చాల భయము.
ప్రకృతి ధర్మ మకట భయము గొలుపు.

చల్లా రాధాకృష్ణ శర్మ

సిఫారసు

చదువు కొన్ననేమి, చాకచక్యం బున్న
నేమి, తెలివి యున్న నేమి, నిష్ఫ
లమ్ము లివ్వి: పైకి లాగగల ప్రముఖు
లెవ్వరైన నూత నీయకున్న.

పేదరికము

పేదరికమ! నిన్ను చీదరించుకొనుట
పాడి యగునె, నీదు బంధు జనులు
పండితులును పేదవారు: వారిని గాక
యిపుడు పరుల నాశ్రయింతు వెట్లు ?

వర్ణవివక్ష

నల్లతోలు వాని తెల్లయొడలివాడు
వెక్కిరించి నవ్వె వెకిలి నవ్వు:
మేని రంగు చూచి మేలమాడెడు వాడు
వింత మనిషి గాక విబుధు డగునె?

చక్కదనము

పట్టు చీర కాదు కట్టుము నైలాను,
వేసికొనుము వింత వింత నగలు;
సొమ్ము ఖర్చు తప్ప సొగసెట్లు వచ్చును?
జన్మ తోడ పుట్టు చక్కదనము.

నాగరికత

'పల్లెటూరిదాన! పట్టణ మెట్లున్న'
దనుచు బావ యడుగ, ఆ మరదలు
పిల తాను కొన్న తెల్లని ప్లాస్టికు
పువ్వు వంక చూచి నవ్వసాగె.

"ఫారిన్ రిటర్న్డ్"

అమెరికా వెడలి అఆలు బోధించిన
చాలు కీర్తి ధనము చాల గలుగు;
ఉన్న ఊరు వదలకున్న యశము సున్న
చాల చిత్రము గద కాల మహిమ!

మంచి మనసు

చదువు లేదు అ దచందములా సున్న,
కట్నమా హుళక్కి, కన్య నెట్లు
వలచితి వని తల్లి పలుక కొడుకు చెప్పె,
'మంచి మనసు విలువ నెంచదరమె?

చూపు తూపులు

పెండ్లి వలదటంచు భీష్మించుకొన్న నీ
విపుడు మార్చుకొంటి వేమి మనసు?
ఆమె బదులిడె: 'మలినాత్ములౌ మగవారి
చూపు తూపుల నిక సైపలేను'

వంకలు

కార మెక్కువయ్యె కూరలోన ననుచు
కూర విడిచిపెట్టి, క్రొత్త ఆవ
కాయ తనివితీర కలుపుకొనె నొకడు
ఇష్టమున్న వంక లేల పెట్టు?

ఎండల మల్లిఖార్జునుడు

(పుణ్యక్షేత్రం)

దేశంలో ప్రతీదేవుడికి దేవాలయం ఉంటుంది సాధారణంగా. కాని శ్రీకాకుళం జిల్లాలోని, టెక్కలిగ్రామానికి రెండు మైళ్ల దూరంలో గల "మల్లిఖార్జున స్వామికి" దేవాలయం లేదు. ఎండలకుఎండి వానలకు తడిసిన దేవుడు కనుకనే ఎండలమల్లిఖార్జునుడని పిలువ బడుచున్నాడు. భూమట్టమునుండి లింగము ఎత్తు సుమారు 18 అడుగులు ఉండి చుట్టుకొలత సుమారు 32 అడుగులు ఉండును.

పురాణగాథ:- స్కాంద పురాణాంతర్గత మల్లిఖార్జున మహాత్మ్యం పాండవులకు మార్కండేయ మహర్షి చెప్పినట్లుగా ఉంది.

రావణుని చంపిన రాముడు, అయోధ్యకు తిరిగి వస్తూ శ్రీ పర్వత శిఖరమందు, ఆగి విశ్రాంతి తీసుకొని, మార్కండేయా శ్రమము దగ్గర ఉన్న పవిత్రతీర్థంలో భక్తితో స్నానం చేశాడు. తర్వాత ఆంజనేయునిపిలిచి "ఆంజనేయా నాభక్తులలో శ్రేష్ఠుడైన సుశేణుని ఈ పర్వతమందు నివసించ వద్దని చెప్పు" అని ఆజ్ఞాపించాడు. ఆమాట విన్న సుశేణుడు దుఃఖించి విరక్తితో "సుమంచ" పర్వతం చేరి, అక్కడ ప్రాణత్యాగం చేశాడు.

అప్పుడు సుశేణుని జాడకోసం ఆంజనేయునిపంపగా, ఆంజనేయుడు సుశేణుని మృత దేహం చూచి చింతించాడు. తర్వాత ఆ దుఃఖతో, కోపంతో కొండ శిఖరాన్ని కాలితో తన్నగా ఒకగోయి ఏర్పడినది. ఆగోతిలో సుశేణుని మృతదేహాన్ని ఉంచి, మృగచర్మం కప్పి భక్త్యంజలిఘటించి శ్రీరామునకావార్త చెప్పాడు.

రామలక్ష్మణులు గూడ సుశేణుని మృత శరీరాన్ని చూడాలని ఆగోయిచూడగా, అందులో మృత శరీరానికి బదులుగా మృగచర్మం మీద మల్లెపూలతో కప్పబడిన మరకత వర్ణము కలిగిన ఒకలింగము కనబడెను. ఆ లింగమునే "మల్లిఖార్జును"డని రాముడు భక్తితో పూజించెను.

సి. ఇందిరాదేవి

ఈ సుమంచ పర్వతమందు శ్రీరామ ధరేఖలు సీతాదేవిపాద న్యాసములు గూడా కనబడెను. తరువాత యుగమందు అర్జునుడు ఆరాధించగా ఈశ్వరుడు ప్రత్యక్షమైనాడు.

స్వామీ నీపేరు చివరను నాపేరుకూడ ఉండునట్లు వరమివ్వమనగా ఈశ్వరుడు అంగీకరించెను. అప్పటినుండే మల్లిఖార్జునుడని పేరువచ్చినది.

చారిత్రాత్మక ప్రాధాన్యం:- కొన్నివందల ఏండ్లక్రిందట టెక్కలి మహారాజు, శ్రీమల్లిఖార్జున దేవాలయం కట్టించాలని వుద్దేశంతో ఉండగా స్వామి వారు రాజు కలలో కనిపించి, తాను మండుటెండలోనే ఉండెదనని, ఆలయనిర్మాణం చేయవద్దని కోరెను అందువలన ఇప్పటికి ఆదేవుడు "ఎండల మల్లిఖార్జునుడి" గా పిలువ బడుచున్నాడు. గొప్పయాత్ర కార్తీక మాసమంతా జరుగును.

మహాభారతము

తొంపుగంటుల లక్ష్మణశాస్త్రి

65

పాండవులు వనములో పడుచున్న అగచాట్లను విని ధృతరాష్ట్రుడు మిక్కిలి దుఃఖితుడై నిట్టూర్చుచు పాండవులకు గలిగిన యీ కష్టపుపాట్లన్నియు తన మూలముగానే కదా జరిగినవని యిట్లు చింతించెను:—

"సత్య వ్రతముగల నా జ్యేష్ఠ పుత్రుడు యుధిష్ఠిరుడు అజాతశత్రువు. అతడు దూది పరుపుల మీద శయనించువాడిప్పుడు పాషాణ ప్రదేశాలలో పండుకొనుచు, వందిమాగధులచేత మేల్కొలుపబడువాడు పక్షుల కలకలములచే మేల్కొను దుస్థితికి పాల్పడెను కదా! మహా కోపిష్ఠుడైన భీముడు ఎండకు వానకు బాధ పడుచు ద్రౌపదితో భూతలము పైన ఏ విధముగా శయనించుచున్నాడో కదా! సుకుమారుడు, బుద్ధి శాలి, ధర్మజుని ఆజ్ఞాను వర్తియు నగు అర్జునుడు అవమానమును ఓర్చుకొని కుటీరములలో నెట్లు కాలము గడుపు చున్నాడో కదా! అతని పరాక్రమము అతి భయంకరమైనది. ఇట్లున్న అన్నదమ్ములను, భార్యను చూచుచు బుస కొట్టుచున్న సర్పమువలె కోపమును అణచుకొని యుండును కదా! ఈ విధముగానే నకుల-సహదేవులు అతి సుకుమార శరీరులు. వారు ధర్మమునకు సత్యమునకు కట్టుబడి యెన్ని యిడుముల బడుచుండిరో కదా! ధర్మపాశ బద్ధుడై భీముడు నా కొడుకుల వినాశమును కాంక్షించుచు కాలమును ఎదిరించుచు నుండి యుండును. అజాతశత్రువైన ధర్మరాజు కపట ద్యూతములో జయింపబడి నప్పుడు దుశ్శాసనుడు దుర్భాషలచే అతనిని నిందించెను. ఆ మాటలను తలచుకొనుచున్న భీముని హృదయము, శరీరము ఇప్పుడు అగ్నితగిలిన గడ్డివామువలె దహింపబడుచుండును గదా! నా అపరాధమును యుధిష్ఠిరుడు, అర్జునుడు తలంచరు కాని, భీముని కోపాగ్ని అరణ్యవాసమనెడి వాయువు చేత ప్రేరితమై యిప్పుడు మండుచుండును గదా! అతడు కోపముచేత దహింపబడుచు చేతులు పిసికికొనుచు, పిడికిళ్ళు బిగించుచు వేడినిట్టూర్పులు విడుచుచు నా పుత్రపౌత్రులను తన కోపాగ్ని చేత దహింపజూచుచుండును గదా! భీమార్జునులు యుద్ధములో శత్రుసేనలను నిశ్శేషముగా తుడిచివేయగలరు. దుర్యోధన-మందబుద్ధి దుశ్శాసన-శకుని-కర్ణాదులు కపటపు జూదము వలన లభించిన రాజ్యమును పై పై తేనెనువలె రుచిచూచి సంతోషించిరే కాని ఆపైన రాబోవు వినాశమును అప్పుడు వూహించలేదు. లోకములో మానవులు శుభాశుభ కర్మలు చేసి తత్ఫలమునకు పాల్పడెదరు. ఇట్టివారికి మోక్షఫలమెట్లు లభించును. పొలమును దున్ని, విత్తనములను నాటి, సకాలములో వాన కురిసినప్పటికి కూడ ఆ పొలము పండనిచో అప్పుడు దైవానుకూలము లేదు అని తలచవలసినదేకదా! ద్యూతమునందు కపటప్రవృత్తిగల శకునిచేత, సాధువుల వృత్తిగల యుధిష్ఠిరుని చేత, దుష్టపుత్రుల వశములో చిక్కిన నాచేత ఈ కురువంశమునకు అంత్యకాలము మూడినది.

"ప్రేరణ లేకయే వాయువు వీచును; గర్భిణియైన స్త్రీ తప్పక శిశువును కనును. పగలు ప్రారంభించగనే రాత్రి నశించును. రాత్రి యారంభమునందు పగలు నశించును. ఇట్టి విశ్వాసము కలిగిన యేవ్యక్తి గూడ లోభమునకు వశుడై అకార్యమును ఏల చేయవలెను? ఆర్జించిన ధనమును మనుష్యుడు ఎందుకు దానము చేయడు? ధనము ఉపయోగించవలసినప్పుడు దానిని సదుపయోగ పరచినచో అది అనర్థములకు కారణమగును. కనుక ధనమును సదుపయోగము చేయుట బుద్ధిమంతుని లక్షణము. సదుపయోగ పరచబడని ధనము పచ్చి కుండలోని నీరువలె లోపలనే యింకిపోవును. ప్రపంచములో కర్మఫలమునకు నాశమేర్పడదు. అడవిలోనుండియే అర్జునుడు స్వర్గమునకు పోయి చతుర్విధాస్త్రములను సంపాదించుకొని యీ లోకమునకు తిరిగి వచ్చెను. స్వర్గలోకమునకు సశరీరముగా పోయి తిరిగి యీ లోకమునకు వచ్చుటకు కోరు మనుష్యుడెవడున్నాడు? మృత్యుముఖమును సమీపించుచున్న కౌరవులను చూచి తిరిగి అతడీలోకమునకు వచ్చియుండును. ధనుర్ధారి మహావీరుడగు నర్జునుడు; ధనుస్సో గాండీవము. అది మహాభయంకర వేగము గలది. అస్త్రములో దివ్యములు. ఇట్టి యామూడు తేజస్సులను సహించగల వ్యక్తి ఇక్కడ ఎవడున్నాడు?

ఏకాంతములో ఈ విధముగా ధృతరాష్ట్రుడు అనుచున్న మాటలను విని శకుని, కర్ణదుర్యోధనుల వద్దకు పోయి యథాతథముగా ఆ మాటలన్నియు పూసగ్రుచ్చినట్లు చెప్పెను. అది విని మందమతియైన దుర్యోధనుడు అసంతుష్టుడై చింతింపసాగెను.

కర్ణ శకునుల దుర్బోధ :

కర్ణశకునులు ధృతరాష్ట్రుని మాటలు దుర్యోధనునికి చెప్పి "ఓయీ! నీవు వీరులైన పాండవులను నీ పరాక్రమముతో అడవికి పంపి ఈ సమస్త భూమండలమును ఇంద్రునివలె ఒక్కడవే పాలించుము. సముద్రముద్రిత స్థావర జంగమాత్మకమైన ఈ భూమండలమంతయు నీ వశమై యున్నది. పూర్వ దక్షిణ పశ్చిమోత్తర వాసులైన రాజులందరు నీకు అణగి కప్పము కట్టుచున్నారు. పూర్వము దేదీప్యమానమై పాండవులను సేవించిన రాజ్యలక్ష్మి ఇప్పుడు నీకు నీతమ్ములకు లభించియున్నది. అప్పుడు ఇంద్రప్రస్థములో నుండిన రాజ్యలక్ష్మిని ఇప్పుడు నీ వద్ద చూచుచున్నాము. నీ శత్రువులందరు శోకముచేత దీనులై దుర్బలులై ఉన్నారు. నీ బుద్ధి బలముతో ఈ రాజ్యలక్ష్మిని ధర్మరాజు నుండి లాగుకొనినావు. ఇప్పుడు నీ వద్దనే ఆమె ప్రకాశించుచున్నది. రాజులందరు నీ ఆజ్ఞావహులై యున్నారు. నీవు ఈ సమస్త భూమండలమును భరించుచు బ్రాహ్మణులచేత, రాజుల చేత పూజింపబడుచు నీ పౌరుషము వలన దేవతలలో సూర్యునివలె ప్రకాశించుచున్నావు.

రుద్రులలో యమునివలె, నక్షత్రములలో చంద్రునివలె కౌరవులతో నీవు సేవింపబడుచు శోభిల్లుచున్నావు. నీ ఆజ్ఞను ఆదరించక, నీ ఏలుబడిలో నుండుటకు ఇష్టపడక ఉండిన పాండవులకు కలిగిన దుర్దశను ప్రత్యక్షముగా చూచుచున్నాము. రాజ్యలక్ష్మిని పోగొట్టుకొని వారు వనవాసము చేయుచున్నారు. ఇప్పుడు వారు ద్వైతవనములో సరోవర తీరమందు వనవాసులైన బ్రాహ్మణుల సహవాసములో నున్నారని తెలిసినది.

కనుక మహారాజా! నీవు వైభవోపేతుడవై నీ తేజస్సుచేత సూర్యునివలె వెలుగుచు పాండుపుత్రులను తపింపచేయుచు అక్కడికి పొమ్ము. రాజ్యమునందున్నట్టి, రాజ్యలక్ష్మితో పరివృతుడవైనట్టి, సమృద్ధిగా ధనములు కలిగినట్టి నీవు రాజ్యచ్యుతులై, లక్ష్మీహీనులై, నిర్ధనులైన పాండుపుత్రులను చూడుము. వారు మహాకులీనుడవై, మంగళకరమైన స్థితిలోనున్న నిన్ను నహుషపుత్రుడైన యయాతినివలె చూచెదరుగాక.

రాజా! పురుషుని వద్ద నున్న సంపదను అతని మిత్రులు శత్రువులు చూచినప్పుడే ఆ సంపద బలయుక్తమగును. ఉన్నతమైన పర్వత శిఖరముపై నున్న మనుష్యునకు భూతలముపై నున్న వస్తువులన్నియు నీచములుగాను, చిన్నవిగాను కనబడునట్లే సుఖము ననుభవించుచు ఉన్నత స్థితిలోనున్న మనుష్యునకు నీచస్థితిలో బాధపడుచున్న శత్రువులు కనబడుదురు. ఇంతకంటె అధికమైన సుఖస్థితి వేరుగా నేమియుండును. మనుష్యునకు శత్రువుల దుర్దశను చూచుట వలన కలిగిన సంతోషముకంటె ధనలాభముచేతగాని, పుత్రలాభముచేతగాని, రాజ్యలాభముచేతగాని అధిక సంతోషము కలుగదు. అడవిలో ఆశ్రమవాసులై వల్కలములను మృగ చర్మమును ధరించిన అర్జునుని చూచినప్పుడు మనలో ఎవరికైనను సుఖ సంతోషములు కలుగకయుండునా? అమూల్య వస్త్రధారిణులైన నీ భార్యలు వల్కలాజినములను ధరించి దుఃఖితురాలైయున్న ద్రౌపదిని చూచెదరుగాక. ఆమెయు వీరిని చూచి దుఃఖమును సంతాపమును పొందుగాక. ఆమె ధనరహితమైన తనను, తన జీవితమును నిందించుకొనుగాక. ఆనాడు సభలో ఆమెకు జరిగిన అవమానముకన్న అధికముగా ఈనాడు వైభవముతోకూడిన నీ స్త్రీలను చూచి అవమానమును పొందునుగాక!" ఈ విధముగా కర్ణుడు, శకుని, దుర్యోధనునకు దుర్బోధలు చేసిరి.

కర్ణుని మాటలు విని దుర్యోధనుడు హర్షముచెంది దీనుడై ఇట్లనెను. "కర్ణా! నీవు చెప్పినదంతయు ఇదివరకే నా మనస్సులో నున్నది. కాని పాండవులున్నచోటికి పోవుటకు నాకు ధృతరాష్ట్రుడు ఆజ్ఞ ఇవ్వడు. ఆయన వీరులైన పాండవులను తలచుకొని దుఃఖించుచున్నాడు. ఆయన తపోయోగ బలముగల పాండవులు మాకంటె అధికబలశాలురు అని తలచుచున్నాడు. ఒకవేళ మా తండ్రికి నేను అక్కడ చేయబోవు పనిని తెలసినయెడల ఆయన నాకు రాబోవు సంకటములనుండి రక్షించుటకుగాను అక్కడికి పోవుటకు అనుమతిని ఇవ్వడు. ద్వైతవనములోనున్న పాండవులకు అపకారము చేయుటకన్న వేరు ప్రయోజనము నాకు అక్కడకు పోవుటలో లేదని ఆ మహారాజు సులభముగా గ్రహించగలడు. జూదము జరిగినప్పుడు విదురుడు నిన్ను నన్ను శకునిని కూర్చి అనిన మాటలు నీకు తెలియును గదా! ఆ మాటలన్నిటిని, పాండవుల అప్పటి దుఃఖమును విచారించినచో ఇప్పుడు ద్వైతవనమునకు పోవలెనా లేదా అని నిశ్చయింపలేకున్నాను. అడవిలో ద్రౌపదితో పాటు క్లేశములను అనుభవించుచున్న భీమార్జునులను చూడవలెనను సంతోషము నాకు కూడా అధికముగ నున్నది. పాండవులు నార చీరలు మృగచర్మములు ధరించి అడవిలో ఇడుములు పడుచుండగా చూచుటవలన కలుగు సంతోషముకన్న అధిక సంతోషము ఈ సమస్త భూమండలాధిపత్యము వలన కూడా నాకు కలుగదు. కాషాయ వస్త్రములను ధరించి వనములోనున్న ద్రౌపదిని చూచుటకన్న అధికమగు సంతోషము నాకు ఏమియుండును. ఆ స్థితిలో నున్న ధర్మరాజు భీమసేనుడు మున్నగువారు వైభవోపేతుడైన నన్ను చూచినప్పుడు నా జీవితము సఫలమగునుగదా! అక్కడికి పోవునప్పుడుగాని రాజునుండి అనుమతి పొందుటకుగాని ఉపాయమేమియు నాకు తోచుటలేదు. కనుక కర్ణా! నీవు దుశ్శాసనునితో శకునితోను మంతనము సలిపి వనమునకు పోవుటకు సరి అయిన ఉపాయమును చూడుము. నేను కూడ వనమునకు పోవలెనా లేదా అని నేడే నిశ్చయించుకొని రేపు ఉదయమే మహారాజు కడకు పోయెదను. నేను ఆయన కడకు పోవునప్పుడు కురు వృద్ధుడైన భీష్ముడు కూడ అక్కడ నుండును. అప్పుడు ఆ సమయమునకు తగిన యుపాయమును నీవు, శకుని నాకు తెల్పుడు. భీష్మ ధృతరాష్ట్రుల మాటలను బట్టి వనమునకు పోవుటనుకూర్చి భీష్ముని ఒప్పించి తరువాత ప్రయత్నమును చేసెదను.

ఆలాగే చేసెదమని వారందరు తమ తమ ఇండ్లకు పోయి మరునాడు తెల్లవారగానే దుర్యోధనుని కడకు వచ్చిరి. అప్పుడు కర్ణుడు నవ్వుచు దుర్యోధనునితో ఇట్లనెను: "రాజా! ఉపాయమును

కనుగొన్నాను. వినుము. గోవుల నివాసస్థానము లన్నియు ద్వైత వనములోనే యున్నవి. అచ్చటి గోపాలకులందరు నీరాకకై ఎదురు చూచుచున్నారు. కనుక ఘోషయాత్ర నెపముతో అక్కడికి వెళ్ళెదముగాక, ఇందులో ఎవ్వరికిగూడ సంశయము కలుగదు. మన గోవులను చూచుటకు పోవుట సర్వదా ఉచితమైన పని, ఈ నెపమును చూపినచో తండ్రిగారు నీవు అక్కడికి పోవుటకు ఆజ్ఞను అవశ్యముగా నీయగలరు."

ఇట్లు మాట్లాడుకొను వారి నిరువురిని చూచి శకుని నవ్వుచు ఇట్లనెను—"ఈ యుపాయము అన్నివిధముల నాకు మంచిదిగా తోచుచున్నది. ధృతరాష్ట్రుడు అవశ్యముగా ఆజ్ఞ ఇచ్చును. అక్కడికి పోయి మనము చేయవలసిన పనులన్నియుకూడ ఆయనకు వివరించెదము. గొల్లవారందరు ద్వైతవనములోనే యున్నారు. అక్కడికి మీరు రావలెనని కోరుచున్నారు. అందువలన మేముపోయి వారి క్షేమ లాభములను తెలిసికొనెదము. అని చెప్పినచో మనము నిస్సంశయముగా రాజాజ్ఞ గొని అక్కడికి పోగలుగుదుము" ఇట్లు మాట్లాడుకొని వారందరు సంతసించి ఒండొరులు కరగ్రహణము చేసికొని 'ఈ ఉపాయమునే చేసెదము' అని నిశ్చయించుకొని ధృతరాష్ట్రుని దర్శించుటకు పోయిరి ధృతరాష్ట్రుడు కుశల ప్రశ్నముచేసెను వారుకూడ ఆరాజునకు నమస్కరించి కుశలమడిగిరి.

గోపాలకులలో 'సమంగుదు' అను నొకనికి పూర్వమే దుర్యోధనాదులు తమకుట్రను నేర్పి యుండిరి. అతడు ధృతరాష్ట్రుని వద్దకువచ్చి 'గోవులు సమీపములోనే యున్నవి. వాటిని చూడుడు' అని తెలిపెను. తరువాత కర్ణ-శకునులు ధృతరాష్ట్రునితో నిట్లనిరి:— "రాజా! ఇప్పుడు మన గోవులున్న ప్రదేశము రమణీయముగ నున్నది. ఈ సమయము ఆ గోవులను దూడలను లెక్కపెట్టుటకు, వాటివయస్సు, రంగు, జాతి మొదలయిన వివరములు వ్రాయుటకు గూడ మిక్కిలి అనుకూలముగనున్నది. రాజా! ఈ సమయము వేటకు గూడ తగినది. క్రూరమృగముల నీ కొడుకు దుర్యోధనుడు వేటాడి సంహరించునుగాక. కనుక ఇతడు ద్వైతవనమునకు పోవుటకు నీవు అనుజ్ఞ ఇవ్వవలెను" ఆ మాట విని ధృతరాష్ట్రుడిట్లనెను:—

"నాయనా! క్రూరమృగములను వేటాడుట, గోవుల యోగక్షేమములను తెలిసికొనుట చాల మంచిపనియే. కాని కుమారా! నీవు ఈ గోపాలకుల మాటలపైన విశ్వాసము ఉంచకుము. నేను నీకు నీతి బోధించుచున్నాను. ఇప్పుడు పాండవులు ఆ సమీపముననే యెక్కడనో ఉన్నారని విన్నాను. అందుచేత మీరు స్వయముగా అక్కడికి పోవుటకు నేను ఆజ్ఞ ఈయను. వారు కపటముగా ఓడింపబడి, కారడవిలో అనేక బాధలనుభవించుచున్నారు. వారు నిత్య తపోవ్రత సంపన్నులు. మహారథికులు. సమర్థులు. ధర్మరాజు కోపింపకపోవచ్చును. కాని, భీమసేనుడు క్రోధమూర్తియే. ద్రౌపది సాక్షాత్ అగ్నిస్వరూపురాలే. దర్పమోహముగల మీరు వారి యెడల తప్పక అపరాధము చేసెదరు. అప్పుడు తపోబలసంపన్నులగు పాండవులు తపోగ్నిచేత మిమ్ము పూర్తిగా దహించివేయుదురు. లేదా వారు సర్వదా శస్త్రాస్త్ర సన్నద్ధులై యుందురు గనుక అస్త్రాగ్నులతోనైన మిమ్ము దహించగలరు. లేదా మీరు అధిక సంఖ్యలో అక్కడికి పోయెదరు గనుక సంఖ్యాబలముతో మీరే వారిపైన దాడిచేసినచో అది మీ నీచత్వమగును. మీరు పాండవుల జయించుట అసంభవము అర్జునుడు స్వర్గలోకములో నివసించి అనేక దివ్యాస్త్రములను సంపాదించుకొని వచ్చినాడు. పూర్వము అస్త్రబలము లేనప్పుడే అర్జునుడు సమస్త పృథ్విని జయించెను. ఇప్పుడు అస్త్రబల సంపన్నుడగు ఆ మహారథికుడు మిమ్ము చంపక విడుచునా? నామాటపైన ఒకవేళ మీరు అక్కడ జాగ్రత్తగా వ్యవహరించినను, పాండవులు సత్యవ్రతులు .కనుక మీకు ఏలాటి కష్టము కలిగించరు, అను విశ్వాసము మీకు ఉన్నప్పటికిని, వనవాసక్లేశమును అనుభవించుచున్న పాండవులమధ్య మీరు ఉండుట దుఃఖదాయకమే యందును. లేదా, మీ సైనికులే ఒకవేళ పాండవులకు అపకారముచేసినచో ఆ దోషము మీకే సంక్రమించగలదు. కనుకపుత్రా! గోవులను చూచుటకు మరియెవరైన అధికార పురుషులను పంపుము. నీవు స్వయముగా పోవుట నాకు ఇష్టము కాదు'' అమాటవిని శకునియిట్లనెను:—

"మహారాజా! యుధిష్ఠిరుడు ధర్మాత్ముడు. "మేము పన్నెండు సంవత్సరములు వనములో నుండ గలమ'ని నిండు సభలో నతడు ప్రతిజ్ఞ చేసెను. ఆయన తమ్ములు కూడ ధర్మము తప్పి నడుచువారు కారు. వారందరు యుధిష్ఠిరునే అనుసరించెదరు. ఆయన మాపైన ఎప్పుడు కూడ కోపించడు. మేము క్రూర మృగములను వధించుటకు గాను వేటకు పోవుట మా ముఖ్యోద్దేశము. ఆ సమీపములోనే యున్న గోవులను కేవలము లెక్కపెట్టి వచ్చెదము. పాండు పుత్రులతో కలియు ఉద్దేశము మాకు ఏ మాత్రము లేదు. మేము అక్కడ నీచముగా ప్రవర్తించము. పాండవుల నివాస స్థానము వైపునకు గూడ మేము పోవము'' ఈ మాటలు విని ధృతరాష్ట్రుడు తనకు ఇష్టము లేకున్నను దుర్యోధనునకు అనుజ్ఞనిచ్చెను.

ఘోషయాత్ర

ద్వైత వనమునకు పోవుటకు తండ్రి యాజ్ఞవడసిన దుర్యోధనుడు కర్ణునితోను, గొప్ప సైన్యముతోను నగరము విడిచి బయలు దేరెను. దుశ్శాసనుడు, శకుని, ఇతర ధృతరాష్ట్రపుత్రులు, స్త్రీ జనమువారిని అనుసరించి వనమునకు పోయిరి. పౌరులు కూడ భార్యాయుక్తులై ద్వైతవనమును చూచుటకు దుర్యోధనుని అనుసరించి పోయిరి. ఎనిమిదివేల రథములు, ముప్పదివేల ఏనుగులు, అనేక సహస్ర సంఖ్యగల పదాతిగణము, తొంబదివేల అశ్వములు, ఆ సైన్యములో నుండెను. ఇతర సామాగ్రి తీసుకొనిపోవుటకుగాను వందల కొలది బండ్లు, అంగళ్ళు వెంటపోయెను. వర్తకులు, వంది మాగధులు, వేటవారు, నూర్లువేలకొలది సంఖ్యలో పోయిరి. వారందరు ప్రయాణము చేయుచుండగా వర్షాకాలములో ప్రచండ వాయుధ్వనివలె ఆ సైనికుల ధ్వని భూమ్యాకాశములు నిండిపోయెను. దుర్యోధనుడు రెండుకోసుల దూరము పోయి అక్కడ కొంత సేపు ఆగి తిరిగి ద్వైతవనమునకు ప్రయాణము సాగించెను.

దుర్యోధనుడు అచ్చటచ్చట వనములో నివసించు గొల్లపల్లెలకుపోయి అక్కడ బసచేసెను. అతనితో పోయినవారు గూడ ఆ ప్రదేశములో తమకు అనువైనచోట్లలో నివాసము లేర్పచుకొనిరి. కర్ణ శకునులకు—తమ్ములకు తగిన వసతులు కల్పింపబడెను.

దుర్యోధనుడు అనేక శత-సహస్ర సంఖ్యలుగల గోవులను-చూచి వాటిపైన గుర్తులు, సంఖ్యలు వేయించెను. ఈ విధముగానే దూడలకు, అప్పుడే యీనిన గోవులకు వేరు వేరుగా గుర్తులు వేయించెను- ఈ విధముగా గోవులన్నిటిని పరిశీలించి మూడేండ్ల దూడలను విడిగా లెక్క వేయించి, వాటికి గుర్తులు వేయించెను. అప్పుడు వినోదముగా గోవులతోపాటు ఆ వనములో దుర్యోధనుడు కొంతసేపు విహరించెను. పౌరులు - సైనికులు గూడ ఆ వనమునందు దేవతలవలె విహరించిరి. గోపాలకులు-వారి కన్యలు నృత్య గీతాదులచేత దుర్యోధనుని సంతోషపరచిరి. అటుపిదప స్త్రీలతోపాటు గోపాలకులను ఆదరించి వారికి-ధనము అన్నపానీయాదులు ఇచ్చి సత్కరించెను.

ఆ తరువాత వారందరు అనేక క్రూర మృగములను వేటాడసాగిరి. కొన్నిటిని వధించి, కొన్నిటిని పట్టుకొనిరి. దుర్యోధనుడు సపరివారముగా గోవులపాలు. పెరుగు, వెన్న, నెయ్యి, మొదలగు గోరసములను తృప్తిగా ఆరగించెను రమణీయములైన అనేక వనోపవనములను చూచుచు అందలి తుమ్మెదల ఝుంకారములను, నెమళ్ళ కేకలను వినుచు క్రమముగా పవిత్రమైన ద్వైతవనమును చేరెను. ఆ వనమునందలి సరోవరము అనేకపక్షుల కలకలములతో, మయూర కేకలతో, నాట్యములతో, అనేక వృక్ష సంతతితో మనోహరముగా నుండెను.

ఆ సరస్తీరమునందు యుధిష్ఠిరుడు పత్నితో సోదరులతో ఒక దినములో చేయదగిన రాజర్షి యజ్ఞము చేయుచుండెను. వన్యములగు దివ్య విధానములతో బ్రాహ్మణులు యజ్ఞము, చేయుచుండిరి.

అప్పుడు దుర్యోధనుడక్కడ ననేక క్రీడామంటపములను సిద్ధము చేయుమని పరివారమునకు ఆజ్ఞయిచ్చెను. వాటిని నిర్మించుటకు పరివారము వారు ఆ సరస్తీరమునకు పోయిరి. అచ్చట ప్రవేశించుచున్న సేనా పతిని గంధర్వులు అడగించిరి. జనమేజయమహారాజా! అక్కడికి గంధర్వరాజు ఇంద్రాజ్ఞచే సపరివారముగా కుబేరలోకము నుండి పూర్వమే వచ్చియుండెను. ఆ సరస్సును గంధర్వుల సంఘము చుట్టియుండుటను చూచి సైనికులు తిరిగి దుర్యోధనుని వద్దకుపోయిరి. వారి మాటలు విని దుర్యోధనుడు ఆ గంధర్వులను వెడలగొట్టుడు. అని చెప్పెను. ఆ మాట ప్రకారమే సైనికులు సరస్సు కడకుపోయిరి. "దుర్యోధన మహారాజు ఇక్కడ విహరించుటకు సకుటుంబముగా వచ్చినారు కనుక మీరిచ్చటినుండి తొలగిపొండు, అని గంధర్వులతో ననిరి. ఆ మాటవిని గంధర్వులు నవ్వి "మందబుద్ధి గల మీ రాజు వైశ్యుల నాజ్ఞాపించినట్లు దేవలోకవాసులైన మాకు ఆజ్ఞయిచ్చుచున్నాడే! మీకు గూడ బుద్ధిలేదు. మీరందరు మరణించదలచినట్లున్నారు. లేనిచో అతని మాటలు వినినంత మాత్రముచేత మా కడకు వచ్చి ధైర్యముతో నిట్లు పలుకగలుగుదురా? వెంటనే మీ రాజుకడకు మీరు పొండు, లేదా యిప్పుడే మిమ్ము యమరాజు పట్టణమునకు పంపెదము.'' అని యనిరి. . ఆ మాటలు విని సైనికులు దుర్యోధనుని కడకు పరుగెత్తుకొని పోయి గంధర్వులనిన మాటలతనికి చెప్పిరి.

[సశేషము]

విద్యార్థులకు...

దేశంలో పరిష్కారం కావలసిఉన్న వివిధ సమస్యలను గురించి విద్యార్థులు కూలంకషంగా తెలుసుకోవడం వారి విధి. విద్యా సముపార్జనానంతరం వారు కార్య రంగంలోకి దూకవలసి రావచ్చు.

విద్యార్థులు అనుక్షణం తమ ఆత్మ పరిశీలన చేసుకొంటూ, అన్ని రంగాల్లోనూ తమ శీల సంపదను పెంపొందింపజేసుకోవలసి ఉంటుంది. అప్పుడే తమ జీవితం ఆచరణలో తమకు సత్ఫలితాల నియ్యగలదు. శీల సంపదలేని వ్యక్తి ఎంత విద్యావంతుడయిననూ దేశ సేవకు అనర్హుడు.

—గాంధీజీ



తెలంగాణా కవి పండితులు

మహబూబ్‌నగర్ మండలం శతాబ్దిగా వెలిగించిన సాహిత్య దీపాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ అడుగుపెట్టినా, అక్కడి నుడికారం, దానిపై అక్కడి జనం మమకారం నాకు ఆశ్చర్యానందాలు కలిగిస్తూంటాయి. "బారా కోస్‌మేఁ బాద్ బదల్‌తీ"—పన్నెండు కోసులకు పలుకుబడి మారుతుంది—అనేది పంజాబీ సామెత. ఇది తెలుగుకూ అక్షరాలా వర్తిస్తుదంటే నిజంమరొకసారి చెప్పినట్టవుతుంది. తెలుగు బాస యేసల వయ్యారంతో జిల్లాజిల్లాకూ కొత్త సోయగాలు చిందుతూ, సరికొత్త సత్తువపొందుతూ, చిత్తూరునుంచి శ్రీకాకుళంవరకు, కాళహస్తినుంచి కాళేశ్వరంవరకు నడిచే వడిని, నడిని చూస్తున్నప్పుడు, చూస్తూనే ఉదామా అనిపిస్తూంది.

దీనికి యా ప్రాంతాల గత వైభవగాథలు, వర్తమాన ప్రయత్నాల ప్రగతులు తోడయి ఆ యా ప్రాంత ప్రజలపై ఎనలేని ప్రీతి పరీవాహమై పొంగుతుంది. ఈ భాష, ఈ యేస, ఈ పలుకుబడి గ్రంథాలలోకి ఎక్కితేగాని, తెలుగుజాతికి–ముఖ్యముగా, స్వభాషలో పరిపాలన, వృత్తి విద్యాబోధన కొనసాగించదలచిన తెలుగుజాతికి–మహానిఘంటువు, విజ్ఞాన సర్వస్వం సమగ్రమయినవిగా రూపొందజాలవనే నమ్మకమూ నాకు నానాటికీ బలపడుతూ వుంటుంది. అట్లా బలపడడంలో మహబూబునగరం జిల్లా–పాలమూరు జిల్లాకూడ మరొక కారణమయింది.

ఈ పాలమూరు జిల్లాను తలచుకొన్నప్పుడల్లా నేను పొంగిపోతుంటాను. వైయక్తికమయిన సంబంధం ఉంది, దీనితో. నా మిత్రుల తండ్రులు తాతలు విద్వత్కవులయి నాకు దీనితో ఆత్మీయత కలిగించారు. ఈ జిల్లాలోని సంస్థానాలు, సంస్థానాల పండిత వంశాలు, ఈ ప్రాంతానికేకాక యావదాంధ్ర దేశానికి భారత దేశానికీ కూడా తెచ్చిన కీర్తి సామాన్యమైనది కాదు.

నేను ఈ ప్రాంతం ప్రాచీన చరిత్రను తడివి పాఠకులకు విసుగు కలిగించను; అద్యతన భూతకాలంలోను, వర్తమానకాలంలోను విరాజమానులయిన కొందరు కవిపండితులను మాత్రము ఉట్టంకించి, విరమిస్తాను.

ప్రస్తుతం ఈ మహబూబునగర్ జిల్లాలోని పాలెం ప్రాచ్య విద్యాలయంతో, ఇతర కళాశాలలతో, మహాప్రగతి సాధిస్తున్నది. వీటిని ప్రోత్సహించినవి బహుశా ఈ పాలెం పరిసరాల పూర్వ చరిత్రలేనని అనుకుంటాను. పాలెం చుట్టుపట్లఉన్న అచ్చంపేట, రఘుపతిపేట, బలమూరు, పండితులకు ఆలవాలం. నాకు తెలిసినవారు అచ్చంపేట నరసింగయ్య శాస్త్రిగారు. ఆయన మహా వైయాకరణులు. కాశీకివెళ్ళి శివకుమార పండితులవద్ద పుష్కరం పాటు వ్యాకరణం చదివారు. ఆ శివకుమార పండితులు విద్యార్థులకు విద్యతోపాటు అన్నదానమూచేసి, వారిని మహా విద్వాంసులుగా తీర్చేవారు. నరసింగయ్య శాస్త్రిగారు కాశీనుంచి స్వప్రాంతానికి తిరిగి వచ్చి, వనపర్తి, గద్వాల మొదలయిన సంస్థానాలలో పెక్కు వాక్యార్థాలలో విజయభేరి మ్రోగించిన వారు. వారికి ఈ మండలంలోనేకాక, తెలంగాణాలోను అంతేవాసుల సంఖ్య అనంతం. వారు గతించి ఇరవైయేళ్ళు కావచ్చిందనుకుంటాను. ఒకమారు వారిని మిత్రుడు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి ఇంట దర్శించడం తటస్థించింది. అదే ప్రథమ దర్శనం. మిత్రుడు భోజనాంతరం వారిని "శాస్త్రిగారూ, తాంబూలం సేవిస్తారా?" అని అడిగారు. "నేను పతిత ద్విజుణ్ణి" అన్నారు వారు. అంటే పడిపోయినపళ్లు గలవాణ్ణి అన్నమాట. పాతిత్యంపళ్లకే గాని వారికి కాదు. వారి చమత్కార సంభాషణం అలాంటిది.

తిరుమల రామచంద్ర

రఘుపతి పేటలో సుబ్బాశాస్త్రిగారనే గొప్పపండితులు ఉండేవారు. వారు పురాణ ప్రవచనంలో ఆంధ్రదేశంలో పేరుపొందినవారు. రఘుపతిపేట సుబ్బాశాస్త్రి అని వారికి ప్రసిద్ధి.

గోపాలపేట సంస్థానంలో పల్లా నరసింహశాస్త్రిగారు గొప్ప విద్వాంసులు. వీరిని గురించి ఒక విచిత్రమైన కథ వ్యాప్తిలో ఉంది. వీరి వంశంవారు రాజపురోహితులు. నరసింహశాస్త్రిగారికి మొదట్లో కొంత స్మార్తం వచ్చునేకాని, శాస్త్ర పరిచయం కాని, సాహిత్య సంబంధంకాని లేదట. ఒకమారు, వారు, అప్పటి రాజాగారి తండ్రి తద్దినం పెట్టిస్తున్నారట. ఆ సంస్థానంలో రాఘవాచార్యులనే అపర పతంజలి ఉండేవారు. శ్రాద్ధ సమయంలో వారూ రాజాజ్ఞతో అక్కడఉన్నారు. నరసింహశాస్త్రిగారికి సంస్కృత భాషాజ్ఞానం లేదుగనుక పితరం అనడానికి పిత్రే అని, మహ్య అనడానికి మమ అని విభక్తి ప్రత్యయాలు తప్పులు చెబుతుండగా, రాఘవాచార్యులుగారు షష్ఠి, సప్తమి, తృతీయ అంటూ తప్పులు దిద్దసాగారట. నరసింహశాస్త్రి గారు సహించలేకపోయారు. రాజాగారి వద్ద తమ పరువు తీస్తున్నాడే ఈ విద్వాంసుడు అనుకున్నారు; లేచి నిలబడ్డారు; రాజావారితో "మహారాజా, ఒక మనవి. తమ తండ్రిగారు పరమపదించినది ద్వాదశి నాడు,

మా చంద్రిగారూ, నేనూ ఆ విధంగానే ఆ తిథి చెప్పి శ్రాద్ధ కర్మ చేయిస్తున్నాము. ఈ ఆచార్యులవారు ఒకసారి షష్ఠి అని, మరొకసారి సప్తమి అని, ఇంకొకసారి తృతీయ అని అంటున్నారు. ఏది సరైన తిథి అనేది తమరే సెలవీయండి. దాని ప్రకారమే, చెబుతాను. చేస్తాను. ' అని అన్నారట. రాజావారు కోపంతో ' ఆచార్యుల వారు, శాస్త్రిగారు సరిగా తిథి చెబుతూంటే, తప్పు దారి ఎందుకు పట్టిస్తున్నారు ఆయనను ? ద్వాదశి తిథి అని నగరులోని ఆడబాపలకు కూడా తెలుసే, ఊరుకోండి. '' అన్నారట. శాస్త్రిగారి ధూర్తత్వానికి ఆచార్యులవారు ఆశ్చర్యపడి, అవమానంతో, కోపంతో లేచిపోయారట. శ్రాద్ధం యథావిధిగా సాగింది. నరసింహశాస్త్రిగారి మనస్సు తర్వాత విచారంతో కుతకుతలాడింది. మహాపండితులను ధూర్తత్వంతో, అజ్ఞానంతో అవమానించానే అని వెంటనే ఆచార్యుల వారి యింటికి వెళ్ళారు; వారి రెండు కాళ్ళు పట్టుకొన్నారు. " మీరు నాకు చదువు చెబుతానని మాట యిచ్చేవరకు కాళ్ళు వదలను " అని మార్కండేయునిలాగ భీష్మించారట. '' ఏమయ్యా, ఎంత గడుసరివి ? నడి వీధిలో పాదరక్షలతో కొట్టి, నట్టింట్లో కాలు పట్టుకొన్న సామెత చేశావు." అంటూ ఆచార్యుల వారు ఎత్తి పొడిచారట; ఎంతసేపటికీ సమాధానపడలేదట. '' స్వామి, నాకు అక్షరం ముక్కయినా రాదనే అనుకోండి. రాజా వారి వద్ద మీరు నా పరువు తీస్తే, మా గతి యేమి? మేము వంశ పారంపర్యంగా తప్పులతో షోడశ కర్మలూ చేయిస్తున్నామనే అపోహ వారికి కలుగదామరి? కనుక, అలాచేయక తప్పలేదు. ఎట్లయినా, నన్ను శిష్యుణ్ణిగా ఏలుకోండి. " అని ప్రాధేయపడ్డారట శాస్త్రిగారు. ఆచార్యుల వారి మనస్సు కరిగిందట. శాస్త్రిగారు నాలుగైదు సంవత్సరాలలో భాష్యాంతం వ్యాకరణం నేర్చారు; గురువులకు కీర్తి తెచ్చారు. వారి శిష్యులే ఖండవల్లి నరసింహశాస్త్రిగారు. వారిని వర్తెం శాస్త్రిగారని వ్యవహరిస్తారు.

పల్లా నారాయణశాస్త్రి గారు వేదుట్ల వారు; శాస్త్రాలలోనే గాక వేదాలల్లోను విద్వాంసులు; వేదార్థం కదళీపాకంగా వివరించేవారు.

ఖండవల్లి నరసింహశాస్త్రి గారు వ్యాకరణ శాస్త్రపారావార పారంగతులు; ప్రస్తుతం ఆంధ్రదేశంలో ఉన్న మహావైయాకరణులలో అగ్రగణ్యులు. ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమయినట్టివారు. వారు పైకి ఏమి తెలియని వారివలె ఉంటారు; కాని, వాక్యార్థాలలో పంచాననులు, వారి వాక్యార్థం 1971 లో హైదరాబాదులో నల్లకుంట రామాలయంలో మరొకమారు వినే భాగ్యం కలిగింది. నేను దేశమంతా తిరిగినవాడిని. అంతో ఇంతో భాషాపరిచయం ఉన్నవాడిని, వాక్యార్థాలలో, పాఠప్రవచనాలలో వర్తెం శాస్త్రిగారి స్థానం గొప్పదనే విశ్వాసం కలిగింది నాకు. వారు సంవత్సరం క్రితం వరకు హైదరాబాదులో సీతారాంబాగ్ సంస్కృత కళాశాలలో వైస్ ప్రిన్సిపాలుగా ఉండేవారు; ఉపకార వేతనం పొంది, స్వగృహంలోనే శిష్యులకు పాఠాలు చెబుతున్నారు. వారు అనంత శిష్యపరంపర కలవారు. వారి పాండిత్యం బహుముఖం. సంస్కృత భాగవతం వారి సొమ్మంటే ఆశ్చర్యంలేదు. శ్రీమద్భాగవతం శ్రీధరీయవ్యాఖ్యానంతో సహా ఏమూల ఏ అక్షరముందో వారికి తెలుసు.

కొన్ని పందల భాగవత సప్తాహాలు జరిపిన వారు. జ్యోతిషంలో త్రిస్కంధాలు తెలిసినవారు. వేదం అశీతిస్వీయం నేటికి కంఠస్థం. పంచదశ కర్మలు అలవోకగా చేయిస్తారు వారు. తమ చిన్నతనంలో పిఠాపురం విద్వత్సభలో పరీక్ష యిచ్చినప్పుడు జరిగిన వాద ప్రతివాదాలు వారే చెప్పగా వినే సదవకాశమూ నాకు కలిగింది.

పాలెం సమీపంలోని రాజాపురం వారు తెలకపల్లి రామచంద్రశాస్త్రిగారు. సంస్కృతంలో సుందర కవిత చెప్పి శృంగేరీ పీఠాధిపతుల అనుగ్రహానికి పాత్రమయ్యారు

ఆ ప్రాంతం వారే అయిన కేతేపల్లి చంద్రశేఖరశాస్త్రి గారు వ్యాకరణ విద్వాంసులు. పాలెం విద్యా సంస్థల కార్యదర్శి శ్రీ సుబ్రహ్మణ్య గారి మామగారయిన ఓరుగంటి లక్ష్మీనారాయణశాస్త్రి గారు గొప్ప విద్వద్వరేణ్యులు.

జటప్రోలు సంస్థానం ఆస్థాన పండితులైన వెల్లాల సదాశివ శాస్త్రి గారు జగద్విఖ్యాతులు. జటప్రోలు సంస్థానంలో భారతీదేవికి శాశ్వతంగా పీఠం స్థాపించారు వారు. మహామహోపాధ్యాయ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారి వంటి లబ్ధ ప్రతిష్ఠులను ఊపించివేసిన ఉద్దండులు వారు. వారు రచించిన అమాసోమవార వ్రత నిర్ణయం జ్యోతిశ్శాస్త్ర ధర్మశాస్త్ర, వ్యాకరణశాస్త్ర పర్యకు గీటురాయి వంటిది. ఈ ప్రతచర్యవారి పాండిత్య ప్రకర్షకు కేవలం సాకు.

జటప్రోలు సంస్థానంలో వనం సీతారామశాస్త్రి, కృష్ణశాస్త్రి మొదలయిన మహాపండితులు ఉండేవారు.

అంతకు పూర్వం కూడ యాపర్ల మొదలయిన గ్రామాలలో అక్షింతల సుబ్బాశాస్త్రిగారు వుండేవారు. సింగరశాస్త్రిగారు, వారి కుటుంబ సుప్రసిద్ధ విద్వద్వంశం. సుబ్బాశాస్త్రిగారు ఎందరికో భాష శాస్త్రి చేసినవారు.

వనపర్తి సంస్థానం తలచుకొన్నప్పుడు నా పక్షపాతం ఇనుమడిస్తుంది. కవిగ జభేరుండ సర్వతంత్ర స్వతంత్రేత్యాది బిరుదాంకితులైన శ్రీకృష్ణ బ్రహ్మతంత్ర పరకాల మహాదేశికేంద్రులు ప్రత్యక్షమవుతారు. వారి కుమారులైన శ్రీనివాసరాఘవాచార్యుల వద్ద సమాశ్రయణాది పంచసంస్కారాలు పొందినవాడిని గనుక నేను ఆ పరకాలదేశికేంద్రులకు ప్రశిష్యుణ్ణి. సుగృహీత నామధేయులు రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు, నాపితృపాదులు తిరుమల తాడిమర్రి శేషాచార్యులు గారు మొదలయిన వారు శ్రీకృష్ణబ్రహ్మతంత్రుల పాండిత్యపారమ్యం గురించి అసంఖ్యాకంగా చెప్పిన కథలు విన్నవాడిని. వారి శిష్యవాత్సల్యము పారమెరుగనిది. వారు పారంగతులు కాని శాస్త్రమంటూ లేదు. వారు చేపట్టకుండా మిగిలిన సంస్కృత సాహిత్య ప్రక్రియ అంటూ లేదు. రామేశ్వర విజయ చంపువును రచించిన సౌలభ్యసౌకుమార్యాలతోనే రమణుల పాటలూ రచించారు సంస్కృతంలో. సంస్కృత చరిత్రకారుడు కీత్ వారి చంపువులను కొంచెం చిన్నచూపు చూచినాడంటే, అది అతని సహృదయతాలోపమే. పాటలలో వాకిలి తీసేపాట చరణమొకటి ఉదాహరిస్తాను:—

"జఘన తల విజిత పులినే లలనే
విఘటయారర- బాలే, సఖి
బాలచంద్ర సముఖాలే."

తలంటు పాట :-

"జయ జయ సితకరవదనా,
జయ కుసుమోజ్జ్వల సితరదనా,"

వారిగ్రంథాలు అసంఖ్యాకాలు. అల్కంకార మణిహారం మొదలయినవి శతాబ్దాలుగా వస్తున్న మన ఆలంకారిక సంప్రదాయావిచ్ఛిన్నతకు తార్కాణ.

వారి తమ్ములు హూసదుర్గం వేదాంతాచార్యులవారు గొప్ప వ్యాకరణశాస్త్ర కోవిదులు.

వనపర్తిలో ఆచార్ల రంగాచార్యుల వారి పేరు పండితలోకానికి చిరపరిచితం. వారుకూడా కాశీపండితులు, శివకుమార పండితుల శుశ్రూషతో వ్యకరణశాస్త్రంలో నిధులయ్యారు. వనపర్తి ఆస్థానం అలంకరించారు. వారికి పండితరంగాచార్లనే పేరు పడింది. వారు సరసులు, శాంతస్వభావులు. తిరుపతి వేంకటకవులు వనపర్తికి వచ్చినప్పుడు, వారిన్యాయ బుద్ధిని ఉల్లేఖించారు- "రంగాచార్యులవారీ సంగతి నెరింగినారు" అని. వారిని గురించిన కథలు ఎన్నో ఉన్నాయి; ఒక్కటి మనవిచేస్తాను.

వారు పది పన్నెండు మంది శిష్యులకు భోజనంపెట్టి పాఠాలు చెబుతూండేవారట. అందుకోసం వారికి వనపర్తి సంస్థానంనుంచి నెలకు పది రూపాయలు పండిత భృతి ముట్టేది. ఒక సంవత్సరం విద్యార్థులెవరూ లేకపోతే, రాజాగారు ఆ భృతి ఆపివేశారు. రంగాచార్యులవారు అభిమానధనులు. అప్పటినుండి ఆసంస్థానం వైపు తిరిగిచూడలేదట. రాజాగారు ఎంత బ్రతిమాలినా వినలేదట, రాచనగరుకు వెళ్ళలేదట. తమ పాండిత్యాన్ని రాజాగారు పది రూపాయలలో విలువకట్టడం వారికి ఉచితమనిపించలేదు. వారి అంత్యకాలంలో రాజాగారు వారి యింటికే వచ్చి "స్వామీ తమరు మా ఆస్థానానికి రాకనే వైకుంఠానికి వేంచేస్తున్నారు" అని విలపించారట. "అదే పెరుమాళ్ళ నిర్ణయమేమో?" అన్నారట వారు. ఈలాటి కథలెన్నిటినో వారి సోదరపుత్రులు, ఆనెగొందిలో వకీలుగా ఉన్నట్టి వారు అయిన ఆచార్ల వేంకటాచార్యులు నా చిన్నతనంలో వినిపించేవారు.

వారి తమ్ములు రాఘవాచార్యులు, రాఘవాచార్యుల కుమారులు శ్రీనివాసాచార్యులు, వైయాకరణులే.

వారి తర్వాత, వారికి సమకాలికులుగా ఉండి వనపర్తి ఆస్థానంలో ప్రధాన పండితులుగా మన్ననపొందిన వారు నంబాకం రాఘవాచార్యులుగారు. వారు తర్క-వేదాంతాలలో అఖండ ప్రతిభావంతులు; కస్తూరి రంగాచార్యుల వారి శిష్యులు. వారు ఆజానుబాహులు; ఉదారత వారి పాండిత్యానికి బంగారు మలామా. వారి నిర్భీకత్వానికి ఎన్నో కథలు చెబుతారు. ఒక కథ విన్నది చెబుతాను. ఆస్థాన పరీక్షలలోను, పండితగోష్ఠులలోను, గెలుపొందిన వారికి ఉత్తమ సంభావన రూ.18-0-0, మధ్యమ సంభావన రూ12-0-0 లు, మూడవ సంభావన రూ 8-0-0 లు ఉండేవి. ఒక మారు ఒక పండితునికి వారు రూ. 12-0-0 ఇమ్మని నిర్ణయించారు. ఆస్థాన ప్రధాన పండితుల నిర్ణయానికి అనుగుణంగా రాజాగారు సంభావన యిచ్చేవారు. పండితులు ఒక చిన్న చీటీలో ఒక సంకేతంవ్రాసేవారు అది నిర్ణాయక విద్వాంసులకు, రాజాగారికి మాత్రమే తెలుసు. చీటీలోని ఆసంకేతాన్ని రాజాగారు చూచుకొని ఇచ్చేవారు. ఒక మారు ఒక పండితునికి రూ. 12-0-0 లు ఇవ్వవలసిందని నంబాకం వారు వ్రాశారు - అంటే, చీటీలో సంకేతమిచ్చారు. ఎందువల్లనో రాజాగారు ఆయనకు ఎనిమిది రూపాయలే యిచ్చారు. ఇది నంబాకం వారు గ్రహించారు. ఆ పండితుని దగ్గరికి పిలిచారు. ఆయనతోపాటు రాజాగారి గద్దెవద్దకు వెళారు ; రాజాగారి చేతిలోని రూపాయల సంచీ లాక్కున్నారు. పిడికెడు రూపాయలు ఆ పండితుని దోసిట్లో కుమ్మరించి, వెళ్లమన్నారు. "ఇదేమి అన్యాయమండీ ఆచార్యులవారూ? సభా మర్యాదను మీరిపోయారే, న్యాయమా?" అని ప్రశ్నించారు. ఆస్థానంలో విద్యార్హతలు నిర్ణయించే అధికారిని నేను. నేను సూచించిన మొత్తం ఇవ్వవలసినవారు మీరు. అంతే మీ అధికారం. ఈ విద్వత్పరీక్షలు జరుగుతున్నంతవరకు ఈ రూపాయల సంచినాది" అన్నారట వారు. రాజుగారు సహృదయులు. తన పొరపాటు గ్రహించారట ; నంబాకం వారి పనిని హర్షించారట; విరగబడినవ్వారట.

నా మిత్రుడు, వనపర్తి ఆస్థాన భూతపూర్వ విద్వత్కవి కప్పగంతుల లక్ష్మణశాస్త్రి కూడా నంబాకం వారి ఉదారతను గూర్చి పలు కథలు చెప్పినాడు. తను వారికన్నా ఎంతో చిన్నవాడయినా, వారి శిష్యుడయినా, ఉత్తమ సంభావనకు అర్హుడని ఆస్థానంలో ఉద్ఘోషించిన ఉదంతం కథగా చెప్పినాడు.

నంబాకం వారి ధైర్యసాహసాలను గురించి బూర్గుల రామకృష్ణరావుగారు చెప్పిన ఒక కథను పేర్కొంటాను. వనపర్తి సంస్థానం ప్రభువులు లోగడ నంబాకం వంశంవారికి పండిత భృతిగా ఇచ్చిన జాగీరును తర్వాత రాజు లాక్కున్నారు. దానిమీద ఆచార్యులవారు మహబూబ్‌నగర్ జిల్లా కోర్టులో దావావేశారు. బూర్గుల రామకృష్ణరావుగారు ఆచార్యులవారి పక్షం వకీలు. దావా రెండు దశాబ్దాలు నడిచింది. ఆచార్యులవారికి ఉరుదూ కూడావచ్చు కనుక కోర్టులో ఉరుదూలోనే మాట్లాడారు. జిల్లా జడ్జి అడిగాడు. "పండిత్ మహారాజ్, ఉన్హోనే జాగీర్ దీ, బాద్ మేఁ లేలీ, ఇస్ మేఁ క్యా గల్తీ హై?" అని (పండిత మహారాజా, వారు జాగీరు దానంచేశారు. మళ్ళీ పుచ్చుకొన్నారు. దీనిలో తప్పేమిటి.) ఆచార్యులవారు "జజ్ సాహబ్, వహ్ జాగీర్ ఖైరాత్ మేఁ హమేఁ దీహుఈ నహీఁ, హమారీ కాబిలీయత్ కో దేఖ్ కర్ దీ హుఈ హై. ఇన్ రాజా ఓఁనే హమారే బుజుర్గోంకో కఈ మిన్నతేఁ కర్కే బులాయా, సంస్థాన్ కే విద్వాన్ బనాయా, హమేఁ బరోడాకే గాయక్వాడ్ బులా రహే హైఁ. తిరువాన్కూర్ కే మహారాజా బులా రహే హైఁ. వన్‌పర్తి రాజాసే కహియేకి థూక్ కర్ చాటో. దియేహు ఏకో కోఈ ఖీంచ్ లేగా?" అన్నారు (జడ్జిగారూ, ఇది మాకు దానమిచ్చిన జాగీరు కాదు. మా సమర్థత చూచి ఇచ్చింది. ఈ సంస్థానం రాజులు మా పూర్వులను ఎన్నో విన్నపాలుచేసి పిలిపించుకొన్నారు ; తమ

సంస్థానంలో పండితులుగా నియమించుకొన్నారు. నన్ను బరోడా మహారాజు గాయక్వాడ్ పిలుస్తున్నారు ; తిరువాన్కూరు మహారాజా పిలుస్తున్నారు. మీరు వనపర్తి సంస్థానాధిపతులకు చెప్పండి ఉమ్మి వేసి దాన్ని నాకమని. ఇచ్చిందాన్ని ఎవరైనా లాక్కుంటారా?

వనపర్తివారయిన చేట్లూరి కంఠీరవాచార్యులుగారు, వ్యాకరణ విద్వాంసులు. బుక్కపట్నం రంగాచార్యులవారు దురదృష్టవశాత్తు కుష్ఠరోగంతో బాధపడినా, భాషకు గొప్ప సేవచేసినవారు. వారి కుమారులు అణ్ణయాచార్యులవారు వ్యాకరణ వేదాంత విద్వాంసులు. ప్రస్తుతం అనంతపురం జిల్లా పెనుగొండలో ఉన్నారు.

వనపర్తిలో ఇప్పటికీ కవి పండితులుగా గౌరవించబడుతున్నవారు విక్రాల వేంకటాచార్యులవారు, వారి తమ్ములు నరసింహాచార్యులవారూను. మొదటివారు కాశీ పండితులు. తమ్ములు తెలుగు కవిత చెబుతారు. గురురాయాచార్యులు, కృష్ణాచార్యులు ద్వైత వేదాంత విద్వాంసులు.

వనపర్తిలో ఆంధ్ర కవి పండితులకు తక్కువలేదు, వేద విద్వాంసులకు తక్కువలేదు, పల్లా వంశం వేదవిదులనిధి. వనపర్తి పరిసరాలలో ఋగ్వేద యజుర్వేదాధ్యాయులు చాలమంది బలమూరు మున్నగు గ్రామాలలో ఉన్నారు. యజ్ఞయాగాలు చేసిన సోమయాజులూ ఉన్నారు.

గీర్వాణ వాణిలో అనర్గళంగా ప్రసంగించడమేకాక గీర్వాణాంధ్రాలలో మధురోదాత్త కవిత చెప్పగల నా మిత్రుడు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, ఆయనతోపాటు బిల్హణుని కర్ణసుందరి నాటికను, విక్రమాంక దేవచరితను, మరికొన్నిటిని తెలిగించిన మాదిరాజు విశ్వనాథరావుగారునూ వనపర్తివారే. లక్ష్మణశాస్త్రి పద్యాలు ఈ జిల్లావారేకాక, తెలుగువారంతా విన్నవే. అతని సహకవి కీర్తికాయులు విశ్వనాథరావుగారి కవిత ఇటు అచ్చ తెలుగులోను, అటు తత్సమభాషలోను ఎంత ప్రౌఢితో నడిచిందో రెండు పద్యాలతో సూచిస్తాను. వసంత వర్ణన ఘట్టంలోవి ఈ పద్యాలు.

"ఆనెన్ వననళినాలయ
మానితమలయానిలాతిమానసురభిళా
నూనశ్వాసము, ముగ్ధము,
సూనస్మితదంతురంబు సురభిముఖంబున్

డోలాకేళి :—

"ఊగుడువేడుక బల్దవు
లూగి మఱలు గరితలంది రుప్పరవీదిన్
మూగినవేల్పు వెలందుల
కో గన నౌసోయగంబులో సగపాలున్.

సులయ మారుతము :—

"కరసరసీరుహద్వితయ
గాఢగృహీతవిలోలడోలికా
భరణసమర్థరజ్జుచయ
వారిజదృగ్జనతానిరస్తవి
స్తరపరిధానబంధనవి
ధాననితంబతటీనిజోచ్ఛ్వాస
న్మరుదురు మోహితుం డగుచు
ప్రాన్పడియెన్ మరు డంత వింతగాన్"

దీనిలో మూడు పాదాలు సంస్కృతం, నాల్గవది తెలుగు కావడం ఒక చమత్కారం. క్రమాలంకారంతో ఉన్న ఒక సీస పద్యం ఉదహరిస్తాను.

జలక్రీడ :—

"కు కుమ కెంజాయ గొసరు మైపస దగి
ఎమ్మెమై కైదీవ నెత్తె నొకతె
తన్ను బాటింపని మన్నీని గని వడి
రహి మీర దనమెడ వ్రాల్చె నొకతె
మొలపైన డాకేలు బూనిచి తనవంగు
నొడలుడాలున నిల్చి యడరె నొకతె
ఎరుపురానోరణాలెసగి నిద్దపు నెల
వెలుగు వెల్లని మెయి నిలిచె నొకతె

వలవరదమునిగి కేలూతవలచినటుల,
విల్లుగొననెదగల మరున్వేడినటుల,
రేనినొప్పింప మరుని విల్లయినయటుల,
పాలెవలె తాను మరునగ్గి వ్రేలినటుల."


వనపర్తి సమీప లోని చింతకుంటవాసులు కేశవపంతుల నరసింహశాస్త్రిగారు, సంస్కృతాంధ్రములలో చక్కని కవిత చెప్పే విద్వాంసులు.

మూడు దశాబ్దాలుగా పండిత సభలకు ప్రసిద్ధమైన గద్వాలను గురించి చెప్పనక్కరలేదు. గద్వాలలో ఎందరో ఆంధ్ర గీర్వాణ కవులు వెలసినారు. వారిలో ప్రథమ స్మరణీయులు శ్రీవాగీశ బ్రహ్మతంత్ర పరకాల మహాదేశికులు. వారు అనేక శాస్త్రాలలో సారమెరిగినవారు. గద్వాలవారయిన పుల్లగుమ్మి వేంకటాచార్యులు గారు, వారి సంతతి అనంతాచార్యులు మొదలయినవారు వ్యాకరణ శాస్త్రాన్ని గుత్తగొన్నవారు.

అనేక శాస్త్రాలలో విద్వత్తను సంతరించికొని, లౌకిక వ్యవహారాలలోను ఆరితేరి, జిల్లా కలెక్టరు, సెషన్స్‌జడ్జివంటి ఉన్నత పదవులు అలంకరించిన వృద్ధ పండితులు గుండేరావు హర్కారే ఎన్నో సంవత్సరాలు గద్వాలలో ఉన్నవారు గనుక నేను వారినీ గద్వాల వాస్తవ్యులనుగానే భావిస్తున్నాను. వారు అరబ్బీ ఫారసీ భాషలలోను పండితులు. ఖురాన్ షరీఫ్‌ను సంస్కృతీకరించారు. పాణినీయ రూపాల ప్రక్రియకు యంత్రం కనిపెట్టారు.

(మిగతా వచ్చే సంచికలో)

నగరంలో వార్తా చిత్రాలు



మార్చి 15 వ తేదీన సికింద్రాబాదులో గవర్నరు సలహాదారు శ్రీ వి. కె. రావు మాజీ సైనికుల కుటుంబాలవారికి చెక్కులు, ఇండ్ల పట్టాలు పంపిణీచేశారు.



మార్చి 27 వ తేదీన శ్రీ వి. కె. రావు గాంధీ ఆసుపత్రిలో ప్రసంగ-శ్రవణ కేంద్రానికి ప్రారంభోత్సవంచేశారు.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎన్. భగవాన్ దాస్ హైదరాబాదులోని గౌలిగూడాలో మార్చి 26న మంచినీటిబావికి ప్రారంభోత్సవంచేశారు




రాష్ట్రప్రభుత్వ విద్యా విషయాల సలహాదారు శ్రీ ఎం. వి రాజగోపాల్ కళాభవన్‌లో మార్చి 17వ తేదీన ఖాదీ గ్రామీణ పరిశ్రమల ప్రదర్శన ప్రారంభించారు.




జాతీయ వ్యవసాయ కమీషన్ ఉపాధ్యక్షులు శ్రీ బి. శివరామన్ హైదరాబాదులో మార్చి 1 వ తేదీన వృత్తి - ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమానికి ప్రారంభోత్సవంచేశారు.

నగరంలో వార్తా చిత్రాలు




జపాన్ కన్సల్ జనరల్ వై. మచ్చుటకా మార్చి 27వ తేదీన గవర్నరును కలుసుకున్నారు.




మార్చి 13వ తేదీన గవర్నరు శ్రీ ఖండుభాయి దేశాయ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత అకాడమీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు.



హైదరాబాదులో ఆవ్రో విమానం పడిపోయిన స్థలాన్ని మార్చి 25 వ తేదీన కేంద్ర యాత్రిక, పౌర విమానయాన శాఖ స్టేట్ మంత్రిణి డా. సరోజినీ మహిషి సందర్శించారు.



విధానమండలి అధ్యక్షులు శ్రీ తోటరామస్వామి లండన్ [illegible]త్తున్న సందర్భంగా మార్చి 16వ తేదీన అభినందన సభ జరిగింది.



హైదరాబాదులోని జూబిలీ హాలులో ఏప్రిల్ 13వ తేదీన వరి, నూనె గింజల ఉత్పత్తి గోష్ఠికి గవర్నరు ప్రారంభోత్సవం చేశారు.

చైతన్య భానుడు

గంధం వేదవేశ్వరరావు

ఉదయిస్తున్నాడదిగో చైతన్య భానుడు
తూరుపు కొండల్లోంచి తమస్సు
తెరలను నిరాటంకంగా తోసికొని
వస్తున్నాడదిగో యినుడు
లెండర్రోయ్! లెండి! లెండి
పట్టుకోండి విశ్వశాంతి
విహాయసాని కెక్కించే ఊడ
చేరండి ప్రతియింట ప్రగతి
గంటలు మ్రోగుతున్న శుభశ్రీలవాడ
ఇదేనండి, ఇదేనండి
మన బాపూజీ చూపించిన
అడుగు జాడ
జాతిరత్న జవహారుని
కలకాలపు కలల నీడ
భారత రాజ్యేందిర జీవన సంద్రాన
దరిజేర చూపుచున్న ఓడ
రండి! రండి! అటు చూడండి
అరుణారుణ కిరణాలకు
దరహాసామృతాన్నందించే
చాంపేయ పొలాలు
తొలి ఉషో మయూఖానికి
జీవనానందోత్సవం తారాడిన
కృషాణుల కపోలాలు
విరిసిన కోరికల ప్రసూనాలు!
జాతి సంపదకై కృషిస్తున్న
కార్మిక తేజోత్ములు
భీతి యెరుగని జ్యోతులు
నీతి, నిజాయతీ దూతలు
చేయి చేయి కలపండి
సమభావం, సౌహార్ద్రం
సౌభ్రాతృత్వం, సోదరత్వం
రాళ్ళను సమకూర్చండి
దేశ శ్రేయస్సు యిలు లేచేలా
ప్రజావళిలో శుభం పూచేలా
పురోగతి చరిత్ర చక్రాల్ని
ముందుకు కదిలించండి
ఉదయిస్తున్నాడదిగో చైతన్య భానుడు
పదండి ముందుకు ప్రగతి పథాన

★

సఖులారా! మేలుకొనుడు

శ్యావాస్య


అల తూరుపు వాకిటిలో
భానూదయ మౌతున్నది
చలి కౌగిట నిదురబోవు
సఖులారా మేలుకొనుడు

రాగ ద్వేషాల ముసుగు
తీసి పారవేయు డవల
చీకటి వాకిలిని దాటి
వెలుగులోని కరుదెంచుడు

స్వప్రభావ కిరణమ్ముల
స్వేచ్ఛగ విహరింప రండు
మంచియనే వేడిమిలో
మానవతకు చలి తీరును

సఖ్యమనే సమిధలతో
భోగిమంట వేయరండు
ఆ పావక జ్వాలల గని
చింతలన్ని పరువెత్తును

అల తూరుపు వాకిటిలో
భానూదయ మౌతున్నది
చలి కౌగిట నిదురబోవు
సఖులారా మేలుకొనుడు!



శత్రు శిబిరంలో యతీంద్రుడు

14

ఖాసిం అనుకున్నట్లు జరగలేదు. రాయబారాలు ఫలించలేదు. హిందూ నాయకులు లొంగిరాలేదు. అందువల్ల యుద్ధం అనివార్య మనుకొన్నాడు ఖాసిం.

సోదరుడైన అబ్దుల్లాతోగూడ వజీర్ మల్లిక్‌ను కలుసుకొని తుది చర్చలు గావించాడు ఖాసిం. ఆనాడే తన సేనలను కంపిలి వైపుకు తరలించాడు.

ఢిల్లీసేనలు కంపిలివైపుకు వెడుతున్నాయి. అవి చూడ డానికొక సముద్రంలాగా కనబడుతున్నాయి. చూపరులకు భయం గొలుపుతున్నాయి.

కంపిలికి చాలా దూరంలోనే శత్రుసేనలను నిలవరించాలని నిర్ణయించుకొన్నారు సోమదేవరాజు, కాపయ్యలు. ఆనెగొంది సేనలు ఎదురుగా పోరాడాలని, తీరాంధ్ర సేనలు, ద్వారసముద్రం సేనలు ప్రక్కలనుండీ పైబడాలని గూడ వారు తీర్మానించుకొన్నారు. అనుకొన్న ప్రకారమే సోమదేవరాజు, అన్నమదేవుడు తమ సేనల్ని తీసుకొనివెళ్ళి ఢిల్లీసేనలతో కలబడ్డారు. ఇంతత్వరగా, ఇంత హఠాత్తుగా హైందవ సేనలు తమమీద పడుతాయని ఖాసింగాని, అబ్దుల్లాగాని అనుకోలేదు. ఆ సేనల తాకిడికి తమ సేనలు కలగుండు బడి ఒక్కమారుగా వెనక్కితగ్గాయి.

ఖాసిం, అబ్దుల్లాలు కలగిపోతున్న తమ సేనలకు ధైర్యం చెప్పి, వాటిని పురికొలిపి ముందుకు వెళ్ళమన్నారు. ఆ సేనలుగూడ తట్టుకొని నిలబడి ముందుకు వెళ్ళడానికి ప్రయత్నించాయి. కాని ఆనెగొంది సేనలు వాటిని ఒక అడుగు కూడ ముందుకు వెళ్ళనివ్వలేదు.

హిందూ సేనలంత వీరావేశంతో పోరాడుతాయని ఖాసిం ఊహించలేదు. ఆనాడు కంపలి సేనలుగూడ అంత ఉద్ధృతంగా పోరాడి వుండలేదు. ముందడుగువేసిన ఒక్క హిందూ సైనికుడుగూడ వెనక్కి తగ్గడం లేదు. ప్రతివాడు ముందుకు చొచ్చుకొని వెళడమో, లేక క్రింద బడిపోవడమో జరుగుతున్నది గాని ఎవ్వరూ వెనుతీయడం లేదు. వారి ధైర్యసాహసాలు ఖాసిముకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. అతడు తననుతానే మరచి ఆ దృశ్యాన్ని తిలకింప సాగాడు. అతనిలోవున్న హైందవం మేల్కొన్నది. కాని వెంటనే అతడు తన మనస్సు మార్చుకొన్నాడు. హృదయాన్ని కఠినం గావించుకొన్నాడు. తన సేనల్ని పురికొలుపుతూ ముందుకు వెళ్లాడు.

ఆలోగా ప్రక్కలలోనున్న సేనలు కలిగిపోతున్నట్లనిపించిందతనికి. వెనక్కి చూచాడు. కొత్త సేనలువచ్చి తమ సేనలను ప్రక్కలో ఎదిరించాయి. అందువల్లనే అవి అలా కలగుతున్నాయి.

ఖాసిం వెంటనే అబ్దుల్లాను అటు వెళ్లమన్నాడు. తమ సేనలను పురికొల్పి వాటినెదిరించ మన్నాడు. అతడొక ప్రక్కవుండి, మరొకవైపుకు మరొక సేనానిని పంపమన్నాడు.

మూడు ప్రక్కలనుండి దాడి వస్తుందని ఖాసిం అనుకోలేదు. వస్తే వెనుకనుండి దాడివచ్చునని, అలావస్తే వెనుకనున్న సైన్యం అటుతిరిగి పోరాడాలని ఇదివరకే అతడు ఆజ్ఞల నిచ్చివున్నాడు. కాని ఇప్పుడలా జరగలేదు.

హిందూ నాయకులు యుద్ధంలో బాగుగా ఆరితేరిన వారిలాగే వున్నారు. పైగా తమ ధర్మాన్ని నిలబెట్టడానికి పోరాడుతున్నారు. అందువల్ల వారికంత తెగింపు, అంత ధైర్యం, అంత సాహసం.

కాని తనకు, నిశ్చయం లేదు. అందువల్ల తాను తన సేనల్ని నడప లేకున్నాడు. తానేదో తప్పుగావిస్తున్నాని తన ఆత్మ ఘోషిస్తున్నది. అంతలోనే సుల్తాన్ తనమీద వుంచిన విశ్వాసం గమనానికి వస్తున్నది. అతని మనస్సు ఆందోళన పడింది. అతడు కర్తవ్య మూఢుడయ్యాడు.

పోరు ఘోరంగా జరగసాగింది. కాపయ్య నాయకుని నాయకత్వాన పోరాడుతున్న సేనలు ముందుకు చొచ్చుకొని పోసాగినవి. అలాగే ద్వారసముద్రం సేనలుగూడ ముందుకు రాసాగినవి. కొద్దికాలం అలాగే జరిగితే తన సైన్యం రెండు భాగాలుగా విడగొట్టబడేటట్లున్నదని ఖాసిం ఊహించాడు. తన సైన్యాన్ని తిన్నగా వెనక్కి తగ్గుతూ పోరాడమన్నాడు ఆ విధంగా చేస్తూ వెనుకవున్న తన సేనలతో కలుసుకొన్నాడు. అప్పుడా సేనలు ద్వారసముద్రం సేనల్ని, కాపయ్య సేనల్ని, అనెగొంది సేనల్ని ముఖాముఖిగా ఎదిరించడానికి వీలయింది.

ముస్లిం సేనలు హెచ్చుగా వున్నాయి. కాని హిందూ సేనలు వాటినేమాత్రం లెక్కచేయకుండా పోరాడసాగినవి.

ఇరువైపులా పెద్ద నష్టం జరుగుతున్నది. మంచి మంచి యోధులు నేలబడిపోతున్నారు. కాని ఏ పక్షమూ వెనుదీయలేదు. ఆ పోరాటం ఆ విధంగానే సాయంత్రంవరకు కొనసాగించబడింది. సంధ్య అయింది. అంధకారం పైకొనింది. అంతలో ఆనాటికి పోరు చాలించబడింది.

ఆనాటి యుద్ధంలో ముస్లిం సేనలకు ఎనలేని నష్టం గలిగింది. ఆ సేనలు చాల దెబ్బతిన్నవి. ముస్లిం సేనానులలో ప్రధానమైన వారు మరణించారు. అది మరింత ప్రమాద కరమైనది. ఆనాటి యుద్ధ ఫలితాన్ని గాంచి మరునాడేమవుతుందోనని భయపడ్డాయి ముస్లిం సేనలు.

ఆరాత్రి ఇరువాగుల సేనలు విశ్రాంతి దీసుకొనడాని కేర్పాట్లు గావించుకొన్నవి. కాపయ్య,వేమారెడ్డి,సోమదేవుడు, అన్నమదేవుడు, బల్లాలుడు ఒక శిబిరంలో చేరి మరునాడేవిధంగా పోరాడాలో చర్చించుకొన్నారు. ఒక వారంలో ఫలితాన్ని అటోఇటో తేల్చి వేయాలనుకున్నారు.

ఆ నాడు చాల చీకటిగా వున్నది. కళ్లు పొడుచుకున్నా కిన బడనట్లుగా అంధకారం ఆ ప్రాంతాన్ని ఆవరించుకున్నది. అచ్చట వున్న ఇరువాగుల సైన్యం ఆ అంధకారంలో మనిషి మటుమాయమైనట్లున్నది.

ఇరువైపులనున్న సైన్యాలు అలసి సొలసి ఆదమర్చి నిద్రిస్తున్నాయి. ఖాసిం, అబ్దుల్లాలు గూడ తమ శిబిరాలలో నిద్రిస్తున్నారు. ఆ సమయంలో ఎవరో తిన్నగా ఖాసిం గుడారంలో ప్రవేశించారు.

ఖాసిం హాయిగా నిద్రిస్తున్నాడు. ఆ గుడారంలో వున్న సన్నని దివ్వె వెలుగులో అతని ముఖం చక్కగా కనిపిస్తున్నది. ఆ వచ్చిన వ్యక్తి నల్లని వస్త్రాచ్ఛాదనలో వున్నాడు. అతడచ్చట నిలబడి ఒకక్షణం ఆలోచించాడు. ఆ మీద తల పకింది ఖాసిం వద్దకు వెళ్లాడు. తిన్నగా అతణ్ణి తట్టి లేపాడు. ఖాసిం ఉలికి పడి లేచాడు. లేస్తూనే కళ్లు నలుపుకొని ఆ యాగంతకుని వైపు చూచాడు. ఆ కొత్త వ్యక్తి తన తలమీదనున్న ముసుగును తీసి వేశాడు. అతణ్ణి చూచినప్పుడు ఖాసిం తన్ను తానే నమ్మలేక పోయాడు.

వెంటనే ఖాసిం లేచి నిలబడి "మీరా. మీరెందుకు వచ్చారు?" అన్నాడు.

"నేనెవరో నీకు తెలుసా?" ప్రశ్నించాడు ఆ కొత్త వ్యక్తి.

"మీరు విద్యారణ్యయతీంద్రులు గదా.?" అన్నాడు ఖాసిం.

యతీంద్రుని కతని మాటలాశ్చర్యాన్ని గలిగించాయి. తానతనికెలా దెలుసు?

"ఈ సమయంలో శిబిరంలోకి మీరెందుకు వచ్చారు?" ప్రశ్నించాడు ఖాసిం.

"నేను నీకెలా తెలుసు?" అని అడిగాడు యతీంద్రుడతణ్ణి పరికిస్తూ. ఆ ముఖం విద్యారణ్యునికి పరిచయమైనట్లుగానే వుంది. కాని అతడెవరో గుర్తు రాలేదు.

"రండి కూర్చోండి. మిమ్మల్ని దర్శించే అవకాశం కలిగినందుకు నేనదృష్టవంతుణ్ణి. నన్ను మీరు మరచినట్లున్నారు. నేను హరిహర రాయుణ్ణి. మీ దర్శనం కోసం నేను శృంగేరికి రెండు మూడు సార్లు వచ్చివున్నాను."

"ఇచ్చటికెవరూ రారుగదా?" అన్నాదు యోగీంద్రుడు.

"ఎవరూ రారు. బయటనున్న కాపలా సైనికులు నిద్ర బోతున్నారు గావాలి."

"అవును. మనమిక్కడ మాట్లాడుకోవచ్చునా?"

"మాట్లాడుకోవచ్చు. నేను పిలిచేవరకు లోనికెవ్వరూ రారు." అన్నాడు ఖాసిం.

ఇద్దరూ కూర్చున్నారు.

"నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడమనికి వచ్చాను." అన్నాడు యోగీంద్రుడు.

చాలా ధైర్యం చేశారు. మిమ్మెవ్వరూ చూడలేదనుకొంటాను."

అందరూ గాఢంగా నిద్రపోతున్నారు. అందువల్ల రాగలిగాను."

"మరెవరైనా వచ్చారా?"

"భోగనాథుడు వచ్చాడు?"

"ఏవరు?"

"నా సోదరుడు."

" అందెచ్చటున్నాడు."

" సైన్యాన్ని కాపల ఉన్నాడు "

హరిహరరాయలు మాట్లాడలేదు.

యోగీంద్రుడు కూడ మాట్లాడలేదు.

ఆ ప్రాంతంలో కొన్ని క్షణాలు నిశ్శబ్దం రాజ్యమేలింది.

" నీతో మరొక సేనాధిపతి వచ్చాడని విన్నాను అతనెవరో?" ప్రశ్నించాడు యోగీంద్రుడు.

" అతడు నా సోదరుడు. బుక్కరాయలు "

" ఓహో అలాగా. అయితే పరవాలేదు నేను మీరెవరో ననుకొన్నాను. మహమ్మదీయులయిన హిందూనాయకులిద్దరు దక్షిణాపథం మీదికి దండెత్తుతున్నారని విన్నాను. వారు మీరనుకో లేదు. ఎవరైనాసరే వారితో కలిసి మాట్లాడాలనే నిర్ణయంతో నేను ఈ శిబిరానికి వచ్చాను."

" ఏమి మాట్లాడాలనుకొన్నారు ?"

" హిందూ ధర్మాన్ని రక్షించమని మిమ్మల్ని కోరడానికి వచ్చాను "

" మేమా ? మహమ్మదీయులమైన మేమా ?"

" మీరెలా మహమ్మదీయులవుతారు ?"

" మతాన్ని మార్చుకొన్నాము. పేర్లను మార్చుకొన్నాము వేషాలను మార్చు కొన్నాము ఇక మహమ్మదీయులంగాక మరే మవుతాము ?"

యతీంద్రుడు నవ్వాడు.

" పేర్లు ! వేషాలు మార్చుకొన్నంత మాత్రాన మతం మార్చినట్లేనా ? మీ హృదయం మారాలిగదా ?

హరిహరరాయలు మాట్లాడలేదు.

" తానెన్ని ఏన ముస్లిం సైన్యాధిపతులు చేయలేని పనిని సుల్తాను హిందువులైన మీ చేత చేయించాలని ప్రయత్నిస్తున్నాడు. స్వాతంత్ర్యపిపాసతో. స్వధర్మ రక్షణ దీక్షతో పోరాడుతున్న హిందువులనందరినీ నాశనం గావించాలని అతడు ప్రయత్నిస్తున్నాడు. అతని కోరికే నెరవేరితే యీ దేశంలో హైందవానికే తావుండదు." అన్నాడు యతీంద్రుడు.

" అది నిజమేకావచ్చు. కాని మేమీనాడు సుల్తాను సేనాధి పతులము అతడు మాలో ఎంతో విశ్వాసముంచాడు. లక్షల సైన్యాన్ని మా యధీనంలో వుంచాడు."

" నీ వలా ఆలోచించగూడదు. సుల్తాను స్వార్థంతో మిమ్మల్ని ఈ పనికి నియోగించాడు. మీ మీద ప్రేమచేతగాదు. మీరు జయించిన తరువాత మిమ్మల్ని మీ పదవులలో వుండనిస్తాడనే నమ్మకం మేమున్నది. మిమ్మల్ని బ్రతకనిస్తాడనే విశ్వాస మేమున్నది."

హరిహరరాయలాలోచనలో పడ్డాడు

యతీంద్రుడు అట్టే చూడసాగాడు

" హరిహరరాయా ! జీవితంలో కొన్నే అవకాశాలు వస్తాయి ఆయవకాశాలను జారవిడుచుకొంటే అవి మరలా రావు ఈనాడు మీరు న్యాయమైన నిర్ణయం చేయాలి ముస్లిం సేనల్ని వదలి వేయాలి."

హరిహరరాయలు తిరిగి పడ్డాడు.

" ఎలా వదలగలం."

యతీంద్రుడు నవ్వాడు.

" మనసున్నంచే ఏదైనా చేయవచ్చు "

హరిహరరాయలేమీ మాట్లాడ లేదు

రాయా. ఒక ప్రశ్న అడుగుతాను చెప్పు. హిందువులందరినీ నాశనం చేయడం నీ కిష్టమా ? వారి ఆస్తుల్ని కొల్లగొట్టడం నీకిష్టమా ? వారి స్త్రీలను అవమానించడం నీ కిష్టమా ? ఇందులో నీకేది యిష్టం ?"

" నా కేదీయిష్టం లేదు " అన్నాడు హరిహరరాయలు.

" అయితే ఎందుకీ యుద్ధం ?"

" రాజ్యాలను జయించడానికే గాని మరొకందుకు గాదు. మా సేనల నెదిరించిన వారిని తప్ప మరెవరినీ మేము తాకము "

విద్యారణ్యుడు నవ్వాడు.

" కుమారా ! అది యేకోరిక. మీరలా చేయలేరు. సేనా నాయకులైన మీరు మాత్రమే హిందువులు. తక్కిన వారందరూ మహమ్మదీయులు. తప్పని సరిగా వారు హిందువుల్ని నానా హింసలు పెడుతారు. వారి స్త్రీలను చెరబడుతారు. వారినవమానిస్తారు "

" వారి అకృత్యాలను మేమడ్డుకోలేమంటారా ?"

" తప్పని సరిగా అడ్డుకోలేరు."

హరిహరుడు మాట్లాడలేదు.

సుల్తాను కెంత సేవచేసినా లాభంలేదు. మీ రోడినా గెలిచినా ప్రమాదముంది. కాని మీరు హిందువుల పక్షం వహిస్తే తప్పని సరిగా దక్షిణాపథానికి చక్రవర్తులవుతారు.

హరి హరుడు యతీంద్రుని ముఖంలోకి చూచాడు. ఆ యతీంద్రుని ముఖం వెలిగిపోతున్నది. విద్యారణ్యుడు మరలా మాట్లాడదొడగాడు.

"హరిహర రాయా! మీ యన్నదమ్ములు కోరింది పదవులేగదా! అందుకోసమేగదా మీరు సుల్తాను సేనానులయినది. నేను చెప్పినట్లు

చేయండి. ఆ పదవులు మీకు వస్తాయి. హిందూ నాయకులందరూ మీ యాధిపత్యాన్ని అంగీకరిస్తారు.

సుల్తాను మంచివాడేమీగాడు. అతడు కుట్రచేసి ప్రతాపరుద్రుణ్ణి బంధించాడు. కుట్రగావించి చంపించి కైవశంగావించు కొన్నాడు. కుట్రలో మిమ్మల్ని దక్షిణాపథంమీదకి పంపాడు. అతనికి సాయం చేయడం అధర్మానికి, అక్రమానికి, అన్యాయానికి, కుట్రకు, కుయుక్తికి తోడ్పడడమే అవుతుంది

నా మాట వినండి. హిందూ సేనలతో కలసిపోండి. అప్పుడు హిందువుల ఆధిపత్యం, వారి మతం, వారి ధర్మం, వారి నాగరికత, వారి సంస్కృతి రక్షించబడుతాయి.

ఆ దినం నీవు చూచావు కావా? ఏ విధంగా నీ యన్న దమ్ము లీతురుష్క సైనికులకు కత్తుల కెరజేయబడారో. కాని వారందరూ ఎందుకావిధంగా ప్రాణాలివ్వాలి? ఎందుకావిధంగా ఆత్మార్పణం గావించాలి? స్వమత రక్షణకోసం, స్వధర్మాన్ని నిలిపి వుంచడంకోసం. ఆనాడు మరణించిన వేలకొలది హిందూ సైనికుల కంటె మీరెలా అధికులు? వారి రక్తంతో మీరు రాజ్యాలు కడతారా? వారి శవాలమీద తురుష్క సైన్యాలను నడిపిస్తారా? ఏమి హరిహరరాయ? ఏమి మాట్లాడవు? నీవు హిందూ మతస్థుడవు గాదా? నీలో హిందూ రక్తంలేదా? నీకు హైందవలోకం కన బడదా? వారి ఆర్తనాదాలు, వారి ఆక్రందనలు వినబడవా?

ఇదో చూడు. వారు మిమ్మల్ని పిలుస్తున్నారు. మీకోసం వేచివున్నారు, మీరు వెడితే కౌగిలించుకొనడానికి, మిమ్మల్ని ఊరేగించడానికి సిద్ధంగా వున్నారు. మీరు త్వరగా నిర్ణయించు కోవాలి.

హరిహరుని మనస్సు సందిగ్ధావస్థలోపడింది. ఆనాటి యుద్ధం లోనే అతని మనస్సు కొంత మారివున్నది. ఆ పోరాటంలో హిందువులు పడిపోతుంటే అతని హృదయం చెక్కుబోయింది. ఆ వీరాధి వీరులు, ఆ యోధాను యోధులు, కొదమ సింగాలలాగా పైబడి వచ్చారు. మృత్యువన్న లెక్కచేయక పోరాడారు. ఏమీ మాట్లాడవు. నీ సోదరునితో గూడ చర్చించి నిర్ణయించుకో.

ఇక వ్యవధిలేదు. రేపు మరలా పోరాటానికి సిద్ధంకావలసి వుంటుంది"

"ఒకవేళ మేము ఈ సేనల్ని విడిచి వచ్చినా మమ్మల్ని హిందూ నాయకులు ఎలా నమ్మగలరు?"

"నమ్మింపజేయడం నావంతు."

"మహమ్మదీయులమైన మమ్మల్ని వారు స్వీకరించగలరా?"

"మిరు మహమ్మదీయులని యెవరన్నారు? పేర్లు, వేషాలు మారినంత మాత్రాన ఎవరూ ముస్లిములుగారు. మిమ్మల్ని నేను హిందువుల్నిగా చేస్తాను. మీరు హిందువులుగా ఇతరులచేత అంగీకరింప జేస్తాను" నవ్వుతూ అన్నాడు యతీంద్రుడు

"నేను నిర్ణయించుకొన్నాను యతీంద్రా. బుక్కరాయలకు గూడ నచ్చజెబుతాను. కాని మేమేమి చేయాలో మీరు చెప్పాలి. నాకేమీ తోచడంలేదు"

"మీరా? రేపు పోరాటం మొదలవుతుంది. అప్పుడు మీరు ముందుకువచ్చి హిందూ సేనలలో కలిసిపోండి. మీరే ఆ సేనలకు నాయకులై ముస్లిం సేనలతో పోరాడవచ్చు."

"అది మనవారికంతగా లాభించదు. మనవారు పోరాడవ్వండి. మేము మా సైన్యాల్ని సరిగా నడపకుండా ఆ సైన్యాలకు మంచి వీలును గలిగిస్తాము. అప్పుడు ఆ సేనలు మా సేనల్ని చితుకగొట్ట డానికి వీలుంటుంది. అలా జరిగితే మా సేనావాహినులు చాలవరకు నష్టపడిన తరువాత మేము ఆ సేనలతో కలుసుకొంటాము."

"సరే. మీ యిష్టంవచ్చినట్లే చేయండి. ఇక వస్తాను. మీ యభిప్రాయాల్ని వారికి తెలియచేస్తాను."

"మీరొంటరిగా ఎలా పోగలరు?"


"వచ్చిన విధంగానే" అంటూ వెళ్ళసాగాడు యతీంద్రుడు.

శిబిరద్వారంవరకు వచ్చి ఆగాడు హరిహరరాయలు. యతీంద్రుడాయంధకారంలో మరుగయ్యాడు.

రచయితలకు విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్ పత్రిక గ్రామాల్లో సామాన్య ప్రజల దగ్గరకు వెళ్ళే పత్రిక. అందువల్ల రచనల్లో సాధ్యమైనంతవరకు సరళమైన వ్యావహారిక భాష వాడితే అనుకూలంగా వుంటుంది.

(ప్ర. సం.)



నిప్పుల కోట

తంగిరాల వెంకట సుబ్బారావు

(1-11-1972న ఝాన్సీనగరంలో వీరనారి లక్ష్మీబాయి కోటనుచూచి)

గాలిలో వీరగాథల ఘుమఘుమలు
ఎండలో శౌర్యజ్వాలల భగభగలు
ఊరినట్టనడుమ పట్టుదల గడకట్టిన పాతకోట
పౌరుషం ప్రోవుపడ్డ నిప్పులమేట
పగవానికి తలవంచనిగుండె నిబ్బరపుబురుజుల నీడలు
పోటుమానిసులకండలబండలు పేర్చిన ఎత్తైనకోటగోడలు
భారతీయుల ఓరిమిని చాటే లోతైన అగడ్త
పారతంత్ర్యానికి ఎదురుతిరిగిన వీరులకు శాశ్వతమైనపొగడ్త
కాలం వెనక్కివెనక్కినడిచి 1857ను కళ్లకుకడుతోంది
అలనాటి వీరనారి తలపుల్లో మెరిసి గగుర్పాటు పుడుతోంది

అసినిదూసి చేతబట్టుకొని
పసిబిడను నడికట్టుకొని
ప్రచండచండియై గర్జించి
పంచకల్యాణినెక్కినరాణి
నిప్పులకోటబయట
నెత్తుటిమడుగుమధ్య
కత్తులకెరటాలమీద
కల్హారంలా ఊగుతోంది.........

ఝాన్సీరాణివిగ్రహంమీద నా చూపులువాలగా —
నరాలవీణ ఉత్సాహరాగాలు పాడుతోంది
నారక్తం వీరరసంల్లోనిమగ్నమై ఉరుకుతోంది
మనసు ఊహలకుహాయిదూస్తోంది
మేను రోమాంచితాల కైజారులు తీస్తోంది......

నాటి నారీమణిశౌర్యం
నేటి ఝాన్సీనగరాన్ని ఎర్రశాలువలా కప్పివేసింది
కోటగోడల్లో ఎర్రటిఇటుకలపట్టెలుగా
వీధివాడల్లో రెడ్‌యాపిల్స్‌గుట్టలుగా
చెట్లకొమ్మల్లోచిక్కుకున్న సూర్యబింబపుగాలిపటంగా
చిల్లరబజారుదానిమ్మల్లో తాంబూలపునవ్వులజిమ్మేడి
గింజలకెంపులుగా


నేలలో,
గాలిలో,
నీలినింగిలో,
నిండుగనిలువు పాపిట్లో—
ఎర్రమన్నుగా,
కెంధూళిగా,
సంజకెంజాయగా,
చిక్కటి సింధూరంలా,
లక్ష్మీబాయిశౌర్యం బహువిధాలుగా కనిపిస్తోంది.........

వీధుల్లో టాంగాలాగే ముసలిగుర్రం
గర్వంతో బిర్రబిగుసూ పరుగెడుతోంది
లింగాటూగుతూ హొంగాఅడుగేస్తోంది
ఆ అగ్గిరాణిని వీపుమీద ఎక్కించుకొని
అమాంతంగా కోటగోడదూకి
శత్రువులనుగ్గాడింది నానే అంటోంది......

ప్రతియువతి ముఖంలోనూ
రాణీమతల్లి నవ్వుతోంది—.
అలకలవలలో వెలిగేతిలకపు నెలరాజులా
పదునుచూపుల్లో గ్రుచ్చుకునే పచ్చలపిడిబాకుల్లా
కనుపాపలచుట్టూ అల్లుకున్న ఎర్రజీరలపగడపుతీగల్లా
వీరనారీమణి వింతగానవ్వుతోంది.........


వంటింట్లో పనిచేత బట్టినగరిటె
కరవాలంలా కనిపిస్తోంది
కాలసర్పంలా జడిపిస్తోంది
ప్రతిబాలునిముఖంలో దత్తపుత్రుని ధైర్యం
చిరుదరహాసమై మురిపిస్తోంది............

ఈనాడు ఎత్తుగా కోటబురుజుమీద మురిసిపడే మువ్వన్నెజండా
ఆనాడు ఝాన్సీలక్ష్మికన్న స్వప్నాన్ని ఋజువుచేస్తోంది......
పోరాటాలమంటలతో పొగచూరిన ఆకాశం
'సత్యమేవజయతే' అంటూ చరిత్రలపాంచజన్యం పూరిస్తోంది



హయాత్‌నగర్‌లో ఏప్రిల్ 4న గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ హరిజన హౌసింగ్ కాలనీకి ప్రారంభోత్సవం చేస్తున్నదృశ్యం


జిల్లా వార్తలు



కేంద్ర కార్మికశాఖ ఉపమంత్రి శ్రీ జి. వెంకటస్వామి కరీంనగర్ జిల్లాలోని హుసల్ గ్రామంలో మార్చి 10న హరిజన కాలనీకి ప్రారంభోత్సవం చేశారు.




ఖమ్మంజిల్లా అశ్వారావుపేటలో ఏప్రిల్ 17నరాష్ట్ర విత్తనాలక్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రదర్శన క్షేత్రాల భారతీయ సంస్థ అధ్యక్షులు శ్రీ ఎం. ఆర్. కృష్ణ ప్రసంగిస్తున్న దృశ్యం.




గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ ఏప్రిల్ 18 న నాచారంలో తయారయిన ఆహారపదార్థాల కర్మాగారానికి శంఖుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటైన సమావేశంలో ప్రసంగిస్తున్న దృశ్యం


జిల్లా వార్తలు



గుంటూరు జిల్లా కలెక్టరు శ్రీ జయభారత రెడ్డి ఏప్రిల్ 19 న గుంటూరు ఆటోరిక్షా సహకార సంఘానికి చెందిన డ్రైవర్లకు ఆటోరిక్షాలను అందజేసిన చిత్రం



ఇటీవల ఆదిలాబాదులో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ ర్యాలీ జరిగినప్పుడు జిల్లా కలెక్టరు శ్రీ వి. ఎన్. గౌడ్ వందన స్వీకారం చేస్తున్న దృశ్యం



వరంగల్లు జిల్లా మహబూబాబాద్ తాలూకా ఇనుగుర్తి గ్రామంలో మార్చి 18 వ తేదీన హరిజనకాలనీ ప్రారంభోత్సవానికి కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ మంత్రి శ్రీ జి. వెంకటస్వామి అధ్యక్షత వహించారు.

ఆజంజాహి మిల్లు కార్మికుల కోర్కెలు

కేంద్రకార్మిక, పునరావాసశాఖ డిప్యూటీమంత్రి శ్రీ జి. వెంకటస్వామి ఏప్రిల్ 16వ తేదీన ఆజంజాహి మిల్లు కార్మికుల సమావేశంలో ప్రసంగిస్తూ పారిశ్రామిక శాంతి నెలకొల్పే కృషిలో కార్మికులు యాజమాన్యంతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘం కార్యదర్శి సమర్పించిన విజ్ఞప్తి గురించి ప్రస్తావించి, ప్రావిడెంటు ఫండు అప్పు, పరువుభత్యం పెంపు మొదలగు సమస్యలను పరిశీలిస్తామని మంత్రిగారు హామీ యిచ్చారు. మిల్లు లాభాలతో పనిచేస్తున్నందుకు ఆయన కార్మికులనూ, యాజమాన్యాన్నీ అభినందించారు. స్థలసేకరణ జరిపించి, కార్మికులకు యిండ్లస్థలాలు మంజూరు చేయించుకొనే ప్రయత్నంలో కృషిచేయవలసిందని కార్మికులకూ, బంజరుభూముల్ని కార్మికులకు కేటాయించాలని యాజమాన్యానికీ మంత్రిగారు విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘం అధ్యక్షులు సుందరరాజన్ అధ్యక్షత వహించారు. సర్వశ్రీ గోవిందసింగ్ ఎం. ఎల్. సి. కార్మికనాయకుడు ఎస్. ఆర్. వెంకటస్వామి, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీ గుడిమళ్ళ రాజలింగం, వై. వైకుంఠ, సుదర్శన్ ప్రభృతులు కూడా ప్రసంగించారు.

సంగారెడ్డి పండ్ల పరిశోధన కేంద్రం

గవర్నరు సలహాదారు శ్రీ వి. కె. రావు ఏప్రిల్ 17 వ తేదీన సంగారెడ్డిలోని పండ్ల పరిశోధన కేంద్రం సందర్శించారు. హార్టికల్చరిస్ట్ శ్రీ బి. వి. రామారావు, శ్రీ వి కె. రావు గారిని తోట అంతా త్రిప్పిచూపించారు. ఉత్తర హిందూస్థాన్, దక్షిణ హిందూస్థానములకు చెందిన పండ్లరకాలను పెంచడానికి యిక్కడి వాతావరణం అనుకూలంగా వున్నదనీ, అందువల్ల భారత వ్యవసాయ పరిశోధన సంస్థవారు మామిడిపండ్లకు సంబంధించి అఖిల భారత స్థాయి అభివృద్ధి పథకం అమలుకు యీ కేంద్రాన్ని ఎన్నిక చేశారనీ రామారావుగారు చెప్పారు. ఈ పరిశోధన కేంద్రం 65.1 హెక్టార్ల మేరలో నెలకొల్పబడింది. 310 మామిడి పండ్ల రకాలను యీ కేంద్రం అభివృద్ధి పరిచింది.

గుంటూరులో బియ్యం సేకరణ

గుంటూరు జిల్లాలో యింతవరకు 25 వేల టన్నుల బియ్యం సేకరణ జరిగిందనీ, వచ్చే రెండు నెలల కాలంలో యింకా 30 వేల టన్నులు సేకరించబడుతాయనీ గుంటూరు జిల్లా కలెక్టరు శ్రీ కె. జయభారతరెడ్డి ఏప్రిల్ 16 వ తేదీన పత్రికలవారితో ప్రసంగిస్తూ చెప్పారు. ఈ యేడు రబీ పంటకాలం నుండి $2\frac{1}{2}$ ఎకరాలకంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల వద్దనుండి ఎకరానికి 3 క్వింటాళ్ల వంతున లెవీధాన్యం వసూలు చేస్తారని చెప్తూ, యీ పథకం విజయవంతం కావడానికి ప్రభుత్వంతో సహకరించవలసిందని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.

తయారైన ఆహార పదార్థాల ఫ్యాక్టరీ

నాచారం పారిశ్రామిక ప్రాంతంలో ఏప్రిల్ 18 వ తేదీన గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్, తయారైన ఆహార పదార్థాల ఫ్యాక్టరీకి శంఖుస్థాపన చేశారు. ఇంకా యిటువంటి ఫ్యాక్టరీలు రాష్ట్రంలో ఏర్పడడానికి యిది నాంది అని ఆ సందర్భంలో ప్రసంగిస్తూ ఆయన అన్నారు. ఈ ఫ్యాక్టరీలో తయారయ్యే పదార్థాలు హైదరాబాదు, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ, రాజధానిలోని శిశుపోషకాహార పథకాలలోనూ ఉపయోగిస్తారు. ఆరంభంలో ముఠకులు తయారుచేస్తారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎన్. భగవాన్‌దాస్ ఈసమావేశానికి అధ్యక్షత వహించారు. పిల్లలను మానసికంగానూ, శరీరకంగానూ చక్కగా అభివృద్ధి పరచవలసిన ఆవశ్యకతను గురించి పేర్కొంటూ, యిది గత 10 ఏండ్లుగా రాష్ట్రంలో జరిగిన కృషి ఫలితమని శ్రీ సరీన్ వర్ణించారు. సంఘంలోని బలహీనవర్గాల ప్రజలకుకూడా సరసమైన ధరలకు యీ పదార్థాలు అందించవచ్చునని ఆయన సూచించారు. విద్యాశాఖ కార్యదర్శి శ్రీ ఎం. వి. రాజగోపాల్‌కూడా యీ సందర్భంగా ప్రసంగించారు. న్యూఢిల్లీలోని కేర్‌సంస్థ డైరక్టరు ఛార్లెస్ సైక్స్ నివేదిక సమర్పించారు.

తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సమావేశం

తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సభ కాకినాడలో ఏప్రిల్ 12న జరిగింది. దీనికి జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ ఎస్. బి.

పి. బి. కె. సత్యనారాయణ రావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో 1972-73 సంవత్సరానికి సవరించిన బడ్జెటును, 1973-74 సంవత్సరానికి బడ్జెటు అంచనాలను ఆమోదించారు. నాలుగు ఏజెన్సీ బ్లాకుల్లోనూ నాలుగు పంచాయతీ ఘర్‌లను నిర్మించడానికి, కాకినాడలో ఒక గిడ్డంగి నిర్మించడానికి, నాలుగు ఏజెన్సీ బ్లాకు ప్రధాన కార్య స్థానాలలోనూ నాలుగు జంట క్వార్టర్లను నిర్మించడానికి బడ్జెటులో ప్రతిపాదించారు.

కార్యదర్శి శ్రీ ఎం. సెబాస్టియన్‌రాజు యీ బడ్జెటులోని ముఖ్యాంశాలను వివరించారు.

రైతుల పరిశీలక పర్యటన

వెంకటాచలం, గుత్తూరు, కోట, రాపూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట, ఇందుకూరుపేట పంచాయతీ సమితులకు చెందిన 10 మంది అభ్యుదయకర్షకులు యిటీవల కోట పంచాయతీ సమితికి చెందిన కొత్తపాలెం గ్రామాన్ని సందర్శించారు. ఈ గ్రామంలో రైతులు 1684 ఎకరాలలో ఐ.ఆర్-20, ఐ.ఆర్-8 వరిరకాల్ని పండించారు. ఈ రకాలవల్ల ఎకరానికి 2,000 రూపాయలు ఆదాయం లభించవచ్చని యిక్కడి రైతులు ఆశిస్తున్నారు.

హరిజన కాలనీకి శంకుస్థాపన

కేంద్రన్యాయశాఖ ఉపమంత్రి శ్రీ జి. వెంకటస్వామి ఏప్రిల్ 11న సూర్యాపేటలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఒక హరిజన కాలనీకి శంకుస్థాపనచేస్తూ హరిజనులకు డా॥ అంబేద్కర్ చేసిన సేవను కొనియాడారు. సంఘంలో బలహీనవర్గాల సంక్షేమానికి, అభ్యుదయానికి మనప్రధాని అనేకచర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లాపరిషత్తు, పురపాలకసంఘ కార్మికుల సంఘానికి మంత్రిగారు ప్రారంభోత్సవం జరిపారు.

సూర్యాపేటలో కొత్త పరిశ్రమకు ప్రారంభోత్సవం

పరిశ్రమల శాఖ డైరక్టరు శ్రీ నరేంద్రలూథర్ ఏప్రిల్ 11న సూర్యాపేటలోని ప్రభుత్వ ప్రారిశ్రామిక వాడలో శ్రీ రామ కృష్ణ ఇండస్ట్రీస్ స్టీల్ రిరోలింగ్ మిల్స్‌కు ప్రారంభోత్సవం చేశారు. వెనుకబడిన ప్రాంతాలలో కొత్తపరిశ్రమల్ని నెలకొల్పడానికి ప్రభుత్వం యిచ్చే సబ్సిడీని 10 శాతం నుంచి 15 శాతానికి పెంచిందని చెప్పారు. పరిశ్రమల అభివృద్ధికి వీలయినన్ని సౌకర్యాల్ని పరిశ్రమలశాఖ కల్పిస్తుందని కూడా తెలియజేశారు. ఈ మిల్లు నెలకొల్పడానికి మొత్తం రూ. 17 లక్షలు ఖర్చయింది. దీనిలో 60 మందికి ఉపాధి లభిస్తుంది.


జిల్లా కలెక్టరు శ్రీ ఎల్. సుబ్బయ్య యీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధ్యక్షతవహిస్తూ గ్రామీణ పారిశ్రామికాభివృద్ధి ప్రాజెక్టు క్రింద గతఏడాది రూ. 10 లక్షల మేరకు ఋణాలు యివ్వడం జరిగిందనీ, రూ. 13,50,000ల ఖర్చయ్యే 100 పథకాల్ని మంజూరు చేయడం జరిగిందనీ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా శాసన సభ్యుడు శ్రీ వె. గోపయ్య ప్రసంగించారు. పారిశ్రామికవాడ ఉత్పత్తిదార్ల అధ్యక్షుడు శ్రీ ఎం. సత్యనారాయణ పరిశ్రమలశాఖ డైరెక్టరుకు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు.

వావిలాలకు తామ్ర పత్ర ప్రదానం

గుంటూరు జిల్లా కలెక్టరు శ్రీ కె. జయభారత రెడ్డి ఏప్రిల్ 13 న మాజీ శాసన సభ్యుడు శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్యగారికి తామ్ర పత్రాన్ని అందజేశారు. గుంటూరులోని రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలోని కోర్టుహాల్‌లో యీ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. చాలా కాలం క్రితం స్వాతంత్ర్య పోరాట కాలంలో యిదే హాలులో శ్రీ వావిలాలపై న్యాయ విచారణ జరిగి కారాగార శిక్ష విధించబడింది. ఈ జిల్లాలో 1939 లో భారత రక్షణ చట్టం క్రింద శిక్షింపబడిన వారిలో శ్రీ వావిలాల మొట్టమొదటివారు.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో శ్రీ వావిలాల 9 సంవత్సరాలు కారాగార శిక్ష అనుభవించారు. 13 సార్లు అరెస్టు అయ్యారు.




జిల్లా కలెక్టరు వావిలాలకు తామ్రపత్రం ప్రదానం చేస్తున్నదృశ్యం

ఇళ్ళనిర్మాణానికి ఆర్థిక సహాయం

మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి బ్లాకుకుచెందిన మిరిసిపల్లి జయంతి గ్రామంలో 54 మంది హరిజనులకు, 6 గురు వెనుకబడిన తరగతులవారికి ఇళ్ళ నిర్మాణానికిగాను ఏప్రిల్‌నెలలో జిల్లా సాంఘిక సంక్షేమాధికారి రూ. 6,000 లు పంపిణీచేశారు.

చంద్‌నగర్ హౌసింగ్ కాలనీ

ఆదిలాబాదులో 28 ఇళ్ళుగల చంద్‌నగర్ హౌసింగ్ కాలనీకి ఏప్రిల్ రెండోవారంలో రెవిన్యూబోర్డు రెండవసభ్యుడు శ్రీ ఇక్బాల్ చంద్ ప్రారంభోత్సవం చేశారు. ఈ ఇళ్ళను ఆదిలాబాదు షెడ్యూలు కులాల, షెడ్యూలు తరగతుల సహకార గృహనిర్మాణ సంఘం నిర్మించింది. లైన్సుక్లబ్ వారు బహూకరించిన వస్త్రాలను శ్రీమతి ఇక్బాల్ చంద్ ఈ కాలనీలోవారికి పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యుడు శ్రీ మసూద్ అహమ్మద్ అధ్యక్షత వహించారు.



ఏప్రిల్ 2న విశాఖ ఓడరేవులో భారత ప్రభుత్వం బంగ్లా దేశ్‌కు బహుమతి చేసిన 'అక్షయ' నౌక

పెరవలి పంచాయతీ సమితి సావనీర్ ఆవిష్కరణ

పెరవలి పంచాయితీ సమితి ప్రచురించిన సావనీర్‌ను ఏప్రిల్ 5న తణుకులో పశ్చిమ గోదావరి జిల్లాకలెక్టరు శ్రీ ఎస్. ఆర్. గోవిందరాజన్ ఆవిష్కరించారు. గడచిన ఎనిమిదేళ్ళుగా యీ సమితిలో వివిధరంగాలలో జరిగిన అభివృద్ధిని యీ సావనీర్ వివరిస్తున్నది. జిల్లా పౌర సంబంధాధికారి, యీ సందర్భంలో మాట్లాడుతూ యీ సావనీర్ జిల్లాలోని యితర పంచాయితీరాజ్ సంస్థలకు ఆదర్శప్రాయం కాగలదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముళ్ళపూడి తిమ్మరాజు అధ్యక్షత వహించారు. శాసన సభ్యుడు శ్రీ ఎన్. జనార్దనరావు, కార్యదర్శి, రెవిన్యూ డివిజనల్ అధికారి, మరికొందరు ప్రముఖులుకూడా ప్రసంగించారు.

హయాత్‌నగర్ హరిజన కాలనీకి ప్రారంభోత్సవం

రాష్ట్రగవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ ఏప్రిల్ 4వ తేదీన హయాత్‌నగర్‌లో 40 ఇళ్ళుగల హరిజన కాలనీకి ప్రారంభోత్సవం చేశారు. నీటి సరఫరా, తదితర అవసరాల్ని తీర్చడంలో ప్రభుత్వం అన్నివిధాలా తోడ్పడగలదని పేర్కొంటూ ప్రజల తోడ్పాటు వుంటేగాని అభివృద్ధి త్వరితంగా సాధించడం జరుగదని అన్నారు. ప్రజల కృషి ప్రగతికి పట్టుగొమ్మని తెలియజేశారు.

ఉగాది సందర్భంగా ప్రజలకు శ్రీ సరీన్ తమ శుభకాంక్షల్ని అందజేశారు. తాను ఇటీవలే అరకులో ఒక గిరిజన హౌసింగ్ కాలనీకి ప్రారంభోత్సవం చేసిన విషయం ప్రస్తావిస్తూ రాష్ట్రమంతటా యిటువంటి కాలనీలు అనేకం నిర్మింపబడుతున్నాయనీ, దీనినిబట్టి సమాజంలోని బలహీనవర్గాల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, ప్రధానమంత్రి అత్యంత శ్రద్ధాసక్తులు చూపిస్తున్నారనే విషయం స్పష్టపడుతున్నదనీ అన్నారు. రాష్ట్రంలో యీ విధంగా నిర్మించదలచిన మొత్తం 55,000 ఇళ్ళలోనూ అప్పుడే 33,511 యిళ్ళ నిర్మాణం పూర్తయినట్లు ఆయన వెల్లడి చారు. గొట్టపుబావుల త్రవ్వకం పరిత్వరత్వరగా జరిగేందుకై రాత్రింబవళ్ళు రిగ్గులు మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నాయని తెలియజేశారు.

ఈ సంచికలోని రచయితలు

శ్రీ కామరాజుగడ్డ రామచంద్రరావు, బ్లాక్ 4, ఫ్లాట్ I, పంజగుట్ట, హైదరాబాదు

శ్రీ సురమౌళి, 3-6-759, బ్లాక్ 7/2, హిమాయత్‌నగర్, హైదరాబాదు-29

శ్రీ ఎత్తోజుమాధవాచార్యులు, ప్రిన్సిపాల్, ధర్మ అప్పారావు కాలేజి, నూజివీడు, కృష్ణాజిల్లా

శ్రీ సి.వి. నరసింహారెడ్డి, పి.ఆర్.ఒ. భారతీయ ఎరువుల సంస్థ. రామగుండం, కరీంనగర్ జిల్లా

శ్రీ టి.ఎన్. జయరామరెడ్డి, బి.ఎ.పి.ఆర్.ఒ, చిత్తూరుబ్లాకు, చిత్తూరు

శ్రీ బి.ఎస్. నాగ్, c/o డా॥ ఎస్. వీరమల్లు. కవిటం' (వయా)పోడూరు, పశ్చిమగోదావరి జిల్లా

శ్రీ డా॥ చల్లా రాధాకృష్ణశర్మ, 5, నాగార్జుననగర్, మద్రాసు-24

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, 69, ఆదర్శనగర్ హైదరాబాదు-4

శ్రీ తిరుమల రామచంద్ర, c/o కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, 69, ఆదర్శనగర్, హైదరాబాదు-4

శ్రీ గంధం వేదవేశ్వరరావు, గంధం హౌస్, మహబూబ్‌నగర్

శ్రీ పి. రాజగోపాలనాయుడు, ఎం.ఎల్.సి. చిత్తూరు

శ్రీ డా॥ తంగిరాల వెంకటసుబ్బారావు, తెలుగుశాఖాధ్యక్షులు, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగుళూరు

శ్రీమతి సి. ఇందిరాదేవి, c/o డా॥ సి. వి. రాజరెడ్డి ఎం.ఎస్. ట్రంకురోడ్డు, శ్రీకాకుళం

శ్రీ వి. ఎం. మోహన్, అల్లూరు (వయా) నిజాంపట్నం, తెనాలి (ఆర్.ఎం.ఎస్.), గుంటూరు జిల్లా

PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT CENTRAL PRESS HYDERABAD
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISIM ANDHRA PRADESH, HYDERABAD.



